



ఆయన ఒక ఎస్‌ఐ. మార్కాపురం సర్కిల్ పరిధిలోని కీలక స్టేషన్‌లో పనిచేస్తున్నాడు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన ఆయన పైసల వేటలో మునిగి తేలుతున్నాడు. పోలీసు స్టేషన్‌నే సెటిల్మెంట్లకు అడ్డాగా మార్చుకున్నాడు. బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేయకుండా పంచాయితీలు చేస్తున్నాడు. అందుకోసం ప్రత్యేకంగా ఇద్దరు కానిస్టేబుళ్లను నియమించుకున్నాడు. మరోవైపు అనధికార రెస్టారెంట్లు, గంజాయి విక్రేతలు, మట్కా నిర్వాహకుల నుంచి నెలవారీ పెద్దమొత్తంలో మామూళ్లు తీసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. గత వైసీపీ పాలనలో ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి సిఫార్సుతో పోస్టింగ్ పొందిన ఆయన అక్రమార్జనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాడు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బదిలీ ఖాయమని భావించిన ఆ ఎస్సై వసూళ్లపర్వాన్ని మరింత ముమ్మరం చేశాడు. దీంతో స్టేషన్ గడపతొక్కాలంటేనే ప్రజలు గడగడలాడుతున్నారు.

ఆయన రూటే సపరేటు

స్టేషన్‌లోనే ఎస్‌ఐ సెటిల్మెంట్లు



- కాసులివ్వకుంటే కేసులు
- ఫిర్యాదుదారులకే బెదిరింపులు
- నెలవారీ మామూళ్లు సరేసరి
- వసూళ్లు, పంచాయితీలకు ప్రత్యేకంగా ఇద్దరు కానిస్టేబుళ్లు
- ఉన్నతాధికారులను సైతం లెక్కచేయని వైనం
- గతంలో ఒకసారి సస్పెండ్
- అయినా మారని తీరు

మార్కాపురం, జూలై 22 : మార్కాపురం సర్కిల్ పరిధిలో రెండు పోలీసు స్టేషన్‌లు ఉన్నాయి. అందులో కీలకమైన స్టేషన్ అది. అక్కడికి నిత్యం బాధితులు వస్తుంటారు. వారికి అండగా నిలిచి న్యాయం చేయాల్సిన ఎస్సై నరకం చూపుతున్నాడు. తమకు అన్యాయం జరిగిందని ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయకుండా కాసుల కోసం డిమాండ్ చేస్తున్నాడు. ఇరుపక్షాలను కూర్చోబెట్టి పంచాయితీలు చేస్తున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ సెటిల్మెంట్ల కోసమే ప్రత్యేకంగా ఇద్దరు కానిస్టేబుళ్లను నియమించుకున్నట్లు విమర్శలున్నాయి. వీరు చెప్పిన మాట విని అడిగినంత చెల్లిస్తే సరే.. లేకుంటే ఇరుపక్షాలపై కేసులు నమోదు చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం క్రితం ఓ మహిళ పట్టణ పోలీసు స్టేషన్‌కు వచ్చింది. తన వద్ద డబ్బులు తీసుకున్న వ్యక్తిని తిరిగి అడిగితే దౌర్జన్యం చేస్తున్నాడని ఫిర్యాదు చేసింది. ఈ విషయమై దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేయకుండా ఆయన్ను స్టేషన్‌కు పిలిపించి అక్కడే సదరు ఎస్సై పంచాయితీ పెట్టారు. ముందుగానే మహిళపై దౌర్జన్యానికి దిగిన వ్యక్తితో బేరం కుదుర్చుకున్నాడు. అనంతరం మహిళను పిలిచి కేసు విషయంలో సర్దుకు పోవాల్సిందే అని హుకుం జారీ చేశాడు. ఆ పంచాయితీ జరుగుతున్న సమయంలో దౌర్జన్యానికి దిగిన వ్యక్తే ఫిర్యాదు చేసిన మహిళను పోలీసుల సమక్షంలో పరుష పదజాలంతో దూషించాడు. అయినా ఆ అధికారి పట్టించుకోలేదు. చివరికి ఫిర్యాదు చేసిన ఆమెపైనే ఒత్తిడి తెచ్చి కేసును పంచాయితీతో మమ అనిపించాడు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే ఇలాంటి ఆరోపణలు ఆయనపై అనేకం ఉన్నాయి.

మధ్యవర్తిగా ఉపాధ్యాయుడు

ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఒకరు నిత్యం పోలీసు స్టేషన్ వద్దే కాపుకాచి ఉంటాడు. ఆయన ఒక ఉపాధ్యాయ సంఘంలో నాయకుడిగాను కొనసాగుతున్నాడు. ఫిర్యాదు చేయడానికి వచ్చే వారిని బయటనే ఆపి తాను అధికారితో మాట్లాడి మీకు న్యాయం చేయిస్తానని దందా మొదలుపెడతాడు. ఆయన గతం నుంచి ఈవిధంగా వ్యవహరిస్తున్నా ప్రస్తుత ఎస్సై కూడా ప్రోత్సహిస్తున్నాడు. ఎలాంటి ఇబ్బందిలేకుండా ఆ ఉపాధ్యాయుడి ద్వారా పంచాయితీలు చేయిస్తూ జేబులు నింపుకుంటున్నాడు.

గతంలో వైసీపీ నేతల అండ

కరోనా సమయంలో ఈ ఎస్సై పనిచేసిన చోట నాటుసారా తయారీదారులు, దుకాణాల యజమానుల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఈనేపథ్యంలో సస్పెండ్ కూడా అయ్యాడు. తిరిగి విధుల్లో చేరినా ఆయన తీరు మాత్రం మారలేదు. పాత పంథానే కొనసాగిస్తున్నాడు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి సిఫార్సుతో మార్కాపురంలో పోస్టింగ్ పొందిన ఆయన.. వచ్చినప్పటి నుంచి అక్రమార్జనలో మునిగితేలుతున్నాడు. వైసీపీ పాలనలో ఈయన ఆడిందే ఆట పాడిందే పాటగా సాగింది. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ఎస్సై బదిలీ ఖాయమని తేలిపోయింది. ఉన్న కొద్ది సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న ఉద్దేశంతో వసూళ్ల పర్వాన్ని మరింత ముమ్మరం చేశాడు. 'ఎలాగూ వెళ్లిపోతున్నా.. ఎవరేమనుకుంటే నాకేంటి' అన్న చందంగా వ్యవహరిస్తున్నాడు.

అక్రమ వసూళ్లకు కొదవలేదు

పోలీసు స్టేషన్ పరిధిలో అక్రమ దందాలను ఆ ఎస్సై పరోక్షంగా ప్రోత్సహిస్తున్నాడన్న విమర్శలున్నాయి. అనధికార రెస్టారెంట్ల వద్ద నుంచి నెలవారీ ఆయనకు మామూళ్ల ముడుతున్నట్లు తెలిసింది. ఇలా నెలకు సుమారు రూ.లక్షల్లోనే అందుతున్నట్లు సమాచారం. అంతేకాక పట్టణంలో గంజాయి విక్రయం యథేచ్ఛగా జరుగుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నాడు. సరఫరాదారుల నుంచి ముడుపులు అందడమే ఇందుకు కారణమన్న ఆరోపణలున్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో యువత గంజాయి తాగి దౌర్జన్యాలు, గొడవలకు దిగుతున్నా కట్టడి చేయడానికి కనీస చర్యలు తీసుకోవడం లేదు. ఇవే కాక మట్కా కూడా పట్టణంలో జోరుగా నడుస్తోంది. ఈ వ్యవహారంలో ఓ కానిస్టేబుల్ పాత్ర కూడా ఉంది. ఆ కానిస్టేబుల్ ద్వారా సదరు ఎస్సైకి సొమ్ము అందుతుండటంతో కట్టడిపై ప్రత్యేక దృష్టిసారించడం లేదని తెలుస్తోంది. ఎన్నికల సమయంలో కూడా ఆ ఎస్సై పెద్దఎత్తునే చేతివాటం చూపినట్లు బహిరంగంగానే చర్చ నడిచింది.

ఇష్టం లేకపోతే పంపించేయండి

ఎస్సై చేస్తున్న పంచాయితీలు, అక్రమ దందాల విషయం గురించి తెలుసుకున్న సర్కిల్, డివిజన్ స్థాయి ఉన్నతాధికారులు పలుమార్లు ఆయన్ను హెచ్చరించారు. అయినా తీరులో మార్పు రావడం లేదు. మీకు ఇష్టం లేకపోతే ఇక్కడి నుంచి పంపించేయండి అని తెగేసి చెప్తుండటం ఆయన బరితెగింపును తెలియజేస్తోంది. ఇదేక్రమంలో తనను వేధింపులకు గురిచేస్తున్నాడంటూ ఆయనే తనకన్నా పైస్థాయిలో ఉన్న అధికారులపై ఇటీవల జిల్లా పోలీసు బాస్‌కు ఫిర్యాదు చేసినట్లు కూడా తెలిసింది. ఈ విషయమై స్పెషల్ బ్రాంచ్ విభాగం ఇప్పటికే సమాచారం సేకరించింది. అందులో ఎస్సై వ్యవహార శైలే బాగాలేదని నివేదికను కూడా పంపినట్లు తెలిసింది. ఈనేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సి ఉంది.



ఓబీసీ హెడ్ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఓబీసీకి చేరిన సాగర్ జలాలు

- చౌర్యం జరగకుండా అన్ని మేజర్లు మూసివేత

దర్శి, జూలై 22: మంచినీటి చెరువులకు నీరు నింపేందుకు విడుదల చేసిన సాగర్ జలాలు సోమవారం దర్శి సమీపంలోని ఒంగోలు బ్రాంచ్ కాలువ(ఓబీసీ)లోకి ప్రవేశించాయి. సాగర్ డ్యాం నుంచి మూడు రోజుల క్రితం తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేసిన విషయం విదితమే. ప్రస్తుతం సాగర్ కుడి కాలువ నుంచి 5,500 క్యూసెక్కుల నీరు వస్తోంది. జిల్లా సరిహద్దు అయిన 88/3వ మైలు వద్ద 2,646 క్యూసెక్కులు సరఫరా అవుతోంది. అక్కడి నుంచి దిగువన ఉన్న దర్శి బ్రాంచ్ కాలువకు 1,800 క్యూసెక్కులు, ఒంగోలు బ్రాంచ్ కాలువకు 883 క్యూసెక్కులు పంపిణీ అవుతోంది. నీరు దుర్వినియోగం కాకుండా అధికారులు అన్ని మేజర్లను మూసేశారు. ఎన్ఎస్‌పీ డీఈ అక్బర్‌బాషా ఆధ్వర్యంలో కాలువలపై పర్యవేక్షణ చేస్తున్నారు. రామతీర్థం జలాశయంతోపాటు జిల్లాలోని మంచి నీటి చెరువులకు పూర్తిగా నింపుతారు. ఈసందర్భంగా డీఈ మాట్లాడుతూ రైతులు సాగర్ జలాల చౌర్యానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం విడుదలైన నీరు తాగు అవసరాలకు మాత్రమేనన్న విషయాన్ని గమనించాలని కోరారు.



ప్రజల సమస్యలను వింటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం
- మీకోసంలో వినతుల స్వీకరణ
- భారీగా వచ్చిన ప్రజలు

వివరాలు లోపలి పేజీల్లో..



ప్లీనరీలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

వ్యాధుల నుంచి ప్రజలను రక్షించాలి

- చిరుద్యోగుల తొలగింపును నిలుపుదల చేయాలి
- సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ఒంగోలు (కలెక్టరేట్), జూలై 22 : జిల్లాలో సీజనల్ వ్యాధుల బారి నుంచి ప్రజలను రక్షించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. స్థానిక సుందరయ్య భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన పార్టీ జిల్లా ప్లీనరీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి జిల్లా కార్యదర్శి హనీఫ్ అధ్యక్షత వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ చీమకుర్తిలో మలేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని తెలిపారు. మార్కాపురం, వైపాలెంలలో కూడా కేసులు వస్తున్నందున సత్వరమే నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత చిరుద్యోగులు, స్కీం వర్కర్లను తొలగిస్తున్నారని, ఆ విధానాన్ని విరమించుకోవాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులను సత్వరమే పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. వెలిగొండ నిర్వాసితుల సమస్యలను పరిష్కరిం చాలని ఆయన కోరారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. జిల్లాలో ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలన్నారు. సమావేశంలో జిల్లావ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యపై చర్చించారు.

పైసలిస్తేనే పని

ఎస్ఎన్‌పాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పెచ్చరిల్లిన అవినీతి

- అడిగినంత చెల్లిస్తేనే సంతకం.. లేదంటే వాయిదానే..!
- ఏజెంట్లదే హవా
- సవరణలకు రూ.లక్ష వసూలు చేస్తున్నారని విమర్శలు
- నిషేధిత భూములనూ రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు ఆరోపణలు



సంతనూతలపాడు, జూలై 22: సంతనూతలపాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి రాజ్యమేలుతోంది. అడిగినంత ఇస్తే కాని ఇళ్లు, స్థలాలు రిజిస్ట్రేషన్ కావడం లేదు. ప్రైవేట్ సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లదే అక్కడ హవా. వారి ద్వారా ముడుపులు పుచ్చుకుంటున్న అధికారులకు ఎంత తిన్నా దాహం తీరడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అన్నీ సక్రమంగా ఉన్నా ఏదో ఒక తిరకాసు పెడుతూనే ఉంటారు. ఆ పేరుతో రూ.15వేల నుంచి రూ.50 వేల వరకూ వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. విలువ ఎక్కువగా ఉన్న భూముల రిజిస్ట్రేషన్లకైతే ఏకంగా రూ.లక్షకుపైగానే తీసుకుంటున్నారు. భూముల విలువ ఎక్కువగా ఉండి ఏదైనా సమస్య ఉంటే అన్నీ తాము చూసుకుని సరిచేస్తాం, అడిగినంత ఇస్తే చాలు అని కార్యాలయ సిబ్బంది మధ్యవర్తుల ద్వారా పెద్దమొత్తాల్లో వసూలు చేస్తున్నారు. ఇవ్వకపోతే రిజిస్టర్ అయిన డాక్యుమెంట్ తీసుకునే దాకా తంటాలు పడాల్సి వస్తోంది.

ఏజెంట్ల ద్వారా దందా

ఎస్ఎన్‌పాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది కొంతమందిని ఏజెంట్లుగా ఏర్పాటు చేసుకున్నారు. వారి ద్వారా దందా సాగిస్తున్నారని పెద్దఎత్తున విమర్శలు ఉన్నాయి. గతంలో పలుమార్లు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంపై ఉన్నతాధికారులకు, ఏసీబీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కానీ కార్యాలయంలో పనిచేసే ముఖ్యఅధికారి జిల్లాలోని ఎటువంటి అధికారులనైనా తన మేనేజ్ చేయగలడన్న పేరుంది. దీంతో కార్యాలయంపై చేసిన ఫిర్యాదులు అటకెక్కుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఫిర్యాదు చేసినా ఉపయోగం లేనప్పుడు అడిగినంత సమర్పించుకుని సర్దుకుంటే మంచిదన్న అభిప్రాయానికి ప్రజలు వస్తున్నారు. జిల్లాకేంద్రానికి కూతవేటు దూరంలో ఉండటంతో నిషేధిత భూముల సర్వే నెంబర్లను సబ్ డివిజన్‌గా చూపి ప్రైవేటు భూములుగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయా వ్యవహారాల్లో కార్యాలయ సిబ్బంది, కొంతమంది కబ్జాదారులకు అండగా ఉంటూ జేబులు నింపుకొంటున్నారని సమాచారం.

మధ్యవర్తులు ఏపనైనా చేస్తారు

అసలు ఎలాంటి రిస్క్ లేకుండా పేపర్ వర్క్ అయిపోవాలంటే మధ్యవర్తులను సంప్రదించాల్సిందే. ప్రతి పనికీ రేటు ఫిక్స్ చేసి మరీ కార్యాలయ అధికారులు మధ్యవర్తులను నియమించుకుని అడ్డగోలుగా దండుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తంగా ఎస్ఎన్‌పాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి మూడు లంచాలు, ఆరు అక్రమాలుగా వర్ధిల్లుతోంది. కార్యాలయంలో వివిధ సేవలకు సమయపాలన పాటించకపోవడం గమనార్హం. భూముల దస్తావేజులు, ఇతర రిజిస్ట్రేషన్‌లు, ఈసీలు, నకలు, పెండింగ్ డాక్యుమెంట్లు, మార్కెట్ విలువ వంటి వాటికి సంబంధించి నిర్దేశిత సమయాన్ని సిటిజన్ చార్ట్‌లో పేర్కొన్నారు. అయినా అది ఏమాత్రం అమలు కావడం లేదు. ముడుపులు చెల్లిస్తే మాత్రం వెంటనే పని చేసేస్తున్నారు. లేకుంటే కార్యాలయం చుట్టూ చెప్పులరిగే దాకా తిరగాల్సిందే. అవితి అధికారులు, సిబ్బందిపై ప్రస్తుత ప్రభుత్వంలోనైన సరైన చర్యలు ఉంటాయో లేదో చూడాలని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.



ఎటువంటి వసూళ్లు చేయడం లేదు

ఎస్ఎన్‌పాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్థలాలు, ఇళ్ల తదితర వాటికి సంబంధించి రిజిస్ట్రేషన్ విషయంలో ప్రభుత్వ ఫీజులు, చలానాల రూపంలో అన్ని ఆన్‌లైన్‌లో చెల్లిస్తున్నారు. విక్రయదారుల నుంచి ఎటువంటి అక్రమ వసూళ్లు చేయడం లేదు. ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయడం లేదు. అన్నీ సక్రమంగా ఉంటేనే చేస్తున్నాం. ప్రజలకు, కార్యాలయ సిబ్బందికి మధ్యలో ఎటువంటి మధ్యవర్తులు లేరు. కార్యాలయంలో సిబ్బంది అక్రమంగా ఏమైనా వసూళ్లు చేస్తుంటే ఫిర్యాదు చేయవచ్చు.

- ఇస్మాయిల్ షరీఫ్, సబ్‌రిజిస్ట్రార్, సంతనూతలపాడు

ఏకేయూ ఇన్‌చార్జి వీసీగా మూర్తి బాధ్యతల స్వీకరణ




వీసీగా బాధ్యతలు స్వీకరించిన మూర్తి

ఒంగోలు(విద్య), జూలై 22: ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఇన్‌చార్జి ఉపకులపతిగా ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు తొలుత రిజిస్ట్రార్ బి.హరిబాబు ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఉద్యోగులు ఘనస్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మూర్తి మాట్లాడుతూ ఏకేయూకి ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. యూనివర్సిటీ పరిధిలో అడ్మిషన్లు పెంచడంతోపాటు విద్యార్థులకు అవసరమైన విద్యను అందించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో కలిసి ముందుకు వెళ్తామన్నారు. అవసరమైన సిబ్బంది, భవనాలు, ఆర్థికపరమైన వనరుల ఏర్పాటు విషయంలో రాష్ట్రప్రభుత్వ పెద్దలు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని కోరారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులను ప్రవేశ పెట్టేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తానని తెలిపారు. తనకు వీసీగా అవకాశం కల్పించిన గవర్నర్ అబ్దుల్‌నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా బాధ్యతలు స్వీకరించిన వీసీ మూర్తిని ప్రిన్సిపాల్ జి.రాజమోహన్, సీఈ డాక్టర్ కేవీఎస్ రాజు, ఏసీఈ డాక్టర్ పద్మ, డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ హర్షప్రీతమ్, దేవ్‌కుమార్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి హామీ టీఏ అదృశ్యం

- భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు

మార్కాపురం, జూలై 22 : ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న కుందురు అనిల్‌కుమార్‌రెడ్డి అదృశ్యమయ్యారు. ఆయన రెండు రోజులుగా కనిపించడం లేదు. ఈమేరకు భార్య కృష్ణవేణి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ కథనం మేరకు.. ఉపాధిహామీ పథకంలో మార్కాపురం టెక్నికల్ అసిస్టెంట్‌గా అనిల్‌కుమార్‌రెడ్డి పనిచేస్తున్నారు. గత మార్చిలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి వైసీపీ అభ్యర్థి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ విషయాన్ని స్థానికులు సి-విజిల్ యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన్ను పీడీ అర్జునరావు అప్పట్లో సస్పెండ్ చేశారు. ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కొంతమేర పెట్టుబడులు పెట్టినట్లు సమాచారం. ఇటీవల కుటుంబ సభ్యులతోనూ గొడవ పడ్డాడు. ఈ క్రమంలో శనివారం ఇంట్లో ఉన్న రూ.2 లక్షల నగదు తీసుకుని బయటకు వెళ్లిన అనిల్‌కుమార్‌రెడ్డి సాయంత్రమైనా తిరిగి రాలేదు. సెల్‌ఫోన్ కూడా పనిచేయడం లేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించారు. అయినా ఆయన ఆచూకీ లభించలేదు. ఆదివారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు అనిల్‌కుమార్‌రెడ్డి కోసం గాలిస్తున్నారు. చివరిగా కంభం బస్టాండ్ ప్రాంతంలో శనివారం మధ్యాహ్నం 1.00 గంట నుంచి సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ అయినట్లు గుర్తించారు.



అనిల్ కుమార్‌రెడ్డి (ఫైల్)

పల్లామల్లి సొసైటీ విచారణాధికారిపై వేటు

- సస్పెండ్ చేస్తూ సహకారశాఖ కమిషనర్ ఉత్తర్వులు

ఒంగోలు (విద్య), జూలై 22 : చీమకుర్తి మండలం పల్లామల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)లో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ చేస్తున్న అధికారి బీవీఎస్ కృష్ణశాస్త్రిపై సస్పెన్షన్ వేటుపడింది. ఈమేరకు సహకార శాఖ కమిషనర్ బాబు ఉత్తర్వులు ఇచ్చారు. విచారణాధికారిగా కృష్ణశాస్త్రి వ్యవహార శైలిపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. సొసైటీపై విచారణను నిలుపుదల చేసేందుకు కృష్ణశాస్త్రి చేయని ప్రయత్నం లేదు. ఆయన తీరుపై జిల్లా సహకారాధికారి బి.శ్రీనివాసరెడ్డి ఆ శాఖ కమిషనర్‌కు నివేదిక సమర్పించారు. విచారణ ఆపేందుకు లాయర్లతో శాస్త్రి మాట్లాడటం, సొసైటీ సీఈవో వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ బెదిరించడం, ఉన్నతాధికారులైన డీసీవో, డీసీఏవోలను దుర్భాషలాడటం, ఆడిటర్లను తిట్టడం వంటి ఆడియో రికార్డులను కమిషనర్‌కు పంపించారు. సొసైటీపై విచారణకు 2023 నవంబరులో ఆదేశించారు. నిబంధనల ప్రకారం ఆరు నెలల్లో విచారణ పూర్తిచేసి నివేదిక సమర్పించాల్సి ఉండగా ఏడు నెలలకు కూడా పూర్తి చేయలేదు. దీంతో విచారణాధికారి కృష్ణశాస్త్రిని సస్పెండ్ చేయాలని సిఫార్సు చేశారు. ఇదే విషయమై కలెక్టర్‌కు కూడా నివేదిక సమర్పించారు. దీనిపై సమగ్ర విచారణ చేయాలని జేసీని కలెక్టర్ ఆదేశించారు. జేసీ కూడా విచారణ నిర్వహించారు. ఇదిలాఉండగా సహకార ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు మద్దతుతో కృష్ణశాస్త్రి ప్రభుత్వ పెద్దల నుంచి కూడా జిల్లా అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. రెండు నెలలుగా సహకారశాఖలో తీవ్ర చర్చనీయాంశమైన విచారణాధికారి వ్యవహారానికి సస్పెన్షన్‌తో ముగింపు పలికారు. కాగా ఆయన స్థానంలో కొత్త అధికారిని నియమించి పల్లామల్లి సొసైటీలో అక్రమాలపై విచారణ చేయించాల్సి ఉంది.



పల్లామల్లి సొసైటీ భవనం


గురుకుల పాఠశాలలో అన్నాన్ని పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కుమార్, అధికారులు

గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ

కొండపి, జూలై 22 : కొండపిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (విజిలెన్స్) ఎ.కుమార్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. డైనింగ్ హాలు, బియ్యం, కూరగాయలు నిల్వ చేసే గదులు, వండిన అన్నం, విద్యార్థినుల స్నానపు గదులు, మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. స్కూల్ ఆవరణలో పరిశుభ్రత పాటించాలని, శుద్ధి చేసిన తాగునీటిని విద్యార్థులకు అందించాలని ఈసందర్భంగా ప్రిన్సిపాల్ అరుణకు సూచించారు. నిల్వ ఉన్న ఆహారపదార్థాలు విద్యార్థులకు పెట్టవద్దని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్, ఎంపీడీవో నాగమణి ఉన్నారు.

16 మంది దగ్గు, చర్మవ్యాధులతో బాధపడుతున్నట్లు గుర్తింపు

గురుకుల బాలికల పాఠశాలను పెట్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.అనూష ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సోమవారం సాయంత్రం పరిశీలించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 16 మంది జలుబు, దగ్గు, చర్మ వ్యాధులతో బాధపడుతున్నట్లు గుర్తించారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో ఎం.రవిబాబు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


జనసేన నేత నాగబాబుకు మెమెంటోను ఇస్తున్న జిల్లా నేతలు

పేదలకు అన్నదానాలు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 22 : జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో జనసైనికులు రాష్ట్ర వ్యాప్తంగా డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమాలు చేపట్టాలని జనసేన సీనియర్ నాయకుడు కే నాగబాబు పిలుపునిచ్చారు. జిల్లాకు చెందిన జనసేన నాయకులు సోమవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఒంగోలుకు చెందిన ఆ పార్టీ నాయకులు నాగబాబును మర్యాద పూర్వంగా కలిశారు. ఈసందర్భంగా నాగబాబుకు మెమెంటోను అందజేశారు. జనసేన పార్టీ నాయకుడు జడా బాలనాగేంద్రయాదవ్ ఒంగోలులో డొక్కా సీతమ్మ పేరుతో ఐదు రోజులుగా చేస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని వివరించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ ఒంగోలులో జనసైనికులు సీతమ్మ పేరుతో అన్నదాన కార్యక్రమం ప్రారంభించడం అభినందనీయమన్నారు. ప్రకాశం జిల్లాను ఆదర్శంగా తీసుకొని రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి కార్యక్రమాలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు జడా బాలనాగేంద్ర యాదవ్, రాయపాటి అరుణ, కోట సుధాకర్ నాయుడు, మెట్లె రామకృష్ణ, పార్శకోటయ్యలు ఉన్నారు. కాగా నాగబాబు సమక్షంలో జిల్లాలో చేపడుతున్న సీతమ్మ అన్నదాన కార్యక్రమానికి బీజేపీ నాయకుడు మట్టా రాజా రూ. 25వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.


ఏపీ పంచాయతీరాజ్‌శాఖ డైరెక్టర్ కృష్ణతేజకు బొకే ఇస్తున్న కలెక్టర్ పంచాయతీరాజ్ విభాగం సభ్యులు

పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్‌కు అభినందనలు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 22 : ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్‌శాఖ డైరెక్టర్‌గా నియమితులైన ఎం.కృష్ణ తేజను పంచాయతీ విభాగం ప్రతినిధులు అభినందించారు. సో మవారం అమరావతిలోని పంచాయతీరాజ్‌శాఖ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ ప్రకాష్, ఉపాధ్యక్షుడు గడగోట్లు రామకృష్ణ ఆధ్వర్యంలో కృష్ణతేజను కలిసి బొకే ఇచ్చి అభినందించారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కేరళలో పనిచేస్తున్న కృష్ణతేజ సేవలను గుర్తించి డిప్యూటేషన్‌పై ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువచ్చి పంచాయతీరాజ్ డైరెక్టర్‌గా నియమించారు. ఈసందర్భంగా పంచాయతీరాజ్ ఉద్యోగుల సమస్యలను డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎన్. శివప్రసాద్, సీతారామయ్య, కుమార్, పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వైవీడీ ప్రసాద్ తదితరులు ఉన్నారు


శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో కిషోర్‌బాబు

కరవది హైస్కూలులో శిక్షా సప్తాహ్

ఒంగోలు(విద్య),జూలై 22 : ఒంగోలు మండలం కరవది జడ్పీ హైస్కూలులో సోమవారం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. ఈ ప్రదర్శనను ఒంగోలు ఎంఈవో టి. కిషోర్‌బాబు, ఏఎంవో ఎం.రమేష్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్టాఫ్ డయేరియా కార్యక్రమాన్ని కూడా కరవది హైస్కూలులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కే కోటేశ్వరరావు,సెక్రటరి ఆర్. శ్రీనివాసులు, డీపీఎం సుధీర్, డీసీడీ రవి, వి. కేశవరావు, హెచ్‌ఎం రవికుమార్, డాక్టర్ సుందర్ ప్రసాద్, స్టాఫ్ నర్సు జ్యోతి తదితరులు ఉన్నారు.

శ్రీరాంనగర్ పాఠశాలలో టీఎల్‌ఎం మేళా

సింగరాయకొండ, జూలై 22 : సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని శ్రీరాంనగర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఈపీని ప్రారంభించి నాలుగేళ్లు అయినందున టీఎల్‌ఎం మేళాను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిలుగా ఎంఈవోలు కత్తి శ్రీనివాసులు, ఆవుల శ్రీనివాసులు, స్కూల్ కాంప్లెక్స్ ఛైర్మన్ కె.మహాలక్ష్మి హాజరయ్యారు. పాఠశాల ఉపాధ్యాయులు టి.సుజాత, ఎం.ప్రభాకర్‌రెడ్డి తయారు చేసిన ప్రతి టీఎల్‌ఎంను వారు పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో సీఆర్పీ వంశీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


టీఎల్‌ఎంను చూపుతున్న ఉపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డి

ప్రజల అర్జీలకు సత్వరమే పరిష్కారం

మీకోసంలో కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 22 : ప్రజాఫిర్యాదుల వ్యవస్థ (మీకోసం)లో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశపు హాలులో సోమవారం మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలు పలురకాల సమస్యలను విన్నవించారు. ఆయా సమస్యలపై కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ అర్జీలన నిర్దేశించిన సమయంలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రతి అర్జీని సంబంధిత అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియా ఒక బాలుడికి శ్రవణ యంత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్‌కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఎస్‌డీసీలు వరకుమార్, ఝాన్సీలక్ష్మి తదితరులు ఉన్నారు.

● నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలులో రొయ్యల చెరువుల సాగు వల్ల వచ్చే వ్యర్థ రసాయన జలంతో తాగునీరు కలుషితమవుతుందని అమ్మనబ్రోలు, దే వరంపాడు, ఉలిచి, బొద్దులూరివారిపాలెంకు చెందిన ప్రజలు ఫిర్యాదు చేశారు తాగునీరు కలుషితం కావడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని అవేదన వ్యక్తంచేశారు. తమ గ్రామాలకు న్యాయం చేసి ఆదుకోవాలని కలెక్టర్‌కు విన్నవించారు.

● వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో తప్పుడుసర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సృజన్ మాదిగ కోరారు.


కలెక్టరేట్‌లో నిర్వహించిన మీకోసంలో ప్రజల అర్జీలపై మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ప్రజా ఫిర్యాదులను పరిష్కరించండి

- ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం),జూలై 22: ప్రజా ఫిర్యాదులు పరిష్కరించి సత్వర న్యాయం అందించాలని ఎస్పీ ఏఆర్.దామోదర్ పేర్కొన్నారు. సోమవారం పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ఫిర్యాదులు అందుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి 92 మంది తన వినతులను ఎస్పీకి అందజేశారు. ఫిర్యాదిదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో వెంటనే పరిష్కరించాలని కోరారు. అయితే గతంలో గ్రివెన్స్‌లో ఇచ్చినా పరిష్కారం కాలేదని ఎక్కువ మంది తెలియజేశారు. దీంతో ఎస్పీ స్పందిస్తూ ఫిర్యాదిదారుల పట్ల అలసత్వం వహించవద్దని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కె.నాగేశ్వరరావు, ఎస్‌వి.శ్రీధరరావు పాల్గొన్నారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

'ఉపాధి' వేతన బకాయిలను విడుదల చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 22 : రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్నఉపాధి హామీ కూలీల వేతనాలు విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు కోరారు. ఈమేరకు సోమవారం డ్వామా పీడీ అర్జునరావుకు వినతిపత్రం ఇచ్చి సమస్యను వివరించారు. కూలీల వేతన బకాయిలు నెలల తరబడి ఆపడం అమానుషమన్నారు. జిల్లాలో సుమారు రూ. 40 కోట్ల వేతనం బకాయి ఉందని, వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా మరో వైపు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలొ యడ్లపల్లి ఇర్మియ, చింతపల్లి ఏలియా తదితరులు ఉన్నారు.


ధర్నా నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కొండపిలో కూలీల ధర్నా

కొండపి, జూలై 22 : ఉపాధి హా పథకంలో పనిచేసిన కూలీల వేతన బిల్లులను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు కేజీ మస్తాన్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట కూలీలు ధర్నా నిర్వహించారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ 200 రోజులు పని కల్పించాలని కోరారు. అనంతరం ఎంపీడీవో నాగమణిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు అంగలకుర్తి చినబ్రహ్మయ్య, లక్కిపోగు సుధాకర్, సునీత, గడ్డం వందనం పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు : ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ ఉపాధి కూలీలు పనిచేసిన 15 రోజుల్లో వేతనాలు చెల్లించాలని ఉపాధిహామీ చట్టం చెబుతున్నా రెండు నెలలుగా బకాయిలు చెల్లించకపోవడం సరికాదన్నారు. తక్షణ మే బకాయిలు విడుదల చేయాలని కోరారు అనంతరం కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పున్నయ్య, సత్యనారాయణ, సంజీవరావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న వ్య.కా.స నాయకులు

చీమకుర్తి ఏరియా ఫ్యాక్టరీల అధ్యక్షునిగా కాట్రగడ్డ

చీమకుర్తి, జూలై 22 : చీమకుర్తి ఏరియా గ్రానైట్ పాలిషింగ్ యూనిట్ ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా కాట్రగడ్డ రమణయ్య ఎన్నికయ్యారు. సోమవారం నూతన కార్యవర్గాన్ని ఆదిత్య ఫ్యాక్టరీలో జరిగిన సమావేశంలో అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక కార్యక్రమానికి చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి అధ్యక్షత వహించారు.నూతన అధ్యక్షుడిగా కాట్రగడ్డ రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా నూకల సురేంద్రకుమార్, ఉపాధ్యక్షునిగా అహ్మద్‌బాషా, కోశాధికారిగా సాయి, గౌరవ అధ్యక్షులుగా మస్తాన్‌రెడ్డి, గోగినేని నాగయ్య, జిల్లా ప్రతినిధిగా కందిమళ్ల గంగాధరరావు,కమిటీ సభ్యులుగా రామకృష్ణ, సంపత్‌రెడ్డి, కె.కిషోర్, మారం సుబ్బారెడ్డి, గోరంట్ల చెన్నయ్యలను ఎన్నుకున్నారు. వీరందరిని సభ్యులు ఘనంగా సత్కరించారు.


నూతన కార్యవర్గసభ్యులను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి

కలెక్టర్ అన్సారియా

కొత్తపట్నం(ఒంగోలు నగరం) జూలై 23: కొత్తపట్నం-ఒంగోలు రహదారిలో అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డు పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అర్ అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఆమె సోమవారం ఈ రహదారిలో అసంపూర్తిగా ఉన్న రోడ్డు, బకింగ్ హామ్ కెనాల్‌పై వంతెన పనులను ఆమె పరిశీలించారు. కెనాల్‌పై నిర్మించిన వంతెనకు రెండు వైపులా వెంటనే సేఫ్టీవాల్‌ను నిర్మించాలని ఆమె సూచించారు. పనులను అ సంపూర్తిగా వదిలెయ్యటానికి గల కారణాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తి కాకుండా రాకపోకలు జరిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న దృష్ట్యా వెంటనే పనులు పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. అనంతరం ఆమె కొత్తపట్నం గ్రామంలో మెయిన్ రోడ్డులో నిలిచిపోయిన సిమెంటు రోడ్డు పనులను పరిశీలించారు. పనులు నిలిచిపోవటానికి గల కారణాలు, అంచానలు, విడుదలైన నిధుల వివరాలను అధికారులను అడిగి ఆమె తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని, రోడ్డు మధ్యలో డివైడర్ పనులు చేపట్టాలని కోరారు. కలెక్టర్ వెంట ఆర్అండ్‌బీ ఎస్‌ఈ దేవానందం, ఈఈ గోపినాయక్, తహసీల్దార్ హేమంత్ ఉన్నారు.


కొత్తపట్నంలో నిలిచిపోయిన రోడ్డు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు

» వైసీపీ నేతపై ఫిర్యాదు చేసిన టీడీపీ శ్రేణులు

తాళ్లూరు, జూలై 22: తూర్పుగంగవరంకు చెందిన వైసీపీ రాష్ట్ర సం యుక్త కార్యదర్శి జక్కుల రామకృష్ణ ఆపార్టీ శ్రేణులను రెచ్చగొట్టే విధంగా వాట్సాప్ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని టీడీపీ నేతలు పేర్కొన్నారు. తద్వార శాంతి భద్రతలకు విఘాతం కల్గించేందుకు యత్నిస్తున్నారని అన్నారు. అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, లోకేష్ ల మీద అనుచితవాఖ్యలను గ్రూప్‌లో పెట్టేవారన్నారు. ప్రభుత్వం మారి నా తీరు మార్చుకోకుండా అదే పద్ధతి కొనసాగిస్తున్నాడన్నారు. రాష్ట్రంలో పలు గ్రామాల్లో చిన్నచిన్న హింసాత్మక ఘటనలు జరుగుతుండగా జక్కుల రామకృష్ణ ప్రస్తుత టీడీపీ పాలనలో హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయంటూ పోస్టులు పెడుతున్నా రన్నారు. ఎప్పుడో జరిగిన, ఇతరరాష్ట్రాల్లో జరిగిన హింసాత్మక ఘటనల వీడియోలను ఇటీవలే టీడీపీ శ్రేణులు చేశారంటూ గ్రూప్‌లో పోస్టులు, చాటింగ్‌లు పెడుతున్నారన్నారు. వీటిని చూసిన వైసీపీ శ్రేణులు రెచ్చిపోతూ టీడీపీ శ్రేణులను దుర్భాషలాడుతున్నారన్నారు. దీనివల్ల గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు, శాంతి భద్రతలకు విఘాతం కల్గే విధంగా ఉందన్నారు. వాట్సాప్ గ్రూప్‌లో వైసీపీ శ్రేణులను టీడీపీ కార్యకర్తలపై రెచ్చగొట్టేవిధంగా పోస్టులు, వీడియోలు, చాటింగ్‌లు పెడుతున్న జక్కుల రామకృష్ణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ తూర్పుగంగవరం గ్రామ అధ్యక్షుడు కనిశెట్టి రామలక్ష్మయ్య, వల్లభనేని సుబ్బయ్య, చాట్లదాని, సూర్యనారాయణలు ఎస్సై విజయకుమార్‌కు సాక్ష్యాధారాలతో ఆదివారం రాత్రి లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు.

పండ్ల తోటల పెంపకంతో రైతులకు సిరులు

మద్దిపాడు,జూలై 22:పండ్ల తోటల పెంపకంతో రైతులకు సిరులు పండుతాయని ఉపాధి హామీ ఏపీడీ పాలేటి వెంకటస్వామి అన్నారు. సోమవారం మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ద్వారా 17 రకాల పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో శ్రీహరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పాలేటి వెంకటస్వామి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా చిన్న సన్నకారు రైతులు పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, పొలం గట్లపై టేకు మొక్కలు వేసుకునే వెసులు బాటు ఉందన్నారు. ఉద్యానశాఖ ఈవో వనజ, ఏపీవో ధనుంజయ వర్మ, జేఈ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలు వెంటనే చెల్లించాలి

మద్దిపాడు, జూలై 22:ఉపాధి హామీ కూలీల బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఉబ్బా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం మద్దిపాడులోని ఎండీవో ఆఫీస్ వద్ద ఉపాధి కూలీలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నరసింహారావు, సింగయ్య కుంచాల అంకమ్మ, పాటిబండల్ల మరియమ్మ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

అసాంఘిక కలాపాలపై కఠిన చర్యలు

గ్రామాల్లో కోడిపందాలు, పేకాట, బెట్టింగులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వెలగా మహేష్ అన్నారు. సోమవారం మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మోటార్ సైకిల్, ఆటో, కారు వంటి వాహనాలకు ఆర్టీవో సిఫార్సు చేసిన నెంబర్‌నే వాడాలన్నారు. వాహనం నడిపేప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని, కారు డ్రైవింగ్‌లో సీటు బెల్టు ధరించాలని సూచించారు. సైబర్ నేరాల గురించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

మాజీ మంత్రి బాలినేనిని అరెస్టు చేయాలి

ఒంగోలు(క్రైం),జూలై22: మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆర్యవైశ్యనాయకుడు సుబ్బారావు గుప్తా డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గుప్తాస్‌మిడివిన్‌లోని ట్రిబుల్ ఆర్ షాప్‌లో జరిగిన మీడియా సమావేశంలో సుబ్బారావు గుప్తా మాట్లాడారు. తనతోపాటు, ఒంగోలు ఎమ్మెల్యేపై దూర్భాషలాడిన బాలినేనిపై ఒంగోలు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదని అన్నారు. ఇప్పటికైనా కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆయన కోరారు.

అవీ..ఇవీ..

రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సింగరాయకొండ, జూలై 22 : ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యుడు డాక్టర్ ఎన్.హజరత్తయ్య కోరారు. స్థానిక పశువైద్యశాలలో సోమవారం సబ్సిడీ జొన్నవిత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హజరత్తయ్య మాట్లాడుతూ పాడిపశువులకు పచ్చిమేతను తగినంత అందించడం ద్వారా దాణా ఖర్చు తగ్గుతుందన్నారు. పాల దిగుబడి కూడా పెరిగి అధిక ఆదాయం వస్తుందన్నారు. జొన్నవిత్తనాలను 75శాతం రాయితీపై 5కేజీల బ్యాగును రూ.89.38కే అందిస్తున్నట్లు వివరించారు. మొదటి విడతలో మండలానికి వచ్చిన రెండు మెట్రిక్ టన్నుల జొన్న విత్తనాలను రైతులకు అందించినట్లు తెలిపారు.


రైతులకు విత్తనాలు అందజేస్తున్న పశువైద్యులు హజరత్తయ్య

పేస్ విద్యార్థికి స్కాలర్‌షిప్

ఒంగోలు(విద్య), జూలై 22 : స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగంలో బీటెక్ పూర్తిచేసిన కే పరంజ్యోతి ఎంఎస్ చదివేందుకు యూకేలోని టాప్‌టెన్ యూనివర్శిటీల్లో ఒకటైన యూనివర్శిటీ ఆఫ్ బోస్టల్‌లో సీటు లభించింది., పరంజ్యోతిని భారత ప్రభుత్వం నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికచేసింది. ఈసందర్భంగా సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సెక్రటరి అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ విద్యార్థి పరంజ్యోతిని అభినందించి లక్ష రూపాయలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి, డీన్ సీవీ సుబ్బారావు, డీన్ స్టూడెంట్స్ ఆఫైర్స్ ఆర్.వీరాంజనేయులు, టీఆర్ చైతన్య, ఈసీఈ విభాగాధిపతి ఎం.అప్పారావు తదితరులు ఉన్నారు.


విద్యార్థికి చెక్కును అందజేస్తున్న పేస్ యాజమాన్యం

పంటను ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 22 : తాళ్లూరు మండలం చింతలపాలెంలో దళిత, గిరిజనులు సాగు చేసుకుంటున్న భూముల్లోని పంటను ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్‌చేశారు. స్థానికకలెక్టరేట్ ఎదుట చింతలపాలెం దళిత రైతుల ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి ఫిర్యాదు చేశారు. ఈకార్యక్రమంలో దళిత నాయకులు పాల్గొన్నారు.

కౌశల్ వికాస్ పథకంపై మాగుంట ప్రశ్న

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 22 : ప్రధానమంత్రి కౌశల్ వికాస్‌యోజన పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లో యువతకు శిక్షణ కోర్సుల ఏర్పాటుపై ఒంగోలు లోక్‌సభసభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత శాఖ మంత్రి జయంత్‌చౌదరి సమాధానం ఇస్తూ ఈ పథకం కింద దేశంలోని యువతకు శిక్షణా కోర్సులు కల్పించడంపై జాతీయ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ పలు చర్యలు తీసుకుందని వివరణ ఇచ్చారు. గత ఐదుసంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్‌లో 1,13,884 మంది అభ్యర్థులు నమోదయ్యారన్నారు. ఈ పథకం కింద నేరుగా జిల్లాలకు నిధులు కేటాయించామని కేంద్ర మంత్రి వివరణ ఇచ్చారు.

పతకాలు సాధించిన సిబ్బందికి ఎస్పీ అభినందన

ఒంగోలు(క్రైం),జూలై22: జాతీయ స్థాయిలో అస్సాంలో జరిగిన పోలీసు జూడో క్లస్టర్ - 2024 పోటీలలో త్వైకోండో,కరాటే, పెంచాక్ సిలాత్ పోలీస్ క్రీడాకారులు పతకాలు సాధించడం అభినందనీయం అని ఎస్పీ దామోదర్ అన్నారు. జాతీయ స్థాయిలో అవార్డులు రావడం పోలీసు శాఖకు గర్వకారణం అన్నారు. ఇలాగే భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని కోరారు.


పతకాలు సాధించిన పోలీస్ క్రీడాకారులతో ఎస్పీ దామోదర్

కానిస్టేబుల్‌పై దాడి

ఒంగోలు(క్రైం),జూలై22: గుర్తు తెలియని వ్యక్తులు కానిస్టేబుల్‌పై దాడి చేశారు. ఈ సంఘటన స్థానిక దేవుడు చెరువు పార్కులో ఆదివారం రాత్రి జరిగింది. సీఆర్‌పీ క్వార్టర్స్ లో నివాసం ఉంటున్న చిట్టంచెట్టి వెంకటేశ్వర్లు ట్రాన్స్‌కోలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. దేవుడు చెరువు పార్కులో తన పాపను ఊయల ఊపుతుండగా గుర్తుతెలియని వ్యక్తి వచ్చి ఊయల నుంచి పాపను లాగేశాడు. అదే క్రమంలో పార్కు నుంచి బయిటకు వెళతావా లేదాని ఆవ్యక్తి వెంకటేశర్లును దుర్భాషలాడాడు. ఇంకా అక్కడ చుట్టుపక్కల వారిని పదిమందిని పిలిపించి దాడిచేశారు. ఈమేరకు రిమ్స్‌లో చేరి అక్కడ అవుట్ పోస్టు పోలీసులకు కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు.

పవన్ కల్యాణ్‌కు జడ్‌ప్లస్ కేటగిరి భద్రత కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కాపు సంఘం అధ్యక్షుడు సంజీవరావు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 22 : రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ముప్పు ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జడ్ ప్లస్ కేటగిరి కేటాయించాలని కాపు సంఘం జిల్లాఅధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ కోరారు. స్థానిక కాపు సంఘ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవన్ కల్యాణ్‌కు ముప్పు ఉందని కేంద్ర నిఘా వర్గాలు హెచ్చరించిన నేపథ్యంలో ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు, తంజావూరు శ్రీనివాసమూర్తి, ముత్యాల నాగేశ్వరరావు, బూదే రామ్‌రాజ్‌కుమార్, సుబ్బయ్య, రావెళ్ళ వెంకట్రావు, పోకల రాంబాబు, శనగల కిరణ్, మల్లెల చెన్నకేశవులు, చెన్నంశెట్టి శివ, తాటి ఆంజనేయులు ఉన్నారు.

షెడ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 22 : ఉపాధి హామీ పథకం అనుసంధానంతో జిల్లాలో పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లకు షెడ్లు నిర్మించేందుకు అర్హులైనవారందరూ సమీప పశువైద్యాధికారులను సంప్రదించి దరఖాస్తుచేసుకోవాలని పశుసంవర్ధకశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ కే బేబీరాణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు మొదటివిడతలో 1,075షెడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయన్నారు. అందులో మెరక మండలాల్లో 825, తీర ప్రాంత మండలాలకు 250 షెడ్లు మంజూరయ్యాయన్నారు. పశువుల షెడ్ల నిర్మాణానికి 90 శాతం, జీవాలు ,కోళ్లషెడ్ల నిర్మాణానికి 70 శాతం రాయితీ ఉంటుందన్నారు. షెడ్ల నిర్మాణానికి సొంత భూమి లేక ఇంటి స్థలంఉండి ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న చిన్నసన్నకారు రైతులు అర్హులన్నారు. ఎస్సీ ఎస్టీ, సంచారజాతుల వారికి ప్రాధాన్యత ఇస్తామని బేబీరాణి తెలిపారు.

అసాంఘిక కలాపాలకు పాల్పడితే కఠినచర్యలు

చీమకుర్తి, జూలై 22: అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చీమకుర్తి సీఐ సుబ్బారావు హెచ్చరించారు. ఈమేరకు ఆయన సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో గంజాయి అక్రమ రవాణా,వినియోగంపై ఉక్కుపాదం మోపుతామన్నారు.పేకాట,కోడిపందాలు,క్రికెట్‌బెట్టింగ్‌లు ఎవరైనా నిర్వహిస్తున్నారని తెలిస్తే 9121102131 నంబర్‌కు తెలియచేయాలని కోరారు. శాంతిభద్రతల పర్యవేక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని సీఐ సుబ్బారావు కోరారు.


సీఐ సుబ్బారావు

రేపు దేవాలయ భూముల వేలం

మార్టూరు, జూలై 22 : మండలంలోని ద్రోణాదుల, కోలలపూడి గ్రామాలలోని దేవాలయ భూములకు బుధవారం ఉదయం 10 గంటలకు ఆయా దేవస్థానాలలో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు కార్య నిర్వహణాధికారి చావా వెంకటేశ్వరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. వాటిలో ద్రోణాదుల గ్రామంలోని శ్రీచెన్నకేశవ స్వామి దేవస్థానానికి చెందిన 8.21 సెంట్ల మెట్టపొలాలు, శ్రీనీలకంఠస్వామి దేవస్థానానికి చెందిన 12.70 సెంట్ల మెట్టపొలాలకు వేలంపాట నిర్వహిస్తారు. కోలలపూడిలోని శ్రీకోదండరామస్వామి ఆలయానికి చెందిన 10.18 సెంట్లు, శ్రీసోమేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 7.36 సెంట్లు, శ్రీ వీరభద్రస్వామి దేవస్థానానికి చెందిన 12.24 సెంట్ల మెట్ట పొలాలకు వేలంపాట నిర్వహిస్తారని ఆ ప్రకటనలో తెలిపారు.

నేడు ఉపాధి పనులపై తనిఖీ

పర్చూరు, జూలై 22: గ్రామీణ ఉపాధి హామీ పథకం, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖలో 01-04-2023 నుంచి 31-03-2024 వరకు చేసిన పనులపై మంగళవారం సామాజిక తనిఖీ జరుగుతుందని ఎంపీడీవో బి.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శ్రీనివాసరావు

పర్చూరు, జూలై 22 : పర్చూరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా రెవెన్యూ కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న యూ శ్రీనివాసరావుకు సోమవారం బాధ్యతలు అప్పగించారు. నెల్లూరు జిల్లాలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ ఎన్నికల వేళ పర్చూరు తహసీల్దార్‌గా పనిచేసిన సీహెచ్ సుబ్బయ్య రిలీవ్ అయ్యారు.

ఆర్థిక సాయం అందజేత

మార్టూరు,జూలై 22 : మార్టూరు గ్రామపంచాయతీ గొట్టిపాటినగర్‌లో ఉంటున్న షేక్ వలికి సోమవారం హెల్పింగ్ హాండ్స్ గ్రూపు వారు రూ.5వేల నగదు, బియ్యం బ్యాగ్‌ను అందజేశారు. కొన్నాళ్లుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న దాతలు ఆర్థిక సాయం అందజేశారు.

చెరువులకు సాగర్ జలాల కళ

నీరు నింపుతున్న అధికారులు

మార్టూరు, జూలై 22 : సాగర్ జలాలు సోమవారం ఉదయం మండలంలోని గ్రామాలలోని మంచినీటి చెరువులకు చేరుతున్నాయి. ఆదివారం రాత్రి 10 గంటలు దాటిన తర్వాత బొల్లాపల్లి జీఎస్‌టీ రోడ్డు వద్దకు సాగర్ జలాలు చేరాయి. సాగర్ జలాలు వస్తున్నాయని గ్రామాలలోని మంచినీటి చెరువులను నింపుకోవడానికి ముందస్తుగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవి గ్రామాలలోని పంచాయతీ అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశారు. దాంతో సోమవారం ఉదయం నుంచి చెరువులకు నీళ్లు చేరుతున్నాయి. మేజరు పంచాయతీ మార్టూరు మంచి నీటి చెరువుకు రాజుపాలెం మేజరు నుంచి జలాలు చేరుతున్నాయి. మంచి నీటి చెరువును వేగవంతంగా నింపేందుకు పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు సిబ్బందితో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వలపర్ల, కోలలపూడి, బొల్లాపల్లి, కోనంకి తదితర గ్రామాలలోని చెరువులకు నీళ్లు చేరుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటం, పంటలు లేక పొలాలు ఖాళీగా ఉండడంతో రైతులకు సాగర్ జలాల అవసరం లేకుండా పోయింది. దీంతో చెరువులను వేగంగా నింపుతున్నారు. ఇదిలావుండగా సాయంత్రానికి అందిన సమాచాం మేరకు బొల్లాపల్లి జీఎస్‌టీ వద్ద 480 క్యూసెక్కులు, పమిడిపాడు మేజరుకు 220, కోటపాడుకు 160, నూతలపాడు మైనరుకు 170, ద్రోణాదుల మేజరుకు 70, రాజుపాలెం మేజరుకు 40 క్యూసెక్కులు నీళ్ల ప్రవహిస్తున్నాయి. కోటపాడు మేజరు వద్ద కోనంకి ఎన్ఎస్‌పీ డీఈ స్వామి, జేఈ బాలకృష్ణ నాయక్ సిబ్బందితో కలిసి నీటి ప్రవాహాన్ని పరిశీలించారు.


మార్టూరు చెరువుకు చేరిన జలాలను పరిశీలిస్తున్న అధికారులు

యద్దనపూడి మండలంలో 15 చెరువులను సాగర్ జలాలతో నింపడానికి అధికారులు చర్యలు చేపట్టారు. పూనూరు, తనుబొద్దువారిపాలెం చెరువులకు సాగర్ జలాలు చేరాయి. అదేవిధంగా బొబ్బేపల్లి దండుదారి దగ్గర ఎన్ఎపి పైపు లైను నుంచి యద్దనపూడి చెరువుకు నీటిని పంపించేందుకు ఆర్‌డబ్లుఎస్ ఏఈ బ్రహ్మయ్య, పంచాయతీ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. మంగళవారానికి యద్దనపూడి చెరువుకు నీళ్లు చేరే అవకాశం ఉంది. మిగిలిన గ్రామాలలోని చెరువులను కూడా నింపడానికి ఏర్పాట్లు చేసినట్లు ఏఈ తెలిపారు.

అద్దంకి బ్రాంచి కాలువకు..

బల్లికురవ : తాగు నీటి అవసరాలకు విడుదలైన సాగర్ నీరు సోమవారం అద్దంకి బ్రాంచి కాలువలకు చేరాయి. అద్దంకి, పర్చూరు నియోజకవర్గం లోని పలు గ్రామాలలో ఉన్న చెరువులకు నీటిని నింపేందుకు ఈ నీటిని ప్రభుత్వం విడుదల చేసింది. 18వ మైలు వద్ద 900 క్యూసెక్కుల నీటి విడుదలవుతోంది. బల్లికురవ మండలం 33వ మైలు వద్ద సాగర్ నీటి ప్రవాహాన్ని అధికారులు పరిశీలించారు. చుక్క నీరు కూడా వృథా కాకుండా తాగునీటి చెరువులకు మాత్రమే నింపాలని వారు సూచనలు చేశారు. రెండు నియోజకవర్గాలలో సుమారు వంద వరకు మంచి నీటి చెరువులు ఉన్నాయని ముందుగా కింది చెరువులను నింపేలా ప్రణాళికలు చేస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాలలో తాగు నీటి చెరువులు అడుగంటి నీటి ఎద్దడి నెలకుంది. ఇప్పుడు సాగర్ నీరు మంచి నీటి అవసరాలకు విడుదల చేయడంపట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పొలాలకు నీటిని మళ్లించకుండా అధికారులు కట్టడి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు వచ్చిన సాగర్ నీరు

చెరువులు నింపడం అవసరం

మేదరమెట్ల : గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో నీరు లేనందున సాగర్ నీటితో గ్రామాల్లో చెరువులు నింపుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని కుర్రవానిపాలెం సర్పంచ్ నాదెండ్ల దశరథరామయ్య అన్నారు. కుర్రవానిపాలెం వద్ద రావినూతల చెరువుకు వెళ్లే 1 ఆర్ కాలువను స్వల్ప మరమ్మతులు రావినూతల సర్పంచ్ చాట్ల విజయవీణ, తెలుగుదేశం నాయకులు కారులసా నాగేశ్వరరావు(బాబు), పంచాయతీ మెంబర్లు కారులసా సుబ్బయ్య దగ్గరుండి పరిశీలించారు. సాగర జలాలు వస్తే పూర్తిగా ఎండిపోయిన రావినూతల చెరువును నింపుతామన్నారు. గతంలో ఉన్న కాలులల్లో పైపులు స్వల్ప మరమత్తులు చేశామని, నీరు వస్తే నీరు విడుదల చేయడమే మిగిలి ఉందన్నారు.


రావినూతల చెరువుకు నీటిని పంపే కాలువను పరిశీలిస్తున్న కుర్రావానిపాలెం సర్పంచ్ దశరథరామయ్య, లక్ష్మీనారాయణ తదితరులు



మాట్లాడుతున్న జేఎన్‌టీయు(కె) వీసీ మురళీకృష్ణ

ప్రణాళికాబద్ధంగా చదివితే సత్ఫలితాలు

చీరాల, జూలై 22 : విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జేఎన్‌టీయూ(కే) వైస్ చాన్స్‌లర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(అటానమస్)లో బీటెక్ తొలి సంవత్సర విద్యార్థుల పరిచయ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనకు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ఇతర ప్రతినిధులు సాదరంగా స్వాగతం పలికారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలను సాధించేందుకు అనుసరించాల్సిన విధివిధానాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్‌బాబు, మొదటి సంవత్సర విభాగ ఇన్‌చార్జి ఎస్. అమర్‌నాథ్, డాక్టర్ సి.సుబ్బారావు(అక్రిడిటేషన్స్), ఆర్‌వీ రమణమూర్తి (అడ్మిస్ట్రేటివ్‌మేనేజర్), విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

పింఛన్ పెంపుపై దివ్యాంగుల హర్షం

పర్చూరు, జూలై 22 : ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబు ప్రభుత్వం దివ్యాంగులకు పింఛన్‌లను పెంచడం హర్షణీయమని దివ్యాంగులు అన్నారు. గతంలో ఉన్న రూ.3000 ఉన్న పింఛన్‌ను రెట్టింపు చేసి రూ.6000కు పెంచి అందజేయడంపై దివ్యాంగులు ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక బొమ్మల సెంటర్‌లో సోమవారం సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి అభిమానం చాటుకున్నారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన దివ్యాంగులు పాల్గొన్నారు.


భవనాసి చెరువులో అడుగంటిన నీరు

భవనాసి చెరువుకు సాగర్ జలాలు విడుదలయ్యేనా..?

- అద్దంకి పట్టణానికి పొంచి ఉన్న నీటి ఎద్దడి సమస్య
- అవి వస్తేనే సమస్యకు పరిష్కారం

అద్దంకి, జూలై 22: తాగునీటి అవసరాలకు సాగర్ జలాలు విడుదల అయ్యాయి. అయితే నోటిఫైడ్ చెరువులకు మాత్రమే నింపే అవకాశం ఉంది. అద్దంకి, ప ర్చూరు నియోజకవర్గాల్లో మొత్తం 125 చెరువులు ఉండగా, అందు లో 89 నోటిఫైడ్ చెరువులు, 36 నాన్ నోటిఫైడ్ చెరువులు ఉన్నాయి. నోటిఫైడ్ చెరువులు ఎక్కువ భాగం పర్చూరు నియోజకవర్గంలోనే ఉన్నాయి. అద్దంకి నియోజకవర్గంలో పలు గ్రామాలలోని చెరువులలో కూ డా నీరు పూర్తిగా అడుగంటాయి. అదే సమయంలో భవనాసి చెరువులో గతంలో ఎన్నడూలేని విధంగా నీటి నిల్వ పూర్తిగా తగ్గిపోయింది. భవనాసి చెరువులో నీరు లేకపోవడంతో సమీపంలోని సుమారు 15 గ్రామాలకు పరోక్షంగా నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉంది. ఇక గుండ్లకమ్మ నదిలో నీటి ప్రవాహం లేకపోవటం, గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో నీటి నిల్వ లేకపోవడంతో అద్దంకి పట్టణానికి తాగునీటి సరఫరా చేసే గుండ్లకమ్మ నదిలోని ఊటబావులలో నీటి నిల్వ లు తగ్గిపోయాయి. దీంతో నీటి సరఫరాకు కూడా ఇ బ్బంది పడే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం సాగర్ కాలువలకు నీరు విడుదల అయినందున భవనాసి చెరువుకు నీటిని విడుదల చేసి, చెరువు నుంచి లోలెవల్ కాలువ ద్వారా గుండ్లకమ్మ నదిలోని ఊటబావుల వద్దకు విడుదల చేసేందుకు అవకాశం ఉంది. భవనాసి చెరువు నాన్‌నోటిఫైడ్‌గా ఉన్నందున ఎన్నెస్పీ అధికారులు నీరు విడుదల చేసే అవకాశం లేదు. అయితే పట్టణానికి తాగునీటి అవసరాల దృష్ట్యా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించి భవనాసి చెరువుకు సాగర్ జలాలను కొంత మేరైనా విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలతో పాటు, పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నోటిఫైడ్ చెరువులకు నీరు నింపేలా ప్రణాళిక

అద్దంకి బ్రాంచి కెనాల్ పరిధిలో మొత్తం 125 చెరువులు ఉండగా అందులో 89 నోటిఫైడ్ చెరువులు ఉన్నాయి. పలు చెరువులలో నీరు పూర్తి గా అడుగంటడంతో ఆయా గ్రామాల ప్రజలు తాగునీటి కి ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో నోటిఫైడ్ చెరువులకు నీటిని నింపే విధంగా ప్రణాళికలు రూపొందించటం జరిగిందని ఈఈ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఎబిసి లో బాపట్ల జిల్లా సరిహద్దు 18 వ మైలు వద్ద సోమవారం 870 క్యూసెక్కులు నీరు విడుదల అవుతుందన్నారు. నాలుగు రోజుల పాటు సుమారు 0.37 టిఎంసీ ల నీరు విడుదల కానున్నట్లు తెలిపారు. తాగునీటి చెరువులకు మాత్రమే నింపుకోవాలని కోరారు.

నిండా ముంచిన నకిలీ విత్తనాలు

బల్లికురవ. జూలై 22 : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో నకిలీ విత్తనాలబారిన పడి రైతు మోసపోయారు. ఎన్ని మందులు వాడినా ఫలితం లేదని, సీడ్ విత్తనాలని దుకాణదారుడు అంట గట్టారని రైతు విలపిస్తున్నారు. ముక్తేశ్వరం గ్రా మానికి చెందిన రైతు నాగండ్ల పున్నయ్య మా ర్టూరులోని ఓ ప్రైవేట్ విత్తన దుకాణంలో గత నెల లో బెండ విత్తనాలను కొనుగోలు చేసి ఎకరంలో బెండను సాగు చేశారు. సుమారు రూ.50 వేల వ రకు పెట్టుబడులు పెట్టిన తోటలో కాయల దిగుబ డి ఆలస్యంగా వచ్చింది. పలు రకాల మందులను కూడా పిచికారీ చేసినా కాయలు తెల్లగా, వంకరగా వచ్చాయి. ఇవి చూసిన మిగతా రైతులు నకిలీ విత్త నాలవల్లే ఇలా జరిగిందని తెలిపారు. దీంతో బాధిత రైతు పున్నయ్య లబో దిబోమంటూ విత్తనాలు ఇచ్చిన దుకాణం వద్దకు వెళ్లి ప్రశ్నించారు. తాము ఏమీ చేయలేమని చేతు లేత్తేశారని రైతు తెలిపారు. నకిలీ విత్తనాల సాగుతో తనకు తీవ్ర నష్టం జరిగిందని, తనను అధికారులు ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.


ఎదుగుదల లేని బెండకాయలను చూపుతున్న రైతు పున్నయ్య

సంపూర్ణ ఆరోగ్యానికి శాఖాహారం మేలు

పామూరు, జూలై 22: సంపూర్ణ ఆరోగ్యానికి శాఖాహారం మేలని సీనియర్ పిరమిడ్ మాస్టర్ జ యలక్ష్మి అన్నారు. స్థానిక శ్రీ పత్రీ సాయి జ్ఞానబోధి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో గురుపౌర్ణమి సందర్భం గా ధ్యాన శిక్షణ తరగతులను, ప్రవచనలను ఆటపాటల ద్వారా బోధించారు. జయలక్ష్మి మాట్లాడు తూ మనిషిలో ప్రశాంతత పెరిగే కొద్ది విజయాలు, శక్తి సామర్థ్యాలు పెరుగుతాయని చెప్పారు. మన శ్శాంతి పొందాలంటే మనస్సును సాత్విక గుణంతో ఉంచుకోవా లన్నారు. అందుకు ధ్యానం ఒక్కటే మార్గమన్నారు. ధ్యానంతో శరీరం లో నాడిశుద్ధి జరిగి రోగాలు దూర మవుతాయని జయలక్ష్మి పేర్కొన్నారు.కార్యక్రమంలో పందిటి అల్లుర య్య గుత్తి రమణయ్య, కె.ప్రభాకర్, పందిటి సౌభాగ్యమ్మ, వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి


మాట్లాడుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, జూలై 22: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లా డారు. వర్షాలు పడుతున్నందున డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల కేసులు నమోదైన విషయాన్ని గర్తుచేశారు. వ్యాధులు ప్రభలకుండా పారిశుధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. ప్రజలకు తీసుకోవాల్సిన జాగ్ర త్తలపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ సీజనల్‌లో ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరు తాగాలని తెలిపారు.

కనిగిరి ఆర్డీవో జాన్‌ఇర్విన్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాల నిర్వాహణలో నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తే సహించేది లేదన్నారు. కొందరు పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య కార్యక్రమాల గురించి పట్టించుకోవటం లేదనే విమర్శలు వస్తున్నాయన్నారు. మురికినీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు నిరంతరం బ్లీచింగ్, ఫాగింగ్ చేయాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుజన మాట్లాడుతూ గత ఏడాది కూడా దర్శి ప్రాంతంలో సీజనల్ వ్యాధులు అధికంగా సోకాయన్నారు. డెంగ్యూ, మలేరియా కేసులు నమోదయ్యాయన్నారు. ఈ ఏడాది అక్కడక్కడ కొన్ని కేసులు తమ దృష్టికి వచ్చాయన్నారు. అన్నిశాఖల అధికారులు సంయుక్తంగా పనిచేసి ప్రజలకు వ్యాధులు సోకకుండా చూడాలన్నారు.

సమావేశంలో దర్శి తహసీల్దార్ జి.సుజాత, ఎంపీడీవో హనుమంతరావు, ఇన్‌చార్జ్ డీఎల్‌పీవో గుప్తా శోభన్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ రవిశంకర్, నగర పంచాయతీ కమిషనర్ మహేశ్వరరావు, స్థానిక వైద్యాధికారులు, గ్రామ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలు చేపట్టాలి

- ఆర్డీవో జాన్‌ఇర్విన్


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జాన్‌ఇర్విన్

కనిగిరి, జూలై 22: వ్యాధులు ముసురుతుండటంతో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆర్డీవో జాన్‌ఇర్విన్ ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాల యంలో సోమవారం వైద్య ఆరోగ్య, మున్సిపల్ శాఖల అధికారులతో జరిగి న సమావేశంలో మాట్లాడారు. గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షపు జల్లులకు దోమలు ప్రభలిపోయాయన్నారు. దీంతో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు తీవ్రమౌతున్నాయన్నారు. వైద్య, మున్సిపల్, సచివాలయ, ఆశా సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి జ్వర పీడితులను గుర్తించాలన్నారు. ఆయా నివాసాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావును ఆదేశించారు. ప్రభుత్వాసుపత్రితో పా టు, పీహెచ్‌సీల్లో వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు.

వైద్య, ఆశా కార్యకర్తలతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయా గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజల్ని అప్రమత్తంచేసి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన పెంపొందించాలన్నారు. ఆసుపత్రుల్లో మందులు కొరత లేకుండా చూ డాలని డీడీహెచ్‌వో సృజనకు సూచించారు. పీహెచ్‌సీల్లో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులకు మం దులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సే వలు అందించటంతో పాటు సీజనల్ వ్యాధులు ప్రభలకుండా తగు జాగ్ర త్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు

మురుగుకూపాలుగా ప్రభుత్వ కార్యాలయాలు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో గుంతల్లో నిలబడిన నీరు

కనిగిరి, జూలై 22: నిత్యం జనసంచారంతో ఉండే ప్రభుత్వ కార్యాలయాలు పందులకు ఆవా సాలుగా మారాయి. పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దార్, ఐసీడీఎస్, ఆర్డీవో, స్త్రీశక్తి భవనం వంటి ప్రభుత్వ కార్యాలయలన్నీ ఒకేచోట ఉన్నా యి. దీంతో నిత్యం వివిధ పనుల నిమిత్తం ప్రజలు ఆ కార్యాలయాల వ ద్దకు వస్తుం టా రు. ఇటీవల కురి సిన వర్షాలకు సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో నీరు నిలిచి మురు గుగుంటలుగా మారాయి. తహసీల్దార్ కార్యాలయం వద్ద వర్షపు నీరు మళ్లించేందుకు కాలువను తవ్వారు. వర్షపు నీరు ఆ కాలువ ద్వారా బయటికి వెళ్ళేందుకు ఏర్పాటు చేశారు.

అయితే, కాలువ తీసిన ప్రాంతం ఎ త్తుగా ఉండటంతో వర్షపు నీరు ఆ కాలువలో నిలిచిపోయింది. దీంతో ము రుగునీటి మయంగా మారింది. ఆ మురుగునీటిలో పందులు తిరుగుతూ అపరిశుభ్రం చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టనట్లు వ్య వహరిస్తున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన అధికారులు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు అపరిశుభ్రత కారణంగా రోగాలు అంటగడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీటిని మళ్ళించి పందుల స్వైర విహారాన్ని నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

కనిగిరిలో ట్రాఫిక్ జటిలం

కనిగిరి, జూలై 22: కనిగిరిలో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమైంది. పట్టణంలో నుంచి భారీ వాహనాలు వెళుతుంటాయి. ఈక్రమంలో ఉప్పు బజారులో పామూరు బస్టాండు నుంచి చెక్‌పోస్టు వరకు నిత్యం ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుంది. బైపాస్ రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో భారీ వాహనాల రాకపోకలు మరింత పెరిగాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే టర్బో లారీలు నిత్యం పట్టణంలో గుండా ఒంగోలు వైపు వెళ్తుండటంతో మరింత ఇబ్బందిగా మారింది. దీనికితోడు ప్రయివేటు ట్రావెల్స్ రాకపోకలు సంఖ్య అధికమైంది. రాత్రి 7 నుంచి 10 గంటల వరకు ప్రభుత్వాసుపత్రి, వెన్నెల అపార్ట్‌మెంట్, ఒంగోలు బస్టాండు వద్ద పాయింట్‌లు గా చేసుకుని బస్సులను నిలిపి వేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ పెరిగిపోతుంది. ఇప్పటికైనా పోలీసు, మున్సిపల్ అధికారులు దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.


ఉప్పురోడ్డులో భారీ ట్రక్కు రావటంతో ఆగిపోయిన ట్రాఫిక్

మోటార్‌సైకిల్ చోరీ

పీసీపల్లి, జూలై 22: పొలం వద్ద నిలిపి ఉంచిన మోటార్‌సైకిల్ చోరీకి గురైన సంఘటన మండలంలోని తలకొండపాడులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గోనుగుంట్ల మాలకొండ్రాయుడు ఆదివారం తన ద్విచక్రవాహనంపై పొలం వెళ్లాడు. పొలం బయట బైకును నిలిపి ఎనులు చేసుకునేందుకు వెళ్లాడు. పొలం పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చేందుకు బైకును నిలిపిఉంచిన ప్రాంతానికి వెళ్లగా కనిపించలేదు. సోమవారం కూడా బైకు ఆచూకీ లభించకపోవడంతో చోరీకి గురైందని భావించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

తాళ్లూరు, జూలై 22: మండలంలోని వెలుగువారిపాలెం పంచాయతీ పరిధిలోని గంగపాలెంలో ప్రభుత్వ భూములు ఆక్రమణలు జరుగకుండా చూడాలని గ్రామానికి చెందిన సయ్యద్ ఇమామ్ సోమవారం గ్రీవెన్ సెల్‌లో తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబరు 684లోని వాగు పోరం బోకు భూములను కొందరు ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. ఆభూములు గతంలో ఆక్రమణలకు గురికాగా రెవెన్యూ అధికారులు గుర్తించి ఆక్రమణలను తొలగించి ఎవరూ ప్రవేశించ వద్దని బోర్డును ఏర్పాటుచేశారు. ఆబోర్డులను తొలగించి మరలా ఆక్రమణలు చేస్తున్నారని తెలిపారు. ఆక్రమణలపై విచారణ చేయించి తగు చర్యలు చేపడతామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

వీఆర్వో ద్వారా కౌలు పత్రం పొందాలి

కనిగిరి, జూలై 22: భూయజమానులను ఒప్పించుకుని గ్రామ రెవెన్యూ (వీఆర్వో) ద్వారా కౌలు పత్రాన్ని పొందవచ్చునని ఏడీఏ ఈవీ రమణ అన్నారు. మండలంలోని బడుగులేరు గ్రామంలోని రైతు సేవాకేంద్రంలో సోమవారం కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ కౌలు రైతుకు భూమి మీద ఎటువంటి హక్కు ఉండదని చెప్పారు. కేవలం సాగు చేసిన పంట మీద మాత్రమే హక్కు ఉంటుందని తెలిపారు. కౌలు కార్డు కేవలం 11నెలలు మాత్రమే పనిచేస్తుందన్నారు. కౌలు కార్డుల ద్వారా పంట నమోదు, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, కనీస మద్దతు ధరకు విక్రయించుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. వీఆర్వో ద్వారా కౌలు గుర్తింపు కార్డు జారీ చేస్తారన్నారు. కార్యక్రమంలో వీఆర్వో నాగేశ్వరరావు, వీపీఏ విక్రమ్, రైతులు పాల్గొన్నారు.

కార్మికుల పట్ల పక్షపాత వైఖరి వీడాలి



దీక్షలు చేపట్టి నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

పొదిలి, జూలై 22 : అధికారులు కార్మికుల సమస్యలు తీర్చేవిధంగా ఉండాలి గాని పక్షపాతం చూపించకూడదని ట్రెజరర్ ఎస్కే. జిలాని అన్నారు. పొదిలి ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులు ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు 8వ రోజుకు చేరాయి. డిపోలో ఉన్న సమస్యలపై పలుమార్లు అధికారులు, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా పరిష్కారం చేయడానికి ఎవరు ముందుకు రావడం లేదన్నారు. అలాంటి పరిస్థితుల్లో నిరాహారదీక్ష చేపట్టక తప్పలేదన్నారు. రీజనల్ కమిటీ పిలుపు మేరకు సమస్యలు పరిష్కరించే వరకు కొనసాగుతాయన్నారు. డ్యూటీ చార్జులపై, ప్రతినెల రెండు రోజులు సెలవులు, ఉద్యోగులకు ఇవాల్సిన వార్షిక ఇంక్రిమెంట్‌లు సకాలంలో కలపాలన్నారు. ఉద్యోగులు, కార్మికుల పట్ల వివక్ష చూపుతున్న డిస్పాచ్ మెకానిక్ కృష్ణపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అక్రమ మస్టర్లు ఇచ్చి సంస్థకు నష్టం కలిగిస్తున్న ఎస్టీఐపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

రెండు ట్రాక్టర్లు డోజర్ సీజ్

- మూసి వాగులో ఇసుక అక్రమంగా తవ్వుతుండగా స్వాధీనం



సీజ్ చేసిన వాహనాలు

పొదిలి, జూలై 22 : మండలంలోని గోగినేని పాలెం గ్రామ సమీపం లోని మూసివాగులో డోజర్ సహాయంతో అక్రమంగా ఇసుక తరలి స్తున్న రెండు ట్రాక్టర్లు, ఒక డోజర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో సీఐ మల్లికార్జునరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇసుకను ప్రవేశపెట్టిందన్నారు. అయితే స్వంత నిర్మాణాలకు అవసరమైన వారు ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు ఏ వాహనంలోనైనా మనుషుల సహాయంతో జల్లెడ వేసుకొని మాత్రమే తీసుకెళ్ళవచ్చన్నారు. వ్యాపారం చేసుకోవడానికి కాదన్నారు. అలా కాకుండా డోజర్లు, ఎక్సకవేటర్లు యంత్రాల సాయంతో ఇసుకను తరలిస్తే చట్ట ప్రకారం నేరమన్నారు. కనుక ఇసుక అవసరమైన వారు యంత్రాలు వినియోగించకుండా ఇసుక తీసుకెళ్ళవచ్చన్నారు. మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు

- డీఎస్పీ బాలసుందరరావు



ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న డీఎస్పీ

మార్కాపురం, జూలై 22: ఆటో డ్రైవర్‌లు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మార్కాపురం డీఎస్పీ ఎం.బాలసుందరరావు హెచ్చరించారు. స్థానిక పట్టణ పోలీసు స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ బాలసుందరరావు మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ తప్పక లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. యూనిఫాం లేకుంటే చర్యలు తప్పవన్నారు. పట్టణంలో తిరిగే ప్రతి ఆటోకు పోలీసు నెంబరు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను అనుమతించడం చట్టరీత్యా నేరం అన్నారు. కేసులు తీవ్రంగా ఉంటాయన్నారు. రాత్రి వేళల్లో పోలీసుల వద్ద అనుమతి తీసుకున్న ఆటోలు మాత్రమే తిరగాలన్నారు. అనుమాన స్పదవ్యక్తులు తారసపడితే పోలీసులకు తప్పక సమాచారం అందించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడిపితే శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణీకులు ఉంటే చర్యలు

పొదిలి, జూలై 22 : ఆటోలో పరిమితికి మించి ప్రయాణీకులు ఉంటే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎస్ఐ కోటయ్య తెలిపారు. సోమవారం స్థానిక వెంకటేశ్వరా సినిమాహాల్ పరిధిలో ఆటో యజమానులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకొని ప్రమాదాల బారిన పడవద్దన్నారు. అలా చేసి కుటుంబాల్లో విషాదాన్ని నింపవద్దని హెచ్చరించారు. పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకొని పోలీసులకు పట్టుబడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా మోటార్‌బైకులు, ఆటోలు లేదా ఏవాహనంపై కూడా కొటేషన్లు రాయకూడదన్నారు.

జగన్‌కు రాజ్యాంగం ఇప్పుడు గుర్తొచ్చిందా..?

- టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్

పొదిలి, జూలై 22 : జగన్మోహన్‌రెడ్డికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుర్తుకురాని రాజ్యాంగం విలువ ఇప్పుడు గుర్తుకు రావడం హాస్యాస్పందంగా ఉందని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ ఎద్దేవ చేశారు. ప్రజాస్వామ్యం, రాజ్యాగం గురించి జగన్ మాట్లాడిన మాటలు సామాజిక మాద్యమాల్లో వైరల్ అయిన సంగతి తెలిసిందే. దీనిపై గౌస్ స్పందిచారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో ఎన్నో అరాచకాలు జరిగాయన్నారు. ప్రతిపక్ష నాయకులు చెప్పిన సమస్యలను పెడచెవిన పెట్టి జగన్ పాలన చేశాడన్నారు. ఇప్పుడు రాజ్యాంగం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ అరెస్టులు చేసినప్పుడు గుర్తుకురాలేదాని ప్రశ్నించారు. తమ నాయకుడు చంద్రబాబునాయడిని వైజాగ్ విమానాశ్రయంలో అడ్డుకున్నప్పుడు, జనసేన అధినేతను అవమానించినప్పుడు ఈ నీతులు ఏమయ్యాయని జగన్మోహన్‌రెడ్డిని ప్రశ్నించారు. నాడు జగన్ పాలనలో పోలీసులు చేసిన తప్పులను ఖండించలేదని, ఇప్పుడు పోలీసులను హెచ్చరించడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా జగన్ తన వైఖరిని మార్చుకోవాలన్నారు.

కంభంలో చినుకుపడితే చిత్తడే



ఆల్ఫా స్కూల్‌కు వెళ్లే దారి దుస్థితి

కంభం, జూలై 22 : కంభం, కందులాపురం మేజర్ పంచాయతీలలో పలు వీధులు వెంబడి మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయలేదు. ఇక కాలువలు ఉన్న చోట కూడా వాటిని శుభ్రం చేయలేదు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా మురుగు నీరంతా వీధుల్లోని రోడ్లపైకి చేరుతోంది. దీంతో ప్రాంతం అంతా దుర్గంధం వెద జల్లుతోంది. ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని కంభం అర్బన్ కాలనీ వాసులు వాపోతున్నారు. పలుచోట్ల సిమెంటు రోడ్లు వేసినా డ్రైనేజీలు నిర్మించక పోవడంతో చినుకుపడితే చిత్తడిగా మారుతున్నాయి. వాహనదారులు, పాదాచారులు జారి కిందపడుతున్నారు. అధికా రులు ఇప్పటికైన స్పందించి రోడ్లపై మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శిథిలావస్థలో పశువైద్యశాల

- 30 ఏళ్లగా రేకులషెడ్డులోనే నిర్వహణ
- పగిలిన రేకులు, వర్షాలకు తడుస్తున్న సామగ్రి
- కనీస వసతులు కరువు

త్రిపురాంతకం, జూలై 22: త్రిపురాంతకంలోని పశువైద్యశాల పరిస్థితి పేరుగొప్ప, ఊరుదిబ్బగా ఉంది. మండల కేంద్రంలోని పశువైద్యశాలకు సొంత భవనం లేదు. దీంతో 30 ఏళ్లగా ఎస్సెస్పీ కాలనీలోని అతిచిన్న రేకుల షెడ్డులో నిర్వహిస్తు న్నారు. ఆ రేకులషెడ్డు సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. పైకప్పు రేకులన్నీ పగిలిపోయి ఎండకు ఎండి, వర్షానికి తడుస్తున్నాయి.ద ఈంతో వర్షం పడిన పుడల్లా వర్షపునీళ్ల కారుతూ వైద్యశాలలోని సామగ్రి మందులు అన్నీ తడిసి పోతున్నాయి. గోడలు కూడా పూర్తిగా పగుళ్లిచ్చి పడిపోయే స్థితి కి చేరాయి. విరిగిన తలుపులు, చెదలు పట్టిన కిటికీలతో అధ్వానంగా తయారై వైద్యశాల దర్శనమిస్తోంది. కనీస వసతులు కూడా లేక వైద్యులు, సిబ్బంది తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కూర్చునేందుకు కుర్చీలు వేసే స్థలం లేదు. మరుగుదొడ్లు లేవు. కాగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నూతన పశు వైద్యశాల నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరు కాగా అప్పట్లో స్థలం లేకపోవ డంతో అ నిధులు వెనక్కు వెళ్లాయి. అనంతరం వైద్యుల విన్నపాలతో వైద్య శాల నిర్మాణం కోసం రెవెన్యూ శాఖ 50 సెంట్ల స్థలాన్ని కేటాయించింది. వైసీపీ ప్రభుత్వంలో నూతన వైద్యశాల భవనం నిర్మించేందుకు నిధులకోసం పలుమార్లు ఉన్నతా ధికారులకు నివేదించినా నిధులు మాత్రం మంజూరు కాలేదు. దీంతో ఎప్పుడు కూలు తుందో తెలియని రేకుల షెడ్డులో వైద్యులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహి స్తున్నారు. నూతన టీడీపీ ప్రభుత్వమైనా స్పందించి నూతన సొంత వైద్యశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.



ఎస్ఎస్పీ కాలనీలోని పశువైద్యశాల భవనం



పగిలిపోయిన రేకులు

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

మీకోసం కార్యక్రమానికి సమస్యల వెల్లువ

మార్కాపురం, జూలై 22: ఇళ్లులేని పేదలకు స్థలాలు మంజూరు చేయాలని మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన పేదలు సబ్‌కలె క్టర్ రాహుల్‌మీనాకు వినతిపత్రం అందజేశారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డివి జన్ పరిధిలోని పలు మండలాలకు చెందిన ప్రజ లు సమస్యలపై 33 అర్జీలు అందజేశారు. ప్రధా నంగా రాయవరం గ్రామంలోని 180 మందికి ఇళ్ల స్థలాలులేక అద్దెఇళ్లలో నివసిస్తున్నట్లు సబ్ కలెక్టర్‌కు తెలిపారు. గ్రామంలోని సర్వే నెంబర్ 382లో 11.10 ఎకరాల ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్నం దున పట్టాలు మంజూరు చేయా లని కోరారు. అదేవిధంగా పెద్దార వీడు మండలం పోతంపల్లి గ్రామంలో భూమిలేని పేద ఎస్సీ లు 50 కుటుంబాలు ఉన్నాయని వారందరికీ అసైన్‌మెంట్ కమిటీ ద్వారా భూమిని ఇప్పించాలని వినతిపత్రం అందజేవారు. రూ.లక్ష ల్లో లంచాలు తీసుకుని మార్కా పురం మున్సిపాలిటీ అధికా రులు కనిగిరికి చెందిన తమ్మినేని పెద్దిరెడ్డి పేరున నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం మంజూరు చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని తమ్మినేని సాయి నీలేష్‌రెడ్డి అర్జీ అందజేశారు. సదరు మరణ ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేయాలని కోరారు. మీ కోసం కార్యక్రమంలో డివిజనల్ సర్వేయర్ సుబ్బారావు, పలు శాఖలకు చెందిన డివిజన్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

ఐదుగురికి స్వల్ప గాయాలు

మార్కాపురం రూరల్, జూలై 22: కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన అనంతపురం టూ అమరావతి 544డీ జాతీయ రహదారిపై మండలంలోని తిప్పాయపాలెం వద్ద చోటుచేసుకొంది. గేదె అడ్డురావడంతో తప్పించ బోయి పల్టీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబ సభ్యులు ఐదు గురు గాయపడ్డారు. షేక్ సల్మా, షేక్ అబ్దుల్లా, షేక్ మహబూబ్, చిన్నారులు షేక్ అజ్మల్, అమేరాలకు స్వల్ప గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులంతా కలిసి స్వస్థలం సుండిపెంట నుంచి బేస్తవారిపేటలో బంధువుల ఇంట వేడుకకు హాజరై తిరుగు ప్రయాణంలో ఉన్నారు. క్షతగాత్రులను వైద్య చికిత్స నిమిత్తం మార్కాపురంలోని సర్వజన వైద్యశాలలో చేరారు. రూరల్ పోలీసులు ఘటనపై వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



చికిత్స పొదుతున్న క్షతగాత్రులు



పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

వైభవంగా సాయిబాబా రథోత్సవం

మార్కాపురం వన్‌టౌన్, జూలై 22: గురు పౌర్ణమి పురస్కరించుకుని నెహ్రూ బజార్‌లో వెలసిన షిరిడీ సాయిబాబాకు మంగళవారం పట్టణ వీధులలో వైభవంగా రథోత్సవం నిర్వ హించారు. గత నెల 27న ప్రారంభమైన గురుపౌర్ణమి వేడుకలు రథోత్సవంతో ముగి శాయి. భక్తుల కోలాటాలు, భజంత్రీలు, పాటకచేరీలో షిరిడి సాయిబాబా మహి ళా బృందం భక్తిశ్రద్ధలతో పట్టణ వీధుల నుంచి రథోత్సవం నిర్వహించింది. ఉభయదాతలు రామడుగు రమేష్, నాగ గోపి, మందిర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



కోలాటం ఆడుతున్న భక్తులు

సైబర్ నేరాల పట్ల ప్రజలకు అప్రమత్తత అవసరం

- సీఐ ఆవుల వెంకటేశ్వర్లు



మార్కాపురం, జూలై 22: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక సీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం సైబర్ నేరాలపై కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయన్నారు. దీంతో ప్రజల అవగాహనా లోపాన్ని కొందరు సైబర్ నేరగాళ్లు సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండడం ద్వారానే ఈ నేరాలకు అడ్డుకట్ట వేయగలమన్నారు. ముఖ్యంగా ఫోన్లలో వచ్చే లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దన్నారు. కొందరు బ్యాంకు డీపీతో ఏపీకే ఫైళ్లు పంపి బ్యాంకు అకౌంట్‌లను హ్యాక్ చేసి దోచుకుంటున్నారని అన్నారు. బ్యాంకుల నుంచి ఎలాంటి ఏపీకే ఫైళ్లు వచ్చినా ఓపెన్ చేయవద్దని సూచించారు. కొన్ని ఫేక్ లోక్‌యాప్స్ ఆన్‌లైన్ ద్వారా రుణాలిస్తున్నారన్నారు. రుణాలు తిరిగి చెల్లించకుంటే వీడియోస్, ఫోటోలు మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని అన్నారు. ఆర్‌బీఐ అప్రూవల్ లేని యాప్స్‌లోకి వెళ్లి రుణాలు తీసుకోవద్దని సూచించారు. ఆన్‌లైన్‌లో పేకాట, బెట్టింగ్ తదితరాలతో యువత చెడుమార్గం పడుతున్నారన్నారు. తల్లిదండ్రులు పిల్లలను గమనించి కట్టడి చేయాలని సూచించారు.

పందులను అరికట్టాలని ఫిర్యాదు

బేస్తవారపేట, జూలై 22: బేస్తవారపేట పంచాయతీలో పందులు వీధివీధిన అధికంగా ఉన్నాయని వాటిని వెంటనే అరికట్టాలని ఏపీ.గిరిజన సంఘాల జేఏసీ సభ్యుడు ఏ.సుధా కర్ సోమవారం ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. కడప, బద్వేల్ ప్రాంతాల నుంచి లారీలతో పందులను బేస్తవారపేటకు తర లించారని వాటిని ఇక్కడ వదిలిపెట్టడంతో వాటి సంతతిని వృద్ధి చేసుకొని అధికమయ్యాయన్నారు. పట్టణంలో పలువ్యా ధుల బారినపడే అవకాశం ఉందని ఆయన అన్నారు. వెంటనే పందుల పెంపకందార్లను మందలించి తగుచర్యలు తీసుకోవా లని పందులను గ్రామం నుండి బయటకు పంపాలని ఎంపీడీవోను కోరారు.

అర్హులు కౌలుకార్డులు తీసుకోవాలి

బేస్తవారపేట, జూలై22 : మండలంలోని జగ్గంబోట్ల కృష్ణా పురం గ్రామంలో సోమవారం కౌలు రైతుల హక్కుపత్రాల గురించి గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కౌలురైతులు కార్డులు తీసుకోవడం వలన ప్రభుత్వం నుండి వచ్చే పథకాలకు అర్హులుగా ఉంటారన్నారు. అందుకు అర్హులైన కౌలు రైతులు తప్పని సరిగా కౌలు రైతుల కార్డులు పొందాలని వ్యవసాయాధికారి జక్కం మెర్సీ కోరారు.

అవీ..ఇవీ..

ప్రాంగణ ఎంపికలకు విశేష స్పందన



ఎంపికైన విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, జూలై 22: పట్టణంలోని శ్రీ సాధన డిగ్రీ కళాశాలలో సోమవారం దివీస్ ల్యాబొరెటరీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని, ప్రిన్సిపాల్ డా. కప్పగంతుల మధుసూదన్ తెలిపారు. ఈ ఎంపికల్లో వివిధ జిల్లాల నుంచి ఆశా వహులు హాజరయ్యారన్నారు. ఈ సందర్భంగా దివీస్ సంస్థ హెచ్‌ఆర్ రామకృష్ణ మాట్లాడుతూ.. పదో తరగతి, ఐటీ అర్హత కలిగినవారికి ఇక్కడే నియామక పత్రాలు అందించామని, మిగిలిన వారికి 40 రోజుల్లో నియామక ఉత్తర్వులు పంపిస్తా మన్నారు. ఎంపికైన వారిని కళాశాల కార్యదర్శి రాజగోపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వీఆర్‌కే ప్రసాద్, ఎంవీ కృష్ణారెడ్డి, జీఎల్ రమేష్‌బాబు, డా. వెన్నా కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్ కుమార్ తదితరులు అభినందించారు.

క్యాజువల్ అనౌన్సర్లకు అవకాశం



పి.ప్రశాంత్ కిరణ్

మార్కాపురం, జూలై 22: మార్కాపురం ఆకాశవాణి కేంద్రంలో క్యాజువల్ అనౌన్సర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నట్లు ప్రోగ్రామ్ హెడ్ పి.ప్రశాంత్ కిరణ్ సోమవారం తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు మార్కాపురం పరిసర ప్రాంతా నికి చెందిన వారై ఉండాలన్నారు. తెలుగు బాషపై పట్టు, మంచి కంఠస్వరం కలిగి వున్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి తప్పనిసరిగా ఏదైనా డిగ్రీ కలిగి ఉండా లన్నారు. తెలుగు సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, సమకాలిన రాజకీయ అంశాలపై పట్టు కలిగి ఉండాలన్నారు. 2024 సెప్టెంబర్ 1వ తేదీ నాటికి 20 నుంచి 50 సంవత్సరాల్లోపు వారై ఉండలన్నారు. అభ్యర్థులు పూర్తిచేసిన దరఖాస్తుతోపాటు 10వ తరగతి, డిగ్రీ సర్టిఫికేట్లు జిరాక్స్ కాపీలు, లేటెస్ట్ పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు 3, ఆధార్ జిరాక్స్ జతచేసి ఇవ్వాల న్నారు. ఓపెన్ క్యాటగిరీ అభ్యర్థులు రూ.354, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు రూ.266లు బ్యాంకు అకౌంట్ నెంబర్ 31122924901, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0003055కు నెఫ్ట్ ద్వారా చెల్లించి రసీదును జతపరచాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను అటెస్టేషన్ చేయించాలన్నారు. అభ్యర్థుల చిరునామా, ఫోన్ నెంబర్, ఈ మెయిల్ ఐడీని దరఖాస్తు ఫారంలో తప్పక నింపాలన్నారు. అభ్యర్థుల ఎంపిక మూడు దశల్లో ఉంటుందన్నారు. రాత పరీక్ష, స్వర పరీక్ష, ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులను వచ్చే నెల 5వ తేదీలోగా మార్కాపురం ఆకాశవాణి కేంద్రానికి పంపాలన్నారు.

పేదలకు క్షమాపణ చెప్పాలి

- వై.పాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్‌ను డిమాండ్ చేసిన ప్రసాద్

పుల్లలచెరువు,జూలై 22: పేదల ఆకలి తీర్చేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన అన్న క్యాంటీన్లపై వై.పాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని పుల్లలచెరువు మండల టీడీపీ అధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి, టీడీపీ నేతలకు ఆకలి విలువ తెలుసన్నారు. అందుకే అవి ప్రవేశ పెట్టారని అన్నారు. పేదలను బిచ్చగాళ్లతో పోల్చడం సరికాదన్నారు. పేదలకు వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా లేకుండా ప్రజలు బుద్ధి చెప్పినా, ఇప్పటికి వైసీపీకి సిగ్గు రాలేదని అన్నారు.

పండ్లతోటల పెంపకంపై అవగాహన

గిద్దలూరు, జూలై 22 : రాచర్ల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల మొక్కల పెంపకం, డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు, రైతులకు లభించే రాయితీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.విజయలక్ష్మీ, హార్టికల్చర్ ఆఫీసర్ విష్ణుప్రియ, వివిధ శాఖల ప్రతినిధులు మోహనకృష్ణ, మోషా, నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

నకిలీ పట్టాలపై విచారించాలి

- తహసీల్దార్‌ను కోరిన బాధితులు



సమస్యను తెలియజేస్తున్న బాధితులు

ఎర్రగొండపాలెం, జూలై 22 : నకిలీ పట్టాలు తమను మోసం చేసిన వీఆర్ వో, బ్రోకర్ బాలరాజుపై విచారించి చర్యలు తీసుకోవాలని ఎర్రగొండపాలేనికి చెందిన పలువురు బాధితులు తహసీల్దార్ సోమ్లానాయక్‌కు సోమవారం అర్జీలు సమర్పించారు. ఎర్రగొండపాలెం తిరుమలగిరికాలనీలో సర్వే 539/1లో ఆరుగురు లబ్ధిదారులకు బాలరాజు అనే వ్యక్తి, వీఆర్‌వో బాలేశ్వరరావులు నకిలీ పట్టాలు ఇచ్చారన్నారు. ఆ పట్టాలు చెల్లవని ఇప్పుడు అధికారులు చెబుతున్నారు. సదరు వీఆర్‌వో బాలేశ్వరరావును సంప్రదిస్తే ఆ పట్టాలపై తేదీలు మార్చి ఇచ్చారన్నారు. ఇప్పుడు ఈ పట్టాలు చెల్లడం లేదని, తమను మోసం చేసిన బాలరాజు, వీఆర్‌వో బాలేశ్వరరావుపై చర్యలు తీసుకోవాలని కోరారు. ముటుకూరి విశ్రాంతమ్మ, గర్నిపూడి మరియకుమారి, పరిమి మస్తా నమ్మ, గర్నిపూడి సుబ్బమ్మ, గుర్రం లక్ష్మీనారాయణ చింతల వెంకటేశ్వర్లు తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

సమయానికి బస్సురాక.. స్కూలుకు వెళ్లలేక

- నిత్యం పాఠశాల విద్యార్థినుల అవస్థలు
- పాఠశాల సమయానికి బస్సు నడపాలని వినతి

మార్కాపురం రూరల్, జూలై 22: పాఠశాలకు విద్యార్థులు వెళ్లే సమయానికి బస్సు రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలోని బోడపాడు గ్రామ విద్యార్థినులు సుమారు 30 మంది మార్కాపురం పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నారు. వారు నిత్యం ఉదయం 8.30గంటలకు బోడపాడులో బస్సు బయలుదేరితే మాత్రమే స్కూల్ ప్రారంభమయ్యే 9గంటల సమయానికి పాఠశాలకు చేరుకుంటారు. అయితే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు సమయపాలన పాటించడం లేదు. ప్రతిరోజు ఉదయం 9.30గంటల తర్వాత బస్సువస్తోంది. దీంతో తాము పాఠశాలకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సమయానికి పాఠశాలకు వెళ్లకపోతే ఉపాధ్యాయులు క్లాసులకు రానివ్వడం లేదని వాపోతున్నారు. ప్రతిరోజు ఇబ్బందికరంగా ఉండటమే కాకుండా నిత్యం ఒక గంట సమయం వృథా అవుతోందని వాపోతున్నారు. దీంతో తరగతులలో సిలబస్ పూర్తిగా చదువుకోలేక పోతున్నా మని అంటున్నారు. బోడపాడు గ్రామానికి ఉదయం 8.30గంటలకు ఆర్టీసీ బస్సు విద్యార్థుల కోసం వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.



రోడ్డుపై నిలబడిన ప్రయాణికులు

సమస్య మా దృష్టికి వచ్చింది

బోడపాడు గ్రామం నుంచి విద్యార్థులను పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు వచ్చే విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బస్సు కొంత ఆలస్యం అవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇప్పుడు విద్యార్థుల కోసం బోడపాడు గ్రామానికి ప్రతిరోజు వెళ్లే ఆర్టీసీ బస్సు శ్రీశైలం వెళ్లి వస్తోంది. దీంతో కొంత ఆలస్యం అవుతోంది. ప్రతిరోజు 8.30గంటలకు బోడపాడు గ్రామం చేరే విధంగా మరో బస్సును ఏర్పాటు చేసి విద్యార్థులు సమయానికి పాఠశాలకు వెళ్లే విధంగా ప్రత్యామ్నాయ బస్సును ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

నరసింహులు, ఆర్టీసీ డీఎం



బోడపాడు గ్రామంలో బస్సు కోసం ఎదురు చూస్తున్న బాలికలు

బస్‌షెల్టర్ లేక ఇక్కట్లు

గిద్దలూరు : పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో బస్‌షెల్టర్ లేక బస్సు కోసం వేచి ఉండే ప్రయాణికులు రోడ్లపై ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్నారు దుకాణదారుల దయాదాక్షిణాలపై రోడ్లపై వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ముండ్లపాడు నుంచి పోరుమామిళ్ల, మైదు కూరు వరకు వెళ్లే ప్రయాణికులందరూ ఎక్కువగా రైల్వేస్టేషన్ సమీప బస్‌స్టాప్ నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే నంద్యాల ప్రాంతం వైపు వెళ్లే ప్రయాణికులు కూడా ఈ బస్‌స్టాప్ నుంచే బస్సు ఎక్కుతారు. రైళ్ల ద్వారా వందలాది మంది ప్రయాణికులు గిద్దలూరు రైల్వేస్టేషన్‌లో దిగి ఇక్కడి నుండి కడప జిల్లాలోని కలసపాడు, పోరుమామిళ్ల, మైదుకూరు, బద్వేలు ప్రాంతాలకు వెళుతుంటారు. కావున రైల్వేస్టేషన్ సమీపంలో బస్సులు ఆటోల వద్ద బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇటు రెవెన్యూ కార్యాలయం వైపు గాని, అటు రైల్వేస్టేషన్ మార్జిన్‌లో గాని బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వ స్థలాలే ఉన్నందున బస్సులు ఆగే ప్రాంతంలోనే బస్‌షెల్టర్ ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్య కూడా చాలావరకు తగ్గిపోతుందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. దాతలు ఇదే రోడ్డులో రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదురుగా, కుమ్మరాంకట్ట వద్ద బస్‌షెల్టర్లు కట్టించినప్పటికీ అవి రోడ్డుకు రెండోవైపున ఉండడంతో బస్సుఎక్కే ప్రయాణి కులకు అవి ఎలాగూ ఉపయోగపడడం లేదు. బస్సులు ఆపే స్టాప్‌లోనే బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

'ఉపాధి'లో పండ్ల తోటల పెంపకం

వెలిగండ్ల, జూలై 22: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకం చేపడుతున్నట్లు ఎంపీడీవో రామచంద్రయ్య ఏపీవో నాయక్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సన్న, చిన్నకారు రైతులు ఉపాధిహామీ జాబ్‌కార్డులు కలిగి ఉండాలన్నారు. అలాగే, ఐదెకరాల లోపు భూమి ఉండి, సాగునీటి వసతి ఉన్న రైతులు ఈ పథకానికి అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీ, మిగిలినవారికి 90 శాతం రాయితీపై త్వరలో పరికరాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌వో అంజలి, ఏపీడీ రాజేష్, సత్యప్రకాశ్, ఆదినారయణ, రైతులు పాల్గొన్నారు.

నేడు పామూరులో ఆధార్ క్యాంపు

పామూరు, జూలై 22: పామూరు గ్రామ సచివాలయంలో మంగళవారం నుంచి 28వ తేది వరకు ఉచిత ఆధార్ క్యాంపు ఏర్పాటుచేసినట్లు పంచాయతీ కార్యదర్శి వి.బ్రహ్మానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులో నూతన ఆధార్ నమోదుతో పాటు తప్పుఒప్పులను సరిచేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చదువుతోపాటు సామాజిక బాధ్యత కలిగిఉండాలి

వెలిగండ్ల, జూలై 22: చదువుతో పాటు విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంచేవిధంగా విద్యాశాఖ నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంఈవో దాస్ ప్రసాద్ తెలిపారు. సోమవారం మండలంలోని మెగపర్రు పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సోమవారం నుంచి 29వ తేది వరకు ఏడు రోజుల పాటు మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ రకాల ఆటలతో పాటు, విజ్ఞానాన్ని పెంచేలా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు అనంతరం విద్యార్థులు రూపొందించిన వివిధరకాల స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రమణయ్య, మేరి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలి

పామూరు, జూలై 22: ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన కూలీలకు రావలసిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు ఎం. రామయ్య డిమాండ్ చేశారు. ఉపాధిలో అవినీతిని అరికట్టాలని కోరుతూ సోమవారం ఎంపీడీవో పి.షట్బారెడ్డికి వినతిపత్రం అందజేశారు. మండలంలో కూలీలకు సుమారుగా 8 వారాల పెండింగ్ బిల్లులు చెల్లించకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వై.వీరనారాయణ, షేక్ అల్లభక్ష్, చల్లా వెంకటేశ్వర్లు, కె.శంకర్ పాల్గొన్నారు.

ముండ్లమూరులో.. ముండ్లమూరు, జూలై 22: మండలంలో ఉపాధి హామి పనులు చేసిన కూలీల బకాయిలు వెంటనే విడుదలచేసి ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో ఆసంఘం మండల అధ్యక్షుడు వెల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ 45 రోజులుగా జిల్లాలో ఉపాధి హామీ పనులు నిలిచిపోయాయన్నారు. కార్యక్రమంలో రామాంజనేయులు, నారాయణ, ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

దొనకొండలో.. దొనకొండ, జూలై 22: ఉపాధి హామీ పనులను వెంటనే పునరుద్ధరించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు చిరుపల్లి అంజయ్య డిమాండ్ చేశారు. పలుడిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం ఎంపీడీవో వసంతరావునాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కుందుర్తి అనీల్, మేళం సుధాకర్, జొన్నలగడ్డ వీర్రాజు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పీసీపల్లి, జూలై 22: ప్రభుత్వ ఆదేశాలతో ముద్దపాడు సచివాలయంలో మంగళవారం ఆధార్‌కేంద్రం(తాత్కాలిక)ను ఏర్పాటుచేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి కిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రంలో ఆధార్‌కార్డులు లేనివారికి నూతనంగా కార్డు తీయడంతో పాటు గతంలో కార్డు పొంది ఉన్న వారికి అప్‌డేట్ చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఆధార్ లేని చిన్నారులకు నూతనంగా తీయిచ్చుకోవచ్చునని తెలిపారు. ఈఅవకాశాన్ని పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నాగబాబును కలిసిన బండారు

పీసీపల్లి, జూలై 22: జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబును ఆపార్టీ మండల అధ్యక్షుడు బండారు రాజు సోమవారం కనిగిరి నియోజకవర్గానికి చెందిన పార్టీశ్రేణులతో కలిసి మంగళగిరిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని సమస్యలను వివరించి వాటిని పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని ఇచ్చినట్లు రాజు తెలిపారు. నాగబాబును కలిసిన వారిలో జనసేన జిల్లా కార్యదర్శి రహిముల్లా, సంయుక్త కార్యదర్శి దొరస్వామి, సీఎస్‌పురం, పామూరు మండలాల పార్టీ అధ్యక్షులు రాజు, ఏడుకొండలు, కనిగిరి, వెలిగండ్ల, హెచ్‌ఎంపాడు మండలాల పార్టీ అధ్యక్షులు రమేష్, ప్రవీణ్‌కుమార్, వెంకట్రావు తదితరులు ఉన్నారు.

గుర్తింపు కార్డులకు కౌలు రైతులు దరఖాస్తు చేసుకోవాలి

ముండ్లమూరు, జూలై 22: కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జె.మధుబాబు అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో కౌలు రైతులకు అవగాహన ప్రసార రథాన్ని సోమవారం తహసీల్దార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతు గుర్తింపు పొందటానికి అవసరమైన నియమ నిబంధనలు పాటించి దరఖాస్తులను వీఆర్‌వోలకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో ఫరూక్, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ మండల కన్వీనర్ వెంకటరావు, డిప్యూటీ తహసీల్దార్ పుల్లారెడ్డి, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

పోరంబోకు భూములను అన్యాక్రాంతం కాకుండా చూడాలి

ముండ్లమూరు, జూలై 22: మండలంలోని పూరిమెట్ల గ్రామంలో వాగు పోరంబోకు భూములను అన్యాక్రాంతం కాకుండా చూడాలని సీపీఎం నాయకుడు వెల్లంపల్లి ఆంజనేయులు అన్నారు. ఆక్రమణలకు పాల్పడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో జరిగిన మీ కోసం కార్యక్రమంలో ఆయన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గోగుల కోటినారాయణ, పోట్లూరి రామాంజనేయులు, శ్రీను, జామవా, ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీకి విద్యార్థుల ఎంపిక

దొనకొండ, జూలై 22: దొనకొండ జడ్పీ పాఠశాలలో ఎన్‌సీసీ రెండో బ్యాంచ్‌కు విద్యార్థుల ఎంపిక నిమిత్తం పాఠశాల ఆవరణలో సోమవారం అర్హత పరీక్షలు నిర్వహించారు. ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి కె.సత్యనారాయణ, సుబేదార్ మేజర్ పుష్పరాజ్‌ల ఆదేశాల మేరకు సుబేదార్ సంతోక్‌సింగ్, హవల్దార్ ఈవీ నారాయణలు ఎంపిక పరీక్ష నిర్వహించారు. 25 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరికి ప్రతిరోజు ఎన్‌సీసీ కేర్‌టేకర్, పాఠశాల పీడీ కాలే నర్సింహారావు ఆధ్వర్యంలో శిక్షణతో పాటు ప్రతివారం ఎన్‌సీసీ సిబ్బంది ప్రత్యేక శిక్షణ ఇస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం వీవీ రామాంజనేయులు, తదితరులు అభినందించారు.

కౌలు రైతులు కార్డులు తీసుకోవాలి

దొనకొండ, జూలై 22: కౌలు రైతులు తప్పనిసరిగా కార్డులు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మండలంలోని ఇండ్ల చెరువు, మంగినపూడి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కౌలు రైతు కార్డు కోసం భూ యజమాని ఆధార్‌కార్డు, పొలం 1బి, నకలు పత్రాలతో సంబంధిత గ్రామ సచివాలయాల్లో రెవెన్యూ అధికారిని సంప్రదించాలన్నారు. పొలం కౌలుకు తీసుకున్న రైతులకు ఈ ఏడాది పంట మీద మాత్రమే హక్కు కల్గిఉంటారన్నారు. దరఖాస్తు చేసిన మూడు రోజుల్లో కౌలుకార్డు మంజూరవుతుందన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు డి.మాచర్ల, కె.కోటయ్య, వీఏఏలు రాధిక, విన్నీబాబు, పంచాయతీ కార్యదర్శి వరికూటి నాగార్జున, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత

పామూరు, జూలై 22: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్టూడెంట్ కిట్‌లో భాగంగా పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన రెండు జతల స్కూల్ యూనిఫాం బట్టలను హెచ్‌ఎం ఎం.రామస్వామి సోమవారం అందజేశారు. ఇప్పటివరకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులతోపాటు బూట్లను అందచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు భోగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌లు ధరించాలి

సీఎస్‌పురం(పామూరు), జూలై 22: ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి ప్రమాదాలబారి నుంచి రక్షించుకోవాలని ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్ అన్నారు. సీఎస్‌పురంలో హెల్మెట్ వాడకంపై స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్‌తో కలిసి సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ వాడటం ద్వారా కలిగే ప్రయోజనాలు, వాడకపోతే జరిగే నష్టాల గురించి వివరించారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మానవహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ గౌస్‌బాషా, వాహనదారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



మాట్లాడుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, జూలై 22: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లా డారు. వర్షాలు పడుతున్నందున డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల కేసులు నమోదైన విషయాన్ని గుర్తుచేశారు. వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. ప్రజలకు తీసుకోవాల్సిన జాగ్ర త్తలపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ సీజనల్‌లో ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరు తాగాలని తెలిపారు.

కనిగిరి ఆర్డీవో జాన్‌ఇర్విన్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాల నిర్వాహణలో నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తే సహించేది లేదన్నారు. కొందరు పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య కార్యక్రమాల గురించి పట్టించుకోవటం లేదనే విమర్శలు వస్తున్నాయన్నారు. మురికినీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు నిరంతరం బ్లీచింగ్, ఫాగింగ్ చేయాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుజన మాట్లాడుతూ గత ఏడాది కూడా దర్శి ప్రాంతంలో సీజనల్ వ్యాధులు అధికంగా సోకాయన్నారు. డెంగ్యూ, మలేరియా కేసులు నమోదయ్యాయన్నారు. ఈ ఏడాది అక్కడక్కడ కొన్ని కేసులు తమ దృష్టికి వచ్చాయన్నారు. అన్నిశాఖల అధికారులు సంయుక్తంగా పనిచేసి ప్రజలకు వ్యాధులు సోకకుండా చూడాలన్నారు.

సమావేశంలో దర్శి తహసీల్దార్ జి.సుజాత, ఎంపీడీవో హనుమంతరావు, ఇన్‌చార్జ్ డీఎల్‌పీవో గుప్తా శోభన్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ రవిశంకర్, నగర పంచాయతీ కమిషనర్ మహేశ్వరరావు, స్థానిక వైద్యాధికారులు, గ్రామ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలు చేపట్టాలి

» ఆర్డీవో జాన్‌ఇర్విన్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జాన్‌ఇర్విన్

కనిగిరి, జూలై 22: వ్యాధులు ముసురుతుండటంతో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆర్డీవో జాన్‌ఇర్విన్ ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాల యంలో సోమవారం వైద్య ఆరోగ్య, మున్సిపల్ శాఖల అధికారులతో జరిగి న సమావేశంలో మాట్లాడారు. గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షపు జల్లులకు దోమలు ప్రబలిపోయాయన్నారు. దీంతో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు తీవ్రమౌతున్నాయన్నారు. వైద్య, మున్సిపల్, సచివాలయ, ఆశా సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి జ్వర పీడితులను గుర్తించాలన్నారు. ఆయా నివాసాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావును ఆదేశించారు. ప్రభుత్వాసుపత్రితో పా టు, పీహెచ్‌సీల్లో వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు.

వైద్య, ఆశా కార్యకర్తలతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయా గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజల్ని అప్రమత్తంచేసి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన పెంపొందించాలన్నారు. ఆసుపత్రుల్లో మందులు కొరత లేకుండా చూడాలని డీడీహెచ్‌వో సృజనకు సూచించారు. పీహెచ్‌సీల్లో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులకు మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించటంతో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో వైద్య, మున్సిపల్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు

» వైసీపీ నేతపై ఫిర్యాదు చేసిన టీడీపీ శ్రేణులు

తాళ్లూరు, జూలై 22: తూర్పుగంగవరంకు చెందిన వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జక్కుల రామకృష్ణ ఆపార్టీ శ్రేణులను రెచ్చగొట్టే విధంగా వాట్సాప్ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని టీడీపీ నేతలు పేర్కొన్నారు. తద్వార శాంతి భద్రతలకు విఘాతం కల్గించేందుకు యత్నిస్తున్నారని అన్నారు. అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, లోకేష్‌ల మీద అనుచితవాఖ్యలను గ్రూప్‌లో పెట్టేవారన్నారు. ప్రభుత్వం మారినా తీరు మార్చుకోకుండా అదే పద్ధతి కొనసాగిస్తున్నాడన్నారు. రాష్ట్రంలో పలుగ్రామాల్లో చిన్నచిన్న హింసాత్మక ఘటనలు జరుగుతుండగా జక్కుల రామకృష్ణ ప్రస్తుత టీడీపీ పాలనలో హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయంటూ పోస్టులు పెడుతున్నారన్నారు. ఎప్పుడో జరిగిన, ఇతరరాష్ట్రాల్లో జరిగిన హింసాత్మక ఘటనల వీడియోలను ఇటీవలే టీడీపీ శ్రేణులు చేశారంటూ గ్రూప్‌లో పోస్టులు, చాటింగ్‌లు పెడుతున్నారన్నారు. వీటిని చూసిన వైసీపీ శ్రేణులు రెచ్చిపోతూ టీడీపీ శ్రేణులను దుర్భాషలాడుతున్నారన్నారు. దీనివల్ల గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు, శాంతి భద్రతలకు విఘాతం కల్గే విధంగా ఉందన్నారు.

వాట్సాప్ గ్రూప్‌లో వైసీపీ శ్రేణులను టీడీపీ కార్యకర్తలపై రెచ్చగొట్టేవిధంగా పోస్టులు, వీడియోలు, చాటింగ్‌లు పెడుతున్న జక్కుల రామకృష్ణపై చర్యలు తీసుకోవాలని కోరు తూ టీడీపీ తూర్పుగంగవరం గ్రామ అధ్యక్షుడు కనిశెట్టి రామలక్ష్మయ్య, వల్లభనేని సుబ్బయ్య, చాట్ల దాని, సూర్యనారాయణలు ఎస్సై విజయకుమార్‌కు సాక్ష్యాధారాలతో ఆదివారం రాత్రి లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు.

మురుగుకూపాలుగా ప్రభుత్వ కార్యాలయాలు

» పట్టించుకోని అధికారులు

» ఇబ్బందులు పడుతున్న ప్రజలు



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో గుంతల్లో నిలబడిన నీరు



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న మురుగునీటి గుంతలో పందుల స్వైరవిహారం

కనిగిరి, జూలై 22: నిత్యం జనసంచారంతో ఉండే ప్రభుత్వ కార్యాలయాలు పందులకు ఆవాసాలుగా మారాయి. పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దార్, ఐసీడీఎస్, ఆర్డీవో, స్త్రీశక్తి భవనం వంటి ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకేచోట ఉన్నాయి. దీంతో నిత్యం వివిధ పనుల నిమిత్తం ప్రజలు ఆ కార్యాలయాల వద్దకు వస్తుం టారు. ఇటీవల కురిసిన వర్షాలకు సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో నీరు నిలిచి మురుగుగుంటలుగా మారాయి. తహసీల్దార్ కార్యాలయం వద్ద వర్షపు నీరు మళ్లించేందుకు కాలువను తవ్వారు. వర్షపు నీరు ఆ కాలువ ద్వారా బయటికి వెళ్ళేందుకు ఏర్పాటు చేశారు.

అయితే, కాలువ తీసిన ప్రాంతం ఎ త్తుగా ఉండటంతో వర్షపు నీరు ఆ కాలువలో నిలిచిపోయింది. దీంతో ము రుగునీటి మయంగా మారింది. ఆ మురుగునీటిలో పందులు తిరుగుతూ అపరిశుభ్రం చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టనట్లు వ్య వహరిస్తున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన అధికారులు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు అపరిశుభ్రత కారణంగా రోగాలు అంటగడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీటిని మళ్ళించి పందుల స్వైర విహారాన్ని నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

కనిగిరిలో ట్రాఫిక్ కష్టాలు



ఉప్పురోడ్డులో భారీ ట్రక్కు రావటంతో ఆగిపోయిన ట్రాఫిక్

కనిగిరి, జూలై 22: కనిగిరిలో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమైంది. పట్టణంలో నుంచి భారీ వాహనాలు వెళుతుంటాయి. ఈక్రమంలో ఉప్పు బజారులో పామూరు బస్టాండు నుంచి చెక్‌పోస్టు వరకు నిత్యం ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుంది. బైపాస్ రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో భారీ వాహనాల రాకపోకలు మరింత పెరిగాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే టర్బో లారీలు నిత్యం పట్టణంలో గుండా ఒంగోలు వైపు వెళ్తుండటంతో మరింత ఇబ్బందిగా మారింది. దీనికితోడు ప్రయివేటు ట్రావెల్స్ రాకపోకలు సంఖ్య అధికమైంది. రాత్రి 7 నుంచి 10 గంటల వరకు ప్రభుత్వాసుపత్రి, వెన్నెల అపార్ట్‌మెంట్, ఒంగోలు బస్టాండు వద్ద పాయింట్‌లు గా చేసుకుని బస్సులను నిలిపి వేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ పెరిగిపోతుంది. ఇప్పటికైనా పోలీసు, మున్సిపల్ అధికారులు దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ప్రజల అర్జీలకు సత్వరమే పరిష్కారం

» మీ కోసంలో కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 22 : ప్రజాఫిర్యాదుల వ్యవస్థ (మీకోసం)లో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశపు హాలులో సోమవారం మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలు పలురకాల సమస్యలను విన్నవించారు. ఆయా సమస్యలపై కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ అర్జీలన నిర్దేశించిన సమయంలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రతి అర్జీని సంబంధిత అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియా ఒక బాలుడికి శ్రవణ యంత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్‌కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఎస్‌డీసీలు వరకుమార్, ఝాన్సీలక్ష్మి తదితరులు ఉన్నారు.

నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలులో రొయ్యల చెరువుల సాగు వల్ల వచ్చే వ్యర్ధరసాయన జలంతో తాగునీరు కలుషితమవుతుందని అమ్మనబ్రోలు, దే వరంపాడు, ఉలిచి, బొద్దులూరివారిపాలెంకు చెందిన ప్రజలు ఫిర్యాదు చేశారు తాగునీరు కలుషితం కావడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. తమ గ్రామాలకు న్యాయం చేసి ఆదుకోవాలని కలెక్టర్‌కు విన్నవించారు.

వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో తప్పుడుసర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సృజన్ మాదిగ కోరారు.

ప్రజా ఫిర్యాదులను పరిష్కరించండి

ఒంగోలు(క్రైం), జూలై 22: ప్రజా ఫిర్యాదులు పరిష్కరించి సత్వర న్యాయం అందించాలని ఎస్పీ ఏఆర్.దామోదర్ పేర్కొన్నారు. సోమవారం పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యాక్రమంలో ఆయన పాల్గొని ఫిర్యాదులు అందుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి 92 మంది తన వినతులను ఎస్పీకి అందజేశారు. ఫిర్యాదిదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో వెంటనే పరిష్కరించాలని కోరారు. అయితే గతంలో గ్రివెన్స్‌లో ఇచ్చినా పరిష్కారం కాలేదని ఎక్కువ మంది తెలియజేశారు. దీంతో ఎస్పీ స్పందిస్తూ ఫిర్యాదిదారుల పట్ల అలసత్వం వహించవద్దని అధికారులను హెచ్చరించారు.

కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కె.నాగేశ్వరరావు, ఎస్‌వి.శ్రీధరరావు పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్ చోరీ

పీసీపల్లి, జూలై 22: పొలం వద్ద నిలిపి ఉంచిన మోటార్‌సైకిల్ చోరీకి గురైన సంఘటన మండలంలోని తలకొండపాడులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గోనుగుంట్ల మాలకొండ్రాయుడు ఆదివారం తన ద్విచక్రవాహనంపై పొలం వెళ్లాడు. పొలం బయట బైకును నిలిపి ఎనులు చేసుకునేందుకు వెళ్లాడు. పొలం పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చేందుకు బైకును నిలిపిఉంచిన ప్రాంతానికి వెళ్లగా కనిపించలేదు. సోమవారం కూడా బైకు ఆచూకీ లభించకపోవడంతో చోరీకి గురైందని భావించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

తాళ్లూరు, జూలై 22: మండలంలోని వెలుగువారిపాలెం పంచాయతీ పరిధిలోని గంగపాలెంలో ప్రభుత్వ భూములు ఆక్రమణలు జరుగకుండా చూడాలని గ్రామానికి చెందిన సయ్యద్ ఇమామ్ సోమవారం గ్రీవెన్‌సెల్‌లో తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబరు 684లోని వాగు పోరం బోకు భూములను కొందరు ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. ఆభూములు గతంలో ఆక్రమణలకు గురికాగా రెవెన్యూ అధికారులు గుర్తించి ఆక్రమణలను తొలగించి ఎవరూ ప్రవేశించ వద్దని బోర్డును ఏర్పాటుచేశారు. ఆబబోర్డులను తొలగించి మరలా ఆక్రమణలు చేస్తున్నారని తెలిపారు. ఆక్రమణలపై విచారణ చేయించి తగు చర్యలు చేపడతామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

వీఆర్వో ద్వారా కౌలు పత్రం పొందాలి

కనిగిరి, జూలై 22: భూ యజమానులను ఒప్పించుకుని గ్రామ రెవెన్యూ (వీఆర్వో) ద్వారా కౌలు పత్రాన్ని పొందవచ్చునని ఏడీఏ ఈవీ రమణ అన్నారు. మండలంలోని బడుగులేరు గ్రామంలోని రైతు సేవాకేంద్రంలో సోమవారం కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ కౌలు రైతుకు భూమి మీద ఎటువంటి హక్కు ఉండదని చెప్పారు. కేవలం సాగు చేసిన పంట మీద మాత్రమే హక్కు ఉంటుందని తెలిపారు. కౌలు కార్డు కేవలం 11నెలలు మాత్రమే పనిచేస్తుందన్నారు. కౌలు కార్డుల ద్వారా పంట నమోదు, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, కనీస మద్దతు ధరకు విక్రయించుకునేందుకు ఉపయోగ పడుతుందన్నారు. వీఆర్వో ద్వారా కౌలు గుర్తింపు కార్డు జారీ చేస్తారన్నారు. కార్యక్రమంలో వీఆర్వో నాగేశ్వరరావు, వీఏఏ విక్రమ్, రైతులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి

తాళ్లూరు, జూలై 22: రైతుల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం, దర్శి కార్యక్రమ సమన్వయకర్త జిరమేష్ అన్నారు. సోమవారం మండలంలోని మల్కాపురంలో జరిగిన కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) స్వర్ణోత్సవ జ్యోతి వేడుకల యాత్రలో ఆయన మాట్లాడారు. కేవీకేలు రైతుల అభ్యున్నతికి ఏవిధంగా చేపడుతున్నాయో వివరించారు. రైతుల సమాచార నిధుల కేంద్రాలుగా కేవీకేలు అవతరించాయన్నారు. వీటిద్వారా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు ఎప్పటికప్పుడు వివరిస్తున్నట్లు చెప్పారు. దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా జిల్లాకు అనుకూలమైన నూతన వంగడాలను రైతులకు చేరవేస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా కందిరకం ఎల్‌ఆర్‌జి 105 విత్తనాలకు రైతులకు అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ పి.వెంకటేశ్వరరెడ్డి. టి.మానస, సర్పంచ్ కాలేషావలి, రైతులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

కనిగిరి, జూలై 22: ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం కనిగిరి పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ త్యాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బాదుల్లావారి వీధిలో నివాసం ఉంటున్న మూలె బ్రహ్మానందరెడ్డి (34) అనే వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య పుట్టింటికి వెళ్ళిందని మనస్తాపంతో ఉరి వేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందని ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి కుమారుడు ఉన్నారు. మృతుడి తల్లి సుశీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దేవస్థాన నిర్మాణానికి విరాళం

సీఎస్‌పురం(పామూరు)జూలై 22: సీఎస్‌పురం మండంలోని బాలుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానానికి డీజీపేటకు చెందిన చెవుల శ్రీనివాసయాదవ్ విరాళం ఇచ్చారు. రూ.లక్ష నగదును బాలుపల్లి గ్రామ సర్పంచ్ బొట్ల చిరంజీవికు సోమవారం అందజేశారు.

నారాయణస్వామి ఆదాయం రూ.లక్షా 12వేలు

సీఎస్‌పురం(పామూరు), జూలై 22: సీఎస్‌పురం మండలం కోవిలంపాడు పంచాయతి మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానానికి ఆదివారం ఆదాయం రూ.1,12,014 వచ్చినట్లు ఈవో గిరిరాజు నరసింహబాబు తెలిపారు. టిక్కెట్లు అమ్మకం ద్వారా రూ.63,160, లడ్డు ప్రసాదం ద్వారా రూ.30,290, అన్నదానం విరాళం ద్వారా రూ.18,564 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

సంపూర్ణ ఆరోగ్యానికి శాఖాహారం మేలు

పామూరు, జూలై 22: సంపూర్ణ ఆరోగ్యానికి శాఖాహారం మేలని సీనియర్ పిరమిడ్ మాస్టర్ జయలక్ష్మి అన్నారు. స్థానిక శ్రీ పత్రీ సాయి జ్ఞానబోధి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో గురుపౌర్ణమి సందర్భంగా ధ్యాన శిక్షణ తరగతులను, ప్రవచనలను ఆటపాటల ద్వారా బోధించారు. జయలక్ష్మి మాట్లాడుతూ మనిషిలో ప్రశాంతత పెరిగే కొద్ది విజయాలు, శక్తి సామర్థ్యాలు పెరుగుతాయని చెప్పారు. మన శ్శాంతి పొందాలంటే మనస్సును సాత్విక గుణంతో ఉంచుకోవాలన్నారు. అందుకు ధ్యానం ఒక్కటే మార్గమన్నారు. ధ్యానంతో శరీరంలో నాడిశుద్ధి జరిగి రోగాలు దూరమవుతాయని జయలక్ష్మి పేర్కొన్నారు.

కార్యక్రమంలో పందిటి అల్లురయ్య, గుత్తి రమణయ్య, కె.ప్రభాకర్, పందిటి సౌభాగ్యమ్మ, వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





గుంటూరు చుట్టుగుంట వద్ద అన్న క్యాంటీన్ వద్ద పనులు చేస్తున్న కార్మికులు

సీఐల బదిలీల్లో జాగ్రత్త



- తేడా వస్తే మీదే బాధ్యత
- ఎమ్మెల్యేలకు చంద్రబాబు హెచ్చరికలు
- తాజాగా పల్నాడులో మరో 10 మంది సీఐల బదిలీలు నిలిపివేత

గుంటూరు, జూలై 22 : సీఐల బదిలీల విషయంలో తేడా వస్తే మీరే బాధ్యత వహించాలి... ఈ విషయంలో ఆచితూచి వ్యవహరించండి... గడిచిన ఐదేళ్లలో వైసీపీకి అంటకాగిన వారిని దూరంగా ఉంచండి... సీఐల పోస్టింగ్స్ విషయంలో మీడియాలో విమర్శలు, ఆరోపణలు రాకుండా ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోండి... అంటూ సీఎం చంద్రబాబు నాయుడు పార్టీ ఎమ్మెల్యేలకు హెచ్చరికలు జారీ చేశారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో సీఎం చంద్రబాబు చేసిన హెచ్చరికలు జిల్లాలోని ఎమ్మెల్యేలలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల కాలంలో గుంటూరు రేంజిలో జరుగుతున్న సీఐల బదిలీల విషయంలో పత్రికల్లోనూ, పార్టీ శ్రేణుల నుంచి సోషల్ మీడియాలోనూ పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్న విషయం విదితమే. మునుపెన్నడు లేనివిధంగా గడిచిన ఐదేళ్లలో పోలీస్ శాఖ విషయంలో వైసీపీ ప్రభుత్వం అనుసరించిన వైఖరి సర్వత్ర తీవ్ర విమర్శలపాలైంది. ముఖ్యంగా ఓ సామాజిక వర్గాన్ని పూర్తిగా అణిచివేయడమే గాక టీడీపీకి అనుకూలంగా ఉంటారనో, తటస్థంగా పనిచేస్తారనో భావించి అనేకమంది పోలీస్ అధికారులను వీఆర్‌లోకి పంపి కనీసం జీతాలు కూడా లేకుండా వేధింపులకు గురి చేశారు. అందులో ఒక సామాజిక వర్గం ఏక మొత్తంగా ఉండగా మిగిలిన వివిధ సామాజిక వర్గాలు వారు కూడా బాధితులుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయా అధికారులతో పాటు పార్టీ శ్రేణులు, అదేవిధంగా ప్రజలు కూడా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారందరికీ న్యాయం చేస్తారని భావించారు. అయితే ఊహించని విధంగా పార్టీ ఎమ్మెల్యేలు తీసుకున్న నిర్ణయం జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులను తీవ్ర నిరుత్సాహానికే గాక ఆగ్రహానికి కూడా గురి చేసింది. ఈ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో వైసీపీనే అధికారంలోకి వస్తుంది, జగన్ ముఖ్యమంత్రి అవుతారు, ఇంకెక్కడ తెలుగుదేశం అంటూ బహిరంగంగా వ్యాఖ్యలు చేసిన అనేకమంది సీఐలు, చివరకు ఎన్నికల సమయంలోనూ వైసీపీ గెలుపు కోసం తమ వంతు ప్రయత్నాలు చేశారు. అయితే ఆయా సీఐలకు కూటమి ప్రభుత్వంలో మిగిలిన వారి కంటే ముందుగానే సీఐల బదిలీల ప్రక్రియ కంటే ముందే పలుచోట్ల పోస్టింగ్స్ వస్తుండటంతో పార్టీ కార్యకర్తలతో పాటు ఆరోజు ఆయా అధికారులతో కలిసి పనిచేసిన పోలీస్ సిబ్బంది లోనూ సర్వత్ర విస్మయం వ్యక్తం అవుతోంది. ఇదిలా ఉంటే వారం రోజుల క్రితం పల్నాడు జిల్లాలో పదిమంది సిఐలను నియమిస్తూ ఐజీ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అందులో చాలామంది గడిచిన ఐదేళ్లలో వివిధ పోలీస్ స్టేషన్లలో సీఐలుగా కొనసాగిన వారు ఉండడంతో తీవ్ర విమర్శలు వ్యక్తం అయ్యాయి. పార్టీ శ్రేణులు అధిష్టానానికి ఫిర్యాదు చేశారు.

మరోవైపు సోషల్ మీడియాలోనూ వీటికి వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో పల్నాడు జిల్లాలో నియమించిన పదిమంది బదిలీలను నిలిపివేశారు. ఈ విధంగా రేంజి పరిధిలో బదిలీల విషయంలో ఎమ్మెల్యేలు తప్పటడుగులు వేస్తుండడం వివాదాస్పదంగా మారుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు వివిధ ప్రాంతాల్లో సీఐలుగా బాధ్యతలు నిర్వహించిన వారికి కూడా ఎమ్మెల్యేలు పేర్లు ఇవ్వడం ప్రస్తుతం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆయా ఎమ్మెల్యేలకు ఏ సామాజిక వర్గం వారు కావాలనుకుంటున్నారో అదే సామాజిక వర్గంలో గత వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బందులకు గురైన వారికి అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు. బదిలీల విషయంలో డబ్బులు అందుకున్న దళారులు మాటలు నమ్మటమో లేదంటే తమ వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసమో లేదంటే ఎవరో సిఫార్సు చేశారని ఎమ్మెల్యేలు అటువంటి వారికి పోస్టింగ్స్ ఇప్పిస్తే ఆయా ఎమ్మెల్యేలు పార్టీ శ్రేణులకు టార్గెట్ అయ్యే అవకాశం ఉంది. ఇటువంటి పరిణామాలను ముందే గ్రహించిన సీఎం చంద్రబాబు తాజాగా బదిలీల విషయంలో ఎమ్మెల్యేలకు పరోక్ష హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సీఐల బదిలీల విషయంలో అటు ఎమ్మెల్యేలు, ఇటు అధిష్టానం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోనని కార్య కర్తలు పార్టీ నాయకులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

త్వరలో.. అన్న క్యాంటీన్లు



వైసీపీ పాలనలో అన్న క్యాంటీన్ల దుస్థితి

అవి 5 రూపాయలకే పేదలకు పట్టెడన్నం పెట్టి ఆకలి తీర్చిన అక్షయపాత్రలు కేవలం 15 రూపాయలతో మూడు పూటలా కడుపులు నింపే అన్న క్యాంటీన్లు.. అలాంటి అన్న క్యాంటీన్లు గత వైసీపీ ప్రభుత్వ కక్ష సాధింపులకు బలై పోయాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో పేదలకు అన్నం దక్కకుండా చేసి వారిని ఆకలి, పస్తులపాలు చేశాయి. అయితే ఐదేళ్ల పాటు అన్న క్యాంటీన్లకు పట్టిన గ్రహణం త్వరలో వీడ బో తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు కసరత్తు మొదల యింది. తొలి ఐదు హామీల్లో ఒకటైన అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు పూనుకుంది. ఈ ఏడాది ఆగస్టు 15న అన్న క్యాంటీన్లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. కాగా గతంలో ఏర్పాటు చేసిన 183 అన్న క్యాంటీన్లను ఆగస్టు 10 నాటికి సిద్ధం చేయాలని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ ఇటీవల అధికారులను ఆదేశిం చారు. ఇప్పటికే పలుచోట్ల అన్న క్యాంటీన్లకు మరమ్మ తులు చేసి, రంగులు వేసి అధికారులు సిద్ధం చేస్తున్నారు.

- ఆగస్టు 15 నుంచి ప్రారంభించేందుకు కసరత్తు
- నియోజకవర్గానికి 3 క్యాంటీన్ల ఏర్పాటుపై దృష్టి
- ఇప్పటికే ప్రతిపాదనలు అందజేసిన మున్సిపాలిటీలు
- 2018లో ఉమ్మడి జిల్లాలో 29 ఏర్పాటు
- శిథిలమైన క్యాంటీన్లను పునర్నిర్మిస్తున్న అధికారులు

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో వేలాది మంది పట్టణ పేదల ఆకలి తీర్చేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం 2018 జూలై 11న అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. జిల్లాలోని 13 నగర, పురపాలక సంఘాల్లో మొత్తం 29 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ప్రతి రోజూ వేలాది మంది పట్టణ పేదలకు రూ. 5 రూపాయలకే టిఫిన్, భోజనం లభించేది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వచ్చే దినసరి కూలీలకు మధ్యాహ్నం ఈ అన్న క్యాంటీన్లు ఆకలి తీర్చేవి. పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేవారికి కూడా మధ్యాహ్నం పూట అన్న క్యాంటీన్లలో రూ. 5కే అన్నం లభించడంతో వారికి కూడా ఆర్థికభారం తప్పేది. ఇలా ప్రతి రోజూ ఒక్కో అన్న క్యాంటీన్ 1500 నుంచి 2000 వేలమందికిపైగా ప్రజలకు ఆకలి తీర్చేవి. వీధులవెంట, రైల్వేస్టేషన్లు, బస్టాండుల్లో జీవించే నిరాశ్రయులు, నిరుపేదలు, భిక్షాటకులకు కూడా అన్న క్యాంటీన్లు ఆకలి తీర్చేవి.

- గుంటూరులోని మిర్చియార్డులో, గోరంట్ల ఐడీ ఆసుపత్రి వద్ద, చిలకలూరిపేటలో రెండు చోట్ల, నరసరావుపేటలో రెండు చోట్ల, తెనాలిలో రెండు చోట్ల, రాష్ట్ర హైకోర్టు, సచివాలయం, కరకట్ట వద్దనున్న ముఖ్యమంత్రి నివాసం సహా జిల్లాలో 13 పట్టణాల్లో 29 అన్నా క్యాంటీన్లను గత టీడీపీ ప్రభుత్వం 2018లో ప్రారంభించింది. కాగా వైసీపీ ప్రభుత్వం వాటన్నింటినీ పాడుబెట్టింది. ఫలితంగా అనేక చోట్ల క్యాంటీన్లు శిథిలమైపోయాయి. కొన్నింటిని సచివాలయాలుగా మార్చారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వాటన్నింటినీ తిరిగి ప్రారంభించేందుకు కసరత్తు చేస్తోంది. పాడుబడిపోయిన భవనాలకు రంగులు వేసి మున్సిపల్ అధికారులు కొత్త రూపురేఖలు తెస్తున్నారు. శిథిలమైనవాటిని పునర్నిర్మిస్తున్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని అన్ని ప్రధాన పట్టణాలు, నగరాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఒక్కో నియోజకవర్గ పరిధిలో 3 అన్న క్యాంటీన్లు ఉండేలా చర్యలు చేపడుతోంది. ఆగస్టు 15 నుంచి వాటిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారుల నుంచి ప్రతిపాదనలు కోరగా, స్థానిక అధికారులు ప్రతిపాదనలు పంపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో బస్టాండు సెంటర్లో ఒకటి, ఆటోనగర్‌లో ఒకటి, మార్కెట్ సెంటర్లో ఒకటి, పశ్చిమ నియోజకవర్గంలో మిర్చియార్డులో ఒకటి, చుట్టుగుంటలో ఒకటి, గుజ్జనగుండ్లలో ఒకటి, మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాలలో ఒకటి చొప్పునఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది.



గుంటూరు బస్టాండు వద్ద అన్న క్యాంటీన్‌కు మరమ్మతులు చేస్తున్న కార్మికులు

● ధ్వంసం చేసిన వైసీపీ ప్రభుత్వం

పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లను తాను కొనసాగిస్తానని, తన తండ్రి పేరుతో వాటిని రాజన్న క్యాంటీన్లుగా నడుపుతానని చెప్పిన గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని మూసేశారు. అధికారంలోకి వచ్చిన రోజుల్లో రంగులు మార్చి అన్న క్యాంటీన్ పేరును రాజన్న క్యాంటీన్‌గా మార్చి హడావుడి చేసినా, ఆ తరువాత వాటిని నిర్దాక్షిణ్యంగా మూసేశారు. దీంతో పేదలకు పట్టెడన్నం కూడా లభించడం గగనమైపోయింది. టీడీపీ నేతలు కొందరు తమ వ్యక్తిగత చొరవతో సొంత డబ్బులతో ఏర్పాటు చేసినా వాటిని అక్కసుతో వైసీపీ నేతలు కూల్చేశారు. పేదల నోటి దగ్గర కూడు లాగేశారు. దీనిపై విమర్శలు పెద్ద ఎత్తున వెల్లువెత్తడంతో ప్రభుత్వం కొంత వెనక్కి తగ్గింది. దీంతో గుంటూరులో 4 చోట్ల, మంగళగిరి, దుగ్గిరాల, తెనాలి, చిలకలూరిపేట సహా అనేక పట్టణాల్లో టీడీపీ నేతలు సొంత ఖర్చుతో అన్న క్యాంటీన్లు నడిపారు. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రభుత్వం తిరిగి అన్న క్యాంటీన్ల కొనసాగింపుకు చర్యలు చేపడుతోంది.





తెరచాటు దోస్తీ.. పదవి కోసం కుస్తీ

- నామినేటెడ్ పదవుల కోసం టీడీపీ నేతల ఆరాటం
- అనర్హులే రేసులో ముందంజ
- పార్టీలో సభ్యత్వం లేకున్నా జిల్లా పార్టీ అధ్యక్ష పదవి కావాలంట
- అదేమంటే కులం కార్డు ప్రయోగిస్తూ బెదిరింపు
- మోపిదేవి, రజినీతో అంటకాగిన నేతలపై లోకేశ్ గుర్రు
- ఎంపీ అభ్యర్థుల వద్ద మాత్రం ఫొటోలకు ఫోజులు
- పనిచేయని వారికి పదవులు ఎలా అంటున్న ఎమ్మెల్యేలు

గుంటూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో నామినేటెడ్ పదవుల కోసం నేతల తాకిడి ఎక్కువైంది. ఎక్కడ ఇద్దరు ముగ్గురు నాయకులు తారసపడ్డా ప్రస్తుతం ఇదే అంశంపై చర్చ నడుస్తుంది .చివరకు మండల స్థాయిలోని చోటా మోటా నాయకులు కూడా రాబోయే పదవుల మీద ఊహాగానాలు చేస్తున్నారు .తెలుగుదేశం పార్టీలో ఈసారి నామినేటెడ్ పదవు లు కోరే నేతల జాబితా చాంతాడు లా పెరిగిపోయింది .2019 ఎన్నికల తర్వాత పార్టీని అంటిపెట్టుకొని ఉన్న నేతలతో పాటు, అటు ఇటు పక్క చూపులు చూసిన వారు కూడా నామినేటెడ్ పదవుల కోసం పోటీలోకి రావటం చర్చనీయాంశంగా మారింది . వాస్తవానికి కొందరు నేతలు గత ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బం దులు పడ్డారు. అనేక రకాల అక్రమ కేసులను ఎదుర్కొన్నారు. అయినప్పటికీ మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగి తెలుగు దేశం పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేశారు . పార్టీ కోసం సొంత డబ్బు ఖర్చు చేసి మరీ విజయానికి కృషి చేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత నామినేటెడ్ పదవుల కోసం తెలుగుదేశం పార్టీ సన్నాహాలు చేస్తుందన్న వార్తలు అటువంటి నాయకుల్లో ఆనందాన్ని కలిగించాయి. ఆయా నాయకులు వారి వారి స్థాయికి తగ్గట్టుగా పదవులను ఆశిస్తూ స్థానిక ఎమ్మెల్యేలకు మనసులోని మాటను చేరవేశారు. కొంతమంది ఎమ్మెల్యేలు వారి పరిధిలోని నాయకులకు పదవులపై క్లారిటీ కూడా ఇచ్చారు. ఆ మేరకు అధిష్టానానికి లేఖలు కూడా రాసినట్లు తెలుస్తోంది. అయితే గత ఎన్నికల తర్వాత కొంతమంది నేతలు వైసీపీ ముఖ్య నేతలతో టచ్ లోకి వెళ్లారు. గడచిన ఐదేళ్ల ప్రత్యక్షంగానో.. పరోక్షంగానో వారితో సంబంధాలను పెట్టుకున్నారు . తెలుగుదేశం పార్టీ, జనసేన కూటమి పొత్తు ఖరారు అయిన తర్వాత అటు వంటి నేతలు తిరిగి సైకిల్ వైపు చూశారు. ప్రస్తుతం పదవులు ఆశిస్తున్న వారిలో అటువంటి వారే ఎక్కువగా పావులు కదుపు తున్నారన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తం అవుతున్నది.

పనిచేయని వారికి నో ఛాన్స్

గత ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల్లో ఎవరెవరు ఎంత మేరకు పనిచేశారు అనేది ఎమ్మెల్యేలకు పూర్తిగా అవగాహన ఉంది. కొంత మంది నేతలు ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో పని చేయకుండా కేవలం ఫోటోలుకే పరిమితం అవుతూ వచ్చారు. ఓటర్లను కలిసి ఎక్కడా కూడా వారిని ప్రభావితం చేసిన పరిస్థితులు లేవన్నది కొంతమంది ఎమ్మెల్యేల వాదన. అటువంటి వారికి పదవులు ఇస్తే ఊరుకునేది లేదని వారు తెగేసి చెబుతున్నారు. పనిచేయని వారికి పదవులు ఇస్తే పనిచేసిన కార్యకర్తల పరిస్థితి ఏమిటని ఎమ్మెల్యేల వాదన. కొందరు నాయకులు ఎన్నికల్లో కేవలం ఎంపీ అభ్యర్థులు వచ్చినప్పుడు మాత్రమే ఫొటోల్లో కనపడుతూ వచ్చారు. ఆ తర్వాత ఎమ్మెల్యే అభ్యర్థుల కోసం పనిచేసిన దాఖలాలు లేవని తెలుస్తుంది. అటువంటి వారికి పదవులు ఇచ్చే విషయంలో పార్టీ అధిష్టానం ఏ విధంగా ముందుకు వెళుతుంది అనేది అర్థం కాని సంగతి. కొందరు టీడీపీ నేతలకు గతంలో వైసీపీ ఎంపీ మోపిదేవి రమణతో వ్యాపార సంబంధాలు ఉన్నాయనేది ఆరోపణ. అలాగే అప్పటి మంత్రి రజినీతో అంటకాగిన వారు ఉన్నారు. ప్రస్తుతం ఇతర పార్టీ నేతలతో వ్యాపార సంబంధాలు నెరపే వారు కూడా ఉన్నారు. అయితే సదరు సమాచారం నారా లోకేశ్ వద్ద ఉన్నట్లు వినికిడి. ప్రస్తుతం ఆ నేతల్లో ఒకరు ఎమ్మెల్సీ పదవి కోసం ప్రయత్నిస్తుండగా...అతని దరఖాస్తు కంటే ముందే.. అతని ప్రత్యర్థులు ఫిర్యాదులు అధిష్టానానికి చేరినట్లు సమాచారం. కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల వెంట కొందరు నేతలు తిరు గుతూనే శల్యసారథ్యం వహించారు... గుంటూరుపశ్చిమలో అయితే కొందరు టీడీపీ నేతలు వైసీపీ అభ్యర్థిగా ఉన్న మంత్రి రజినీతో లోపాయి కారీ ఒప్పందాలు పెట్టుకున్నారు. ఈ సమాచారం ఎమ్మెల్యే మాధవి దృష్టిలో ఉండటంతో నామినేటెడ్ పదవుల విషయంలో తమకు న్యాయం జరగదేమోననే ఆం దోళనలో నేతలు ఉన్నారు.

పార్టీ సభ్యత్వం లేకున్నా..

సాధారణంగా ఏ పార్టీ జిల్లా అధ్యక్ష పదవి పొందాలన్న ఆయా వ్యక్తులు ఎంతో కాలంగా పార్టీలో కష్టపడి పనిచేసిన వారై ఉండాలి. గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్ష పదవి కోసం ఈ మధ్యకాలంలో ఒకరు దరఖాస్తు చేసినట్లు తెలుస్తున్నది .ఆయనకు కనీసం పార్టీ సభ్యత్వం కూడా లేకపోవడం గమనించదగ్గ విషయం. అయితే సదరు వ్యక్తి జిల్లా అధ్యక్ష పదవి పొందేందుకు కులం కార్డును బలంగా ప్రయోగిస్తున్నట్లు సమాచారం. అటువంటి వ్యక్తులకు పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు ఎలా ఇస్తారని మిగిలిన నాయకులు ప్రశ్నిస్తున్నారు.

వడపోత జరిగేనా..

సాధారణంగా తెలుగుదేశం పార్టీలో నామినేటెడ్ పదవుల కోసం ఎప్పుడూ పోటీ ఎక్కువగానే ఉంటుంది. అయితే భారీ వడపోత తర్వాత పదవులను కేటాయించడం ఆనవాయితీగా వస్తుంది. అయితే ఈసారి వడపోత జరుగుతుందా లేదా అనేది చాలామందిలో సమాధానం దొరకని ప్రశ్నగా కనిపిస్తుంది . ప్రస్తుతం నామినేటెడ్ పదవులకు దరఖాస్తు చేసిన వారిలో అనర్హులే ఎక్కువ మంది ఉండటంతో ఈ ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి. ఒకవేళ అర్హులను పక్కనపెట్టి అనర్హులకు పదవులు దక్కితే ఏమిటన్న సందేహం కార్యకర్తల్లో కనపడుతున్నది . అయితే సీఎం చంద్రబాబు నాయుడు మాత్రం ఆయా మార్గాల ద్వారా జిల్లాలో నామినేటెడ్ పదవులకు అర్హులైన వారి వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం.

దోమల వ్యాప్తి నివారణకు చర్యలేవి..



- వర్షాలతో పెరిగిన దోమలు
- మేల్కొనకపోతే ప్రమాదమే
- కట్టడికి కదలని మున్సిపల్ సిబ్బంది

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రహదారుల్లో.. ఖాళీ స్థలాలు.. గుంతల్లో నీరు నిలిచింది. దీంతో దోమల వ్యాప్తి పెరిగింది. మున్సి పాలిటీ, పంచాయతీల అధికారులు తక్షణం చర్యలు తీసుకోకుంటే జనం రోగాలబారిన పడే అవకాశం ఉంది. ఇప్పటికే పలు గ్రామాలు, పట్టణాల్లో జ్వరాల కేసులు వెలుగు చూస్తున్నాయి. అక్కడక్కడ డెంగీ, వైరల్ ఫీవర్ కేసులు నమోదవుతున్నాయి. పట్టణాల్లో పారిశుధ్య కార్యక్రమం ఆశించిన స్థాయిలో ఉండడం లేదనే విమర్శలు ఉన్నాయి. వీధుల్లో చెత్తాచెదారం పేరుకు పోయినా.. తొలగించే పరిస్థితి లేదు. పురపాలక సం ఘాల్లో ప్రజారోగ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దోమల నివారణకు నిధులు కేటాయించడం లేదు. మురుగు కాలువలు పూడికతో నిండాయి. పూడిక తీసేందుకు మునిసిపాల్టీలు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు అంతగా కనిపించడం లేదు. మున్సిపాలిటీలు, పంచాయతీల పరిధిలో దోమల నివారణకు చేయాల్సిన ఫాగింగ్ జరగడం లేదు. ఫాగింగ్ యంత్రాలను మూలన పడేశారు. అన్ని మునిసిపాల్టీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఫాగింగ్ పేరుతో తిప్పే వాహనాల కు ఇంధనం కోసం బోగస్ బిల్లులు తయారుచేసి అక్రమాలకు పాల్పడుతున్న సంఘటనలున్నాయి.



నరసరావుపేట మున్సిపాలిటీలో పాడుబెట్టిన పాగింగ్ యంత్రం

కానరాని ప్రత్యేక కార్యక్రమాలు

తెలుగుదేశం ప్రభుత్వం ఉన్న 2014-19 మధ్య కాలంలో 'దోమలపై దండ యాత్ర' పేరుతో నివారణ చర్యలు మునిసి పాల్టీలు చేపట్టేవి. ఇవి ప్రజలను ఎంతో ఆలోచింపచేసేవి. ప్రతి శుక్రవారం డ్రై డే.. డ్రై డే నిర్వహించేవారు. దోమలు వృద్ధి చెందే ప్రాంతాలను గుర్తించి.. నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకునేవారు. నీటి తొట్టెలు, పాత్రలను తెరిచి ఉంచడం, టెంకాయ చిప్పలు, టైర్లలో నీరు నిలిచి ఉండటం తదితరాలతో వచ్చే అనర్థాలను జనాలకు వివరించే వారు. నీటి గుంతల్లో దోమల వ్యాప్తి నివారణకు అయిల్ బాల్స్ వేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించే వారు. ప్రస్తుతం ఇలాంటివి కనిపించడంలేదు. కనీసం క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉంది.. కేసులు వచ్చిన చోట ఏం చేయాలి.. భవిష్యత్తు కార్యచరణ ఏమిటి.. అనే ఆలోచన మునిసిపల్ యంత్రాగానికి లేకపోవడం గమనార్హం.

జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ జే.వెంకటమురళీ అధికారులకు సూచించారు. స్వాతంత్ర్యదినోత్సవం నిర్వహణపై జిల్లా అధికారులతో స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం ఎస్పీ తుషార్‌డూడి, జాయింట్ కలెక్టర్ డి.సుబ్బారావుతో కలిసి వేడుకలు నిర్వహించే పోలీసు కవాతు మైదానాన్ని పరిశీలించారు.



నిండా ముంచిన నకిలీ విత్తనాలు


ఎదుగుదల లేని బెండకాయలను చూపుతున్న రైతు పున్నయ్య

బల్లికురవ, జూలై 22 : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో నకిలీ విత్తనాలబారిన పడి రైతు మోసపోయారు. ఎన్ని మందులు వాడినా ఫలితం లేదని, సీడ్ విత్తనాలని దుకాణదారుడు అంటగట్టారని రైతు విలపిస్తున్నారు. ముక్తేశ్వరం గ్రామానికి చెందిన రైతు నాగండ్ల పున్నయ్య మార్టూరులోని ఓ ప్రైవేట్ విత్తన దుకాణంలో గత నెలలో బెండ విత్తనాలను కొనుగోలు చేసి ఎకరంలో బెండను సాగు చేశారు. సుమారు రూ.50 వేల వరకు పెట్టుబడులు పెట్టిన తోటలో కాయల దిగుబడి ఆలస్యంగా వచ్చింది. పలు రకాల మందులను కూడా పిచికారీ చేసినా కాయలు తెల్లగా, వంకరగా వచ్చాయి. ఇవి చూసిన మిగతా రైతులు నకిలీ విత్తనాలవల్లే ఇలా జరిగిందని తెలిపారు. దీంతో బాధిత రైతు పున్నయ్య లబోదిబోమంటూ విత్తనాలు ఇచ్చిన దుకాణం వద్దకు వెళ్లి ప్రశ్నించారు. తాము ఏమీ చేయలేమని చేతు లేత్తేశారని రైతు తెలిపారు. నకిలీ విత్తనాల సాగుతో తనకు తీవ్ర నష్టం జరిగిందని, తనను అధికారులు ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి


సామగ్రిని పరిశీలిస్తున్న ఎంఈవో సుధాకరరావు

అద్దంకిటౌన్, జూలై 22 : ఉపాధ్యాయులు ప్రతి రోజు బోధనలో అభ్యసనా సామగ్రిని ఉపయోగించుకుని విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని ఎంఈవో బూదాటి సుధాకరరావు అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం అద్దంకి పట్టణంలోని కట్టకిందపాలెం ప్రాథమిక పాఠశాల, బొమ్మనంపాడు ప్రాథమిక పాఠశాల (హిందు)లో స్థానిక వనరులతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తయారు చేసిన బోధనా అభ్యసన సామగ్రిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కట్టకిందపాలెం ప్రాథమిక పాఠశాలలోని అభ్యసన సామగ్రిని ఎంఈవో సుధాకరరావు పరిశీలించి ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఏపీసీ సూచనల మేరకు జూలై 22 నుంచి 28వ తేదీ వరకు వారం రోజుల పాటు మండలంలోని అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఎంవీ సుబ్బారావు, ఇన్‌చార్జి హెచ్ఎం పూర్ణావతి, కాంప్లెక్స్ ఛైర్మన్ శ్రీనివాస్‌మూర్తి, సీఆర్పీలు పుణ్యవతి, శంకర్, ఉపాధ్యాయులు శ్యామలదేవి, వెల్ఫేర్ అసిస్టెంట్ అల్లా సాహెబ్ పాల్గొన్నారు.

ఏకేయూ ఇన్‌చార్జీ వీసీగా మూర్తి బాధ్యతల స్వీకరణ

ఒంగోలు(విద్య), జూలై 22: ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఇన్‌చార్జీ ఉపకులపతిగా ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ బి.హరిబాబు ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఉద్యోగులు ఘనస్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మూర్తి మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ఆంధ్రకేసరి యూనివర్సిటీకి ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. యూనివర్సిటీ పరిధిలో అడ్మిషన్ల పెంచడంతోపాటు విద్యార్థులకు అవసరమైన విద్యను అందించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో కలిసి ముందుకు పోతామన్నారు. నూతనంగా ఏర్పడిన యూనివర్సిటీకి అవసరమైన సిబ్బంది, భవనాలు, ఆర్థికపరమైన వనరులు ఏర్పాటు విషయంలో రాష్ట్రప్రభుత్వ పెద్దలు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని కోరారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఆంధ్రా యూనివర్సిటీ కూడా ప్రారంభంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొందన్నారు. ఏకేయూ అన్నిరంగాల్లో ముందుకు పోతుందని తెలి పారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులను ఏర్పాటు చేసేందుకు తన శక్తివంచన లేకుండా కృషిచేస్తానని తెలిపారు. తనను వీసీగా నియమించేందుకు అవకాశం కల్పించిన గవర్నర్ అబ్దుల్‌నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా బాధ్యతలు స్వీకరించిన వీసీ మూర్తిని ప్రిన్సిపాల్ జి.రాజమోహన్, సీఈ డాక్టర్ కేవీఎస్ రాజు, ఏసీఈ డాక్టర్ పద్మ, డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ హర్షప్రీతమ్, దేవ్‌కుమార్ తదితరులు అభినందించారు.

సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలను కాపాడాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు


సీపీఎం ప్లీనరీ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 22 : జిల్లాలో సీజనల్ వ్యాధుల బారి నుంచి ప్రజలను రక్షించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. స్థానిక సుందరయ్య భవన్‌లో సోమవారం జరిగిన సీపీఎం ప్లీనరీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి జిల్లా కార్యదర్శి హనీఫ్ అధ్యక్షత వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ చీమకుర్తిలో మలేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని తెలిపారు. మార్కాపురం, వైపాలెంలలో కూడా కేసులు వస్తున్నందున సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత చిరు ఉద్యోగులు, స్కీం వర్కర్లను తొలగించే విధానాన్ని విరమించుకోవాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులను సత్వరమే పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పశ్చిమప్రాంతంలోని వెలిగొండ ప్రాజెక్టును సత్వరమే పూర్తిచేయడంతోపాటు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. ఆదేవిధంగా చిన్న నీటి వనరులను కూడా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. జిల్లాలో ఉపాధిహామీకూలీల సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం సమావేశంలో జిల్లావ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యపై చర్చించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి పాల్గొన్నారు.

భవనాసి చెరువుకు సాగర్ జలాలు విడుదలయ్యేనా..?

- అద్దంకి పట్టణానికి పొంచి ఉన్న నీటి ఎద్దడి సమస్య
- సాగర్ ద్వారానే సమస్యకు పరిష్కారం


భవనాసి చెరువులో అడుగంటిన నీరు

అద్దంకి, జూలై 22: తాగునీటి అవసరాలకు సాగర్ జలాలు విడుదల అయ్యాయి. అయితే నోటిఫైడ్ చెరువులకు మాత్రమే నింపే అవకాశం ఉంది. అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో మొత్తం 125 చెరువులు ఉండగా, అందు లో 89 నోటిఫైడ్ చెరువులు, 36 నాన్ నోటిఫైడ్ చెరువులు ఉన్నాయి. నోటిఫైడ్ చెరువులు ఎక్కువ భాగం పర్చూరు నియోజకవర్గంలోనే ఉన్నాయి. అద్దంకి నియోజకవర్గంలో పలు గ్రామాలలోని చెరువులలో కూడా నీరు పూర్తిగా అడుగంటాయి. అదే సమయంలో భవనాసి చెరువులో గతంలో ఎన్నడూలేని విధంగా నీటి నిల్వ పూర్తిగా తగ్గిపోయింది. భవనాసి చెరువులో నీరు లేకపోవడంతో సమీపంలోని సుమారు 15 గ్రామాలకు పరోక్షంగా నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉంది. ఇక గుండ్లకమ్మ నదిలో నీటి ప్రవాహం లేకపోవటం, గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో నీటి నిల్వ లేకపోవడంతో అద్దంకి పట్టణానికి తాగునీటి సరఫరా చేసే గుండ్లకమ్మ నదిలోని ఊటబావులలో నీటి నిల్వలు తగ్గిపోయాయి. దీంతో నీటి సరఫరాకు కూడా ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం సాగర్ కాలువలకు నీరు విడుదల అయినందున భవనాసి చెరువుకు నీటిని విడుదల చేసి, చెరువు నుంచి లోలెవల్ కాలువ ద్వారా గుండ్లకమ్మ నదిలోని ఊటబావుల వద్దకు విడుదల చేసేందుకు అవకాశం ఉంది. భవనాసి చెరువు నాన్‌నోటిఫైడ్‌గా ఉన్నందున ఎన్నెస్పీ అధికారులు నీరు విడుదల చేసే అవకాశం లేదు. అయితే పట్టణానికి తాగునీటి అవసరాల దృష్ట్యా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక దృష్టిసారించి భవనాసి చెరువుకు సాగర్ జలాలను కొంతమేరైనా విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలతో పాటు, పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నోటిఫైడ్ చెరువులకు నీరు నింపేలా ప్రణాళిక

అద్దంకి బ్రాంచి కెనాల్ పరిధిలో మొత్తం 125 చెరువులు ఉండగా అందులో 89 నోటిఫైడ్ చెరువులు ఉన్నాయి. పలు చెరువులలో నీరు పూర్తి గా అడుగంటడంతో ఆయా గ్రామాల ప్రజలు తాగునీటి కి ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో నోటిఫైడ్ చెరువులకు నీటిని నింపే విధంగా ప్రణాళికలు రూపొందించటం జరిగిందని ఈఈ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఎబిసిలో బాపట్ల జిల్లా సరిహద్దు 18 వ మైలు వద్ద సోమవారం 870 క్యూసెక్కులు నీరు విడుదల అవుతుందన్నారు. నాలుగు రోజుల పాటు సుమారు 0.37 టిఎంసీల నీరు విడుదల కానున్నట్లు తెలిపారు. తాగునీటి చెరువులకు మా త్రమే నింపుకోవాలని కోరారు.

మున్సిపల్ పాలకవర్గంలో మూడు ముక్కలాట

- అభివృద్ధికి ఆటంకం కలగకుండా ఉండేనా..?
- పట్టు నిలుపుకునేందుకు వైసీపీ యత్నం
- పాగా వేసేందుకు టీడీపీ అడుగులు
- త్వరలో ఎక్స్ అఫిషియో మెంబర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న ఎమ్మెల్యే కొండయ్య


ఎమ్మెల్యే కొండయ్యకు మద్దతు తెలుపుతున్న వైసీపీ కౌన్సిలర్లు (ఫైల్)

చీరాల, జూలై 22 : చీరాల రాజకీయం ఎప్పుడు రసకందాయమే. మున్సిపల్ పాలకవర్గంలో మూడుముక్కలాట మొదలయింది. తాజాగా మున్సిపల్ పాలకవర్గంలో మారుతున్న సమీకరణాలు అందుకు నిదర్శనం. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం కరణం వర్గంలోని కొందరు కౌన్సిలర్లు ఇటీవల ఎమ్మెల్యే కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరారు. ఇక ఆమంచి వర్గంగా ఉన్న కౌన్సిలర్లలో కొందరు కౌన్సిలర్లు కూడా ఎమ్మెల్యే కొండయ్యకు మద్దతు తెలిపి టీడీపీలో చేరారు. సమీకరణాలు ఎటు మారినా అభివృద్ధికి ఆటంకం కలగకుండా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ క్రమంలో మున్సిపల్ ఎక్స్‌అఫిషియో మెంబరుగా ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. పట్టు నిలుపుకునేందుకు వైసీపీ ప్రయత్నిస్తుండగా, పాగా వేసేందుకు టీడీపీ అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో పురపాలకుల అంశంపై జోరుగా చర్చ సాగుతోంది.

మున్సిపల్ ఎన్నికల సమయంలో టీడీపీ, వైసీపీ, ఇండిపెంట్లు (వైసీపీ రెబల్స్, ఆమంచి వర్గం) బరిలో ఉన్నాయి. మొత్తం 33 వార్డులు. అందులో ఒక్క వార్డు నుంచి టీడీపీ అభ్యర్థి గెలుపొందాడు. 11 మంది వైసీపీ రెబల్స్ (ఆమంచి వర్గం) గెలుపొందారు. మిగిలిన 20 వార్డులలో కరణం వర్గీయులు గెలుపొందారు. టీడీపీ నుంచి గెలుపొందిన కౌన్సిలర్ కూడా తరువాత వైసీపీకి మద్దతు తెలిపారు. ఈ క్రమంలో ఇండిపెండెంట్లుగా (ఆమంచి వర్గీయులు) పోటీచేసి గెలుపొందిన 11 మంది తరువాత వైసీపీ నేత బాలినేని శ్రీనివాసరెడ్డి సమక్షంలో వైసీపీ కండువాలు వేసుకున్నారు. మున్సిపల్ సమావేశాల్లో మాత్రం కరణం వర్గీయులు, ఆమంచి వర్గీయులు మధ్య ఉప్పు, నిప్పుగానే ఉండేది. చైర్మన్ జంజనం శ్రీనివాసరావు సభ నిర్వహణలో కొన్ని సందర్భాల్లో ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఈక్రమంలో వారిలో ముగ్గురు కౌన్సిలర్లు ఎమ్మెల్యే బలరాం, వెంకటేష్ వర్గంలో చేరారు. దీంతో ఆమంచి వర్గీయులు 8 మంది అయ్యారు. ఇదిలావుంటే అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తరువాత పరిణామాలు మారుతున్నాయి. కరణం వర్గీయుల్లో ఎనిమిది మంది కౌన్సిలర్లు, ఆమంచి వర్గీయుల్లో ముగ్గురు కౌన్సిలర్లు ఎమ్మెల్యే కొండయ్యకు మద్దతు తెలిపారు. అనంతరం టీడీపీలో చేరారు. ఈ నేపథ్యంలో కరణం వర్గీయులు 17 మంది, టీడీపీ వర్గీయులు 11 మంది, ఆమంచి వర్గీయులు 5గా మిగిలారు. ఎమ్మెల్యే కొండయ్య ఎక్స్ అఫిషియో మెంబరుగా బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది. అసెంబ్లీ సమావేశాల తరువాత మంచి రోజు చూసుకొని కార్యక్రమం నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో రాజకీయవర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చైతన్యవంతమైన రాజకీయాలకు కేంద్ర బిందువైన చీరాలలో తాజా పరిణామాలు ఏ మలుపులు తిరుగుతాయో వేచి చూడాల్సిందే.


హైదరాబాద్‌లో వైసీపీ ఇన్‌చార్జి వెంకటేష్‌తో మున్సిపల్ ఛైర్మన్ జంజనం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు

ఓబీసీకి చేరిన సాగర్ జలాలు


దర్శి బ్రాంచ్ కాలువలో ప్రవహిస్తున్న సాగర్ జలాలు

దర్శి, జూలై 22: మంచినీటి చెరువులకు నీరు నింపేందుకు విడుదల చేసిన సాగర్ జలాలు సోమవారం దర్శి సమీపంలోని ఒంగోలు బ్రాంచ్ కాలువ (ఓబీసీ)లోకి ప్రవేశించాయి. సాగర్ డ్యామ్ నుంచి మూడు రోజులక్రితం తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం సాగర్ కుడి కాలువ నుంచి 5500 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. అక్కడ నుంచి జిల్లా సరిహద్దుకు వచ్చేసరికి 88/3వ మైలుకు 2646 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతోంది. ఆ నీరు దిగువకు వచ్చేసరికి దర్శి బ్రాంచ్ కాలువకు 1800 క్యూసెక్కులు, ఒంగోలు బ్రాంచ్ కాలువలకు 883 క్యూసెక్కుల నీరు పంపిణీ అవుతోంది. తాగునీటి చెరువుకు నీరు నింపేందుకు విడుదల చేసిన నీరు దుర్వినియోగం కాకుండా అధికారులు అన్ని మేజర్లు మూసేశారు. ఎన్ఎస్పీ డీఈ అక్బర్ బాషా ఆధ్వర్యంలో అధికారులు కాలు వలపై పర్యవేక్షణ చేస్తున్నారు. రామతీర్థం జలాశయంతో పాటు జిల్లాలోని మంచినీటి చెరువులకు పూర్తిగా నీరు నింపుతారు. ఈసందర్భంగా డీఈ మాట్లాడుతూ రైతులు సాగర్ జలాల ట్యాంపరింగ్‌కు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించా రు. ప్రస్తుతం విడుదలయిన నీరు తాగునీటి అవసరాలకు మాత్రమేనన్న విషయాన్ని గమనించాలని కోరారు.

ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ అదృశ్యంపై కేసు నమోదు

మార్కాపురం, జూలై 22: ఉపాధిహామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ప్రస్తుతం సస్పెషన్‌కు గురైన కుందురు అనిల్‌కుమార్‌రెడ్డి రెండు రోజులుగా కనిపించడం లేదు. దీంతో ఆయన భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ కథనం మేరకు.. ఉపాధిహామీ పథకంలో మార్కాపురం టెక్నికల్ అసిస్టెంట్‌గా అనిల్‌కుమార్ రెడ్డి పనిచేస్తున్నారు. గత మార్చిలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి వైసీపీ అభ్యర్థి ప్రచారంలో పాల్గొన్నాడు. స్థానికులు సి-విజిల్ యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన్ను పీడీ అర్జునరావు అప్పట్లో సస్పెండ్ చేశారు. ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కొంతమేర పెట్టుబడులు పెట్టినట్లు సమాచారం. కుటుంబ సభ్యులతో గొడవలు పడ్డాడు. ఈ క్రమంలో శనివారం ఇంట్లో ఉన్న రూ.2 లక్షల నగదు తీసుకుని బయటకు వెళ్లిన అనిల్‌కుమార్‌రెడ్డి సాయంత్రమైనా ఇంటికి రాలేదు. సెల్‌ఫోన్ కూడా పనిచేయలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించారు. అయినా ఆయన ఆచూకీ లభించలేదు. ఆదివారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పట్టణ పోలీసులు అనిల్‌కుమార్‌రెడ్డి కోసం గాలిస్తున్నారు. చివరిగా కంభం బస్టాండ్ ప్రాంతంలో శనివారం మధ్యాహ్నం 1.00 గంట నుంచి సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ అయినట్లు గుర్తించి ఆ దిశగా గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

ప్రజా ఫిర్యాదులను పరిష్కరించండి

ఒంగోలు(క్రైం),జూలై22: ప్రజా ఫిర్యాదులు పరిష్కరించి సత్వర న్యాయం అందించాలని ఎస్పీ ఏఆర్.దామోదర్ పేర్కొన్నారు. సోమవారం పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యాక్రమంలో ఆయన పాల్గొని ఫిర్యాదులు అందుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి 92 మంది తన వినతులను ఎస్పీకి అందజేశారు. ఫిర్యాదిదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కె.నాగేశ్వరరావు, ఎస్‌వి.శ్రీధరరావు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

కనిగిరి, జూలై 22: ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం కనిగిరి పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్ఐ త్యాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బాదుల్లావారి వీధిలో నివాసం ఉంటున్న మూలె బ్రహ్మ నందరెడ్డి (34) అనే వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య పుట్టింటికి వెళ్ళిందని మనస్తాపంతో ఉరి వేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందని ఎస్ఐ తెలిపారు. మృతుడి తల్లి సుశీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్ఐ తెలిపారు.

పల్లామల్లి సొసైటీ విచారణాధికారి శాస్త్రి సస్పెన్షన్

ఒంగోలు(విద్య), జూలై 22 : చీమకుర్తి మండలం పల్లామల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)లో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరుపుతున్న విచారణాధికారి బీవీఎస్ కృష్ణశాస్త్రిని సస్పెండ్ చేస్తూ సహకార శాఖ కమిషనర్ బాబు ఉత్తర్వులు జారీచేశారు. విచారణాధికారిగా కృష్ణశాస్త్రి వ్యవహారశైలిపై ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. సొసైటీపై విచారణను నిలుపుదల చేసేందుకు కృష్ణశాస్త్రి చేయని ప్రయత్నం లేదు. ఆయన తీరుపై జిల్లా సహకారాధికారి బి.శ్రీనివాసరెడ్డి ఆ శాఖ కమిషనర్‌కు సమర్పించిన నివేదిక ఆధారంగా ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. విచారణ ఆపేందుకు లాయర్లతో మాట్లాడటం, సొసైటీ సీఈఓ వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ బెదిరించడం ఉన్నతాధికారులైన డీసీఓ, డీసీఏఓలను దుర్భాషలాడటం, ఆడిటర్లను తిట్టడం వంటి ఆడియో రికార్డులను కమిషనర్‌కు సమర్పించారు. సొసైటీపై విచారణకు 2023 నవంబరులో ఆదేశించారు.

నిబంధనల ప్రకారం ఆరు నెలల్లో విచారణ చేసి నివేదిక సమర్పించాల్సి ఉండగా ఏడు నెలలకు కూడా పూర్తి చేయలేదు. దీంతో విచారణాధికారి కృష్ణశాస్త్రిని సస్పెండ్ చేయాలని డీసీఏఓ శ్రీనివాసరెడ్డి సిఫార్సు చేశారు. విచారణాధికారి అకృత్యాలపై విచారణ నిర్వహించిన డీసీఓ కలెక్టర్‌కు నివేదికను సమర్పించారు. దీనిపై మరింత సమగ్ర విచారణ చేయాలని జేసీని కలెక్టర్ ఆదేశించారు. జేసీ కూడా విచారణ నిర్వహించారు. ఇదిలాఉండగా సహకార ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు మద్దతుతో కృష్ణశాస్త్రి ప్రభుత్వ పెద్దల నుంచి కూడా జిల్లా అధికారులపై తీవ్ర వత్తిడి తెచ్చినట్లు సమాచారం. గత రెండు నెలలుగా సహకార శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా విచారణాధికారి వ్యవహారానికి సస్పెండ్‌తో ముగింపు పలికారు. కాగా ఆయన స్థానంలో కొత్త విచారణాధికారిని నియమించి పల్లామల్లి సొసైటీ అక్రమాలపై విచారణ చేయాల్సి ఉంది.

ప్రజల అర్జీలకు సత్వరమే పరిష్కారం

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 22 : ప్రజాఫిర్యాదుల వ్యవస్థ (మీకోసం)లో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశపు హాలులో సోమవారం మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలు పలురకాల సమస్యలను విన్నవించారు. ఆయా సమస్యలపై కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ అర్జీలన నిర్దేశించిన సమయంలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

ప్రతి అర్జీని సంబంధిత అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా అన్సారియా ఒక బాలుడికి శ్రవణ యంత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్‌కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఎస్‌డీసీలు వరకుమార్, ఝాన్సీలక్ష్మి తదితరులు ఉన్నారు.

నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలులో రొయ్యల చెరువుల సాగు వల్ల వచ్చే వ్యర్థరసాయన జలంతో తాగునీరు కలుషితమవుతుందని అమ్మనబ్రోలు, దేవరంపాడు, ఉలిచి, బొద్దులూరివారిపాలెంకు చెందిన ప్రజలు ఫిర్యాదు చేశారు తాగునీరు కలుషితం కావడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. తమ గ్రామాలకు న్యాయం చేసి ఆదుకోవాలని కలెక్టర్‌కు విన్నవించారు.

వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో తప్పుడుసర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సృజన్ మాదిగ కోరారు.

సమస్యల వలయంలో ఉప్పుటూరు

- అస్తవ్యస్తంగా డ్రైనేజీ
- అధ్వానంగా రోడ్లు
- కలుషిత నీరే దిక్కు



గ్రామంలోని అంతర్గత రహదారులు ఇలా .. రంగుమారి, కంపుకొడుతున్న నీరు


వ్యర్థాలతో నిండి కదలని మురుగు

ఉప్పుటూరు(పర్చూరు), జూలై 22 : పేరుకే ఉప్పుటూరు పెద్ద పంచాయతీ. అక్కడ సమస్యలు అన్నీఇన్నీ కావు. రోడ్లు అధ్వానంగా ఉండడంతోపాటు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో గ్రామస్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కలుషిత నీటితోనే ప్రజలు కాలం వెల్లబుచ్చుతున్నారు. డ్రైనేజీ కాలువలు చిల్లచెట్లు తుంగ, వ్యర్థాలతో నిండిపోయాయి. దీంతో ఎక్కడ మురుగు అక్కడే కదలని పరిస్థితి ఉంది. వాన పడితే రోడ్లపై మురుగు నీరు వచ్చి నిల్వ ఉండిపోతుంది. రక్షిత మంచి నీరు అనేదే లేదు. మంచి నీటి చెరువులు రంగుమారి కంపుకొడుతున్నాయి. అదే నీటినే ప్రజలు వాడుకుంటున్నారు. పర్చూరు మండల పరిధిలోని ఉప్పుటూరు గ్రామం మేజర్ పంచాయతీని తలపించేలా జనాభా ఉన్నా వసతులు కరవు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో కనీసం రోడ్లు, మురుగు కాలువలను పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో స్థానికులు నరకం చూస్తున్నారు. కనీసం బ్లీచింగ్ కూడా చల్లిన దాఖలాలు లేవు. పారిశుధ్య చర్యలు చేపట్టి పాపానపోలేదు.

ఎక్కడ మురుగు అక్కడే

గ్రామంలో ఎక్కడ చూసినా డ్రైనేజ్ కాలువలు అధ్వానంగా ఉన్నాయి. దీంతో రోడ్లపైనే మురుగు నిలిచి ఉండడంతో కంపుతోపాటు, దోమల బెడద పెరిగిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డయేరియా, మలేరియా, విషజ్వరాలబారిన పడవద్దంటూ ప్రచా రం చేస్తున్న అధికారులు ఈ గ్రామంలో పారిశుధ్య చర్య లు చేపట్టకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రహదారులు దారుణం

గ్రామంలోని పలు అంతర్గత రహదారులతోపాటు ప్రధాన రోడ్లు ధ్వంసమయ్యాయి. దీంతో కొద్దిపాటి వర్షం కురిసినా రాకపోకలకు అంతరాయం కలుగుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. పర్చూరు నుంచి ఉప్పుటూరు మీదుగా బాపట్ల వెళ్లే ప్రధాన మార్గం సైతం అధ్వానంగా మారింది. సమస్యలను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

చెరువులకు సాగర్ జలాల కళ

నీరు నింపుతున్న అధికారులు

మార్టూరు, జూలై 22 : సాగర్ జలాలు సోమవారం ఉదయం మండలంలోని గ్రామాలలోని మంచినీటి చెరువులకు చేరుతున్నాయి. ఆదివారం రాత్రి 10 గంటలు దాటిన తర్వాత బొల్లాపల్లి జీఎన్‌టీ రోడ్డు వద్దకు సాగర్ జలాలు చేరాయి. సాగర్ జలాలు వస్తున్నాయని గ్రామాలలోని మంచినీటి చెరువులను నింపుకోవడానికి ముందస్తుగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవి గ్రామాలలోని పంచాయతీ అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశారు. దాంతో సోమవారం ఉదయం నుంచి చెరువులకు నీళ్లు చేరుతున్నాయి. మేజరు పంచాయతీ మార్టూరు మంచి నీటి చెరువుకు రాజుపాలెం మేజరు నుంచి జలాలు చేరుతున్నాయి. మంచి నీటి చెరువును వేగవంతంగా నింపేందుకు పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు సిబ్బందితో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వలపర్ల, కోలలపూడి, బొల్లాపల్లి, కోనంకి తదితర గ్రామాలలోని చెరువులకు నీళ్లు చేరుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటం, పంటలు లేక పొలాలు ఖాళీగా ఉండడంతో రైతులకు సాగర్ జలాల అవసరం లేకుండా పోయింది. దీంతో చెరువులను వేగంగా నింపుతున్నారు. ఇదిలావుండగా సాయంత్రానికి అందిన సమాచాం మేరకు బొల్లాపల్లి జీఎన్‌టీ వద్ద 480 క్యూసెక్కులు, పమిడిపాడు మేజరుకు 220, కోటపాడుకు 160, నూతలపాడు మైనరుకు 170, ద్రోణాదుల మేజరుకు 70, రాజుపాలెం మేజరుకు 40 క్యూసెక్కులు నీళ్లు ప్రవహిస్తున్నాయి. కోటపాడు మేజరు వద్ద కోనంకి ఎన్ఎస్‌పీ డీఈ స్వామి, జేఈ బాలకృష్ణ నాయక్ సిబ్బందితో కలిసి నీటి ప్రవాహాన్ని పరిశీలించారు.



మార్టూరు చెరువుకు చేరిన జలాలను పరిశీలిస్తున్న అధికారులు

యద్దనపూడి మండలంలో 15 చెరువులను సాగర్ జలాలతో నింపడానికి అధికారులు చర్యలు చేపట్టారు. పూనూరు, తనుబొద్దువారిపాలెం చెరువులకు సాగర్ జలాలు చేరాయి. అదేవిధంగా బొబ్బేపల్లి దండుదారి దగ్గర ఎన్ఎపి పైపు లైను నుంచి యద్దనపూడి చెరువుకు నీటిని పంపించేందుకు ఆర్‌డబ్లుఎస్ ఏఈ బ్రహ్మయ్య, పంచాయతీ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. మంగళవారానికి యద్దనపూడి చెరువుకు నీళ్లు చేరే అవకాశం ఉంది. మిగిలిన గ్రామాలలోని చెరువులను కూడా నింపడానికి ఏర్పాట్లు చేసినట్లు ఏఈ తెలిపారు.

అద్దంకి బ్రాంచి కాలువకు..

బల్లికురవ : తాగు నీటి అవసరాలకు విడుదలైన సాగర్ నీరు సోమవారం అద్దంకి బ్రాంచి కాలువలకు చేరాయి. అద్దంకి, పర్చూరు నియోజకవర్గంలోని పలు గ్రామాలలో ఉన్న చెరువులకు నీటిని నింపేందుకు ఈ నీటిని ప్రభుత్వం విడుదల చేసింది. 18వ మైలు వద్ద 900 క్యూసెక్కుల నీటి విడుదలవుతోంది. బల్లికురవ మండలం 33వ మైలు వద్ద సాగర్ నీటి ప్రవాహాన్ని అధికారులు పరిశీలించారు. చుక్క నీరు కూడా వృథా కాకుండా తాగునీటి చెరువులకు మాత్రమే నింపాలని వారు సూచనలు చేశారు. రెండు నియోజకవర్గాలలో సుమారు వంద వరకు మంచి నీటి చెరువులు ఉన్నాయని ముందుగా కింది చెరువులను నింపేలా ప్రణాళికలు చేస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాలలో తాగు నీటి చెరువులు అడుగంటి నీటి ఎద్దడి నెలకుంది. ఇప్పుడు సాగర్ నీరు మంచి నీటి అవసరాలకు విడుదల చేయడంపట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పొలాలకు నీటిని మళ్లించకుండా అధికారులు కట్టడి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు వచ్చిన సాగర్ నీరు

చెరువులు నింపడం అవసరం

మేదరమెట్ల : గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో నీరు లేనందున సాగర్ నీటితో గ్రామాల్లో చెరువులు నింపుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని కుర్రావానిపాలెం సర్పంచ్ నాదెండ్ల దశరథరామయ్య అన్నారు. కుర్రావానిపాలెం వద్ద రావినూతల చెరువుకు వెళ్లే 1 ఆర్ కాలువను స్వల్ప మరమ్మతులు రావినూతల సర్పంచ్ చాట్ల విజయవీణ, తెలుగుదేశం నాయకులు కారులసా నాగేశ్వరరావు(బాబు), పంచాయతీ మెంబర్లు కారులసా సుబ్బయ్య దగ్గరుండి పరిశీలించారు. సాగర జలాలు వస్తే పూర్తిగా ఎండిపోయిన రావినూతల చెరువును నింపుతామన్నారు. గతంలో ఉన్న కాలువల్లో పైపులు స్వల్ప మరమత్తులు చేశామని, నీరు వస్తే నీరు విడుదల చేయడమే మిగిలి ఉందన్నారు.



రావినూతల చెరువుకు నీటిని పంపే కాలువను పరిశీలిస్తున్న కుర్రావానిపాలెం సర్పంచ్ దశరథరామయ్య, లక్ష్మీనారాయణ తదితరులు

రేపు దేవాలయ భూముల వేలం

మార్టూరు, జూలై 22 : మండలంలోని ద్రోణాదుల, కోలలపూడి గ్రామాలలోని దేవాలయ భూములకు బుధవారం ఉదయం 10 గంటలకు ఆయా దేవస్థానాలలో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు కార్య నిర్వహణాధికారి చావా వెంకటేశ్వరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. వాటిలో ద్రోణాదుల గ్రామంలోని శ్రీచెన్నకేశవ స్వామి దేవస్థానానికి చెందిన 8.21 సెంట్ల మెట్టపొలాలు, శ్రీనీలకంఠస్వామి దేవస్థానానికి చెందిన 12.70 సెంట్ల మెట్టపొలాలకు వేలంపాట నిర్వహిస్తారు. కోలలపూడిలోని శ్రీకోదండరామస్వామి ఆలయానికి చెందిన 10.18 సెంట్లు, శ్రీసోమేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 7.36 సెంట్లు, శ్రీ వీరభద్రస్వామి దేవస్థానానికి చెందిన 12.24 సెంట్ల మెట్ట పొలాలకు వేలంపాట నిర్వహిస్తారని ఆ ప్రకటనలో తెలిపారు.

నేడు ఉపాధి పనుల తనిఖీ

పర్చూరు, జూలై 22: గ్రామీణ ఉపాధి హామీ పథకం, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖలో 01-04-2023 నుంచి 31-03-2024 వరకు చేసిన పనులపై మంగళవారం సామాజిక తనిఖీ జరుగుతుందని ఎంపీడీవో బి.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శ్రీనివాసరావు

పర్చూరు, జూలై 22 : పర్చూరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా రెవెన్యూ కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న యూ శ్రీనివాసరావుకు సోమవారం బాధ్యతలు అప్పగించారు. నెల్లూరు జిల్లాలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ ఎన్నికల వేళ పర్చూరు తహసీల్దార్‌గా పనిచేసిన సీహెచ్ సుబ్బయ్య రిలీవ్ అయ్యారు.

ఆర్థిక సాయం అందజేత

మార్టూరు,జూలై 22 : మార్టూరు గ్రామపంచాయతీ గొట్టిపాటినగర్‌లో ఉంటున్న షేక్ వలికి సోమవారం హెల్పింగ్ హాండ్స్ గ్రూపు వారు రూ.5వేల నగదు, బియ్యం బ్యాగ్‌ను అందజేశారు. కొన్నాళ్లుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న దాతలు ఆర్థిక సాయం అందజేశారు.



అధికారులకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్, ఏలూరి ఫొటోలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

ప్రభుత్వ కార్యాలయాలకు సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు

అధికారులకు పంపిణీ చేసిన టీడీపీ నాయకులు

యద్దనపూడి (మార్టూరు), జూలై 22 : యద్దనపూడి మండలంలోని ప్రభుత్వకార్యాలయాలకు టీడీపీ మండల నాయకులు సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఫొటోలను పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు నల్లపనేని రంగయ్యచౌదరి ఆధ్వర్యంలో ఎంపీడీవో ఆఫీస్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఫొటోలను అందజేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల అధికారులు ఫొటోలను తీసుకెళ్లారు. అనంతరం బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ వై.నాగరాజు ను టీడీపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు తారకరామారావు, గొట్టిపాటి సతీష్,జడ్‌పీటీసీ సభ్యులు చుండి లక్ష్మీనారాయణమ్మ, ఎం ఈవో చిలుకూరి గోపి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ వర్గీయుల దాడి

అద్దంకి, జూలై 22 : చెరువులో కట్టివేయడాన్ని ప్రశ్నించినందుకు టీడీపీ కార్యకర్తపై వైసీపీ వర్గీయులు దాడి చేశారు. ఈ ఘటనలో అతనికి గాయాలయ్యాయి. దీనిపై సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని మైలవరంలో చెరువు అంతర్భాగంలో ఉన్న భూమిని వైసీపీ వర్గీయులు కొనుగోలు చేశారు. చెరువు మధ్యలో కట్టవేయడంతో ఆదివారం సాయంత్రం టీడీపీ వర్గీయుడిగా ఉన్న భైరపునేని ప్రసాద్ ప్రశ్నించారు. దీంతో వైసీపీ వర్గీయులు దేవినేని కృష్ణ, మాగులూరి అనిల్, చావల రాజమోహన్ దాడి చేశారు. గాయాలైన ప్రసాద్ అద్దంకి ప్రభు త్వ వైద్యశాలలో చేరారు. ప్రసాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సమాజ సేవే లక్ష్యంగా సాగాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న రోటరీ సభ్యులు

ఇంకొల్లు, జూలై 22 : సమాజ సేవ చేయడమే లక్ష్యంగా రోటరీ సభ్యులు ముందుకు సాగాలని 3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎస్‌వీ రాంప్రసాద్ అన్నారు. రోటరీ గంగ భవనంలో నూతన కార్యవర్గంతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా షేక్ మహ్మద్‌రఫీ, కార్యదర్శిగా చుండి సాంబశివరావు, కోశాధికారిగా అలవల రాఘవరెడ్డి, కార్యవర్గ సభ్యులు ప్రమాణ చేశారు. సీనియర్ రొటేరియన్, జెట్టి వెంకటేశ్వర్లు (స్వామి) ఇద్దరు పేద విద్యార్థులకు రూ.5వేల ఆర్థిక సాయం, మరో పేద విద్యార్థికి సైకిల్‌ను అందజేసారు. కార్యక్రమంలో మద్దినేని హనుమంతరావు, వీరగంధం ఆంజనేయులు, కరి కమలేశ్వరరావు, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ రాజగోపాల్‌రావు, శ్రీమన్నారాయణ, సోమేపల్లి రామ్మోహనరావు, నిమ్మగడ్డ హనుమంతరావు, రొటేరియన్లు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధే లక్ష్యం

పర్చూరు, జూలై 22 : జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా పరివర్తనాత్మక సంస్కరణలతో విద్యాభివృద్ధిని సాధించటమే లక్ష్యమని జిల్లా ఏఎల్ఎస్ సమన్వయకర్త పి.సత్యసాగర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బోధన సామగ్రీ ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. బోధన పద్ధతులు, సామగ్రి వినియోగంపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో పి.వెంకట్రామయ్య, ప్రిన్సిపాల్ విశ్వరాణి, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

బధిరులకు అన్నదానం

అద్దంకిటౌన్, జూలై 22 : అద్దంకిలోని చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు దాతలు అన్నదానం చేశారు. సోమవారం జె.పంగులూరు మండలం కశ్యాపురం గ్రామ మాజీ సర్పంచ్ తెలగతోటి రాములు 3వ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు అద్దంకిలోని శ్రీ చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలోని చిన్నారులకు భోజన వసతిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సేవలను గ్రామస్థులు, కుటుంబ సభ్యులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రాములు కోడలు, జడ్పీటీసీ సభ్యులు జ్యోతి వెంకటరత్నమ్మ, కుమారులు చిన్న వెంకటరావు, రాజేష్‌కన్నా, మాజీ ఎంపీపీ జ్యోతి హనుమంతరావు, ఏసీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, జ్యోతి పట్టాభి రామారావు, ఆశ్రమ నిన్వాహకులు పూనూరి ఆరోగ్యం, ప్రిన్సిపాల్ సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బకాయిలను చెల్లించాలి



ధర్నా నిర్వహిస్తున్న ఉపాధి కూలీలు

అద్దంకిటౌన్, జూలై 22: గ్రామాలల్లో గత 6 వారాల నుంచి పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ పథకం కూలీల బకాలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత మూడు నెలలుగా చేసిన పనికి ఆరు వారాల బిల్లులు బకాయి ఉన్నాయని బకాయిలు వెంటనే ఇ వ్వాలన్నారు. కూలీలకు స్లిప్‌లు ఇవ్వాలని, వెంటనే ఉపాధి పనులను చేపట్టాలని, పట్టణ పేదలకు ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీవోకు, తహసీల్దార్‌కు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎం.సుబ్బారావు, మహిళా నాయకులు కే.ప్రమీళ, ఏసుమణి, తంగిరాల రాణిమ్మ పాల్గొన్నారు.

వెంకటేష్‌ను పరామర్శించిన చైర్మన్, కౌన్సిలర్లు

చీరాల, జూలై 22 : కాలుకు శస్త్ర చికిత్స చేయించుకుని హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌ను సోమవారం మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్, పలువురు కౌన్సిలర్లు పరామర్శించారు. చైర్మన్ జంజనం శ్రీనివాసరావు గత కొంతకాలంగా అమెరికాలో ఉన్నారు. ఆయన ఇండియా వచ్చిన తరువాత కౌన్సిలర్లు, ఆకోప్షన్ సభ్యులతో కలిసి వెంకటేష్‌ను కలసి పరామర్శించారు. భవిష్యత్ కార్యాచరణపై కూడా కొంతసేపు చర్చించినట్లు సమాచారం.

గేదె కొనుగోలుపై విచారణ

మార్టూరు, జూలై 22 : తనను మోసం చేసి గేదెను అధిక ధరకు అమ్మారని మార్టూరు లంబాడీ తండాకు చెందిన సూర్యానాయక్ స్పందనలో చేసిన ఫిర్యాదుపై సోమవారం మార్టూరు పోలీసులు విచారణ చేపట్టారు. ఆ వివరాలను ఏఎస్ఐ మహమ్మద్ బాషా తెలిపారు. మార్టూరు గ్రామానికి చెందిన సూర్యానాయక్ రెండు నెలల కిందట చుండూరు మండలం ఎడ్లపల్లి గ్రామానికి చెందిన మన్నె రాజారావు దగ్గర సూడి గేదెను మధ్యవర్తి ద్వారా లక్షా 9 వేలకు కొనుగోలు చేశారు. ఉదయం 5 నుంచి 7, సాయంత్రం 5 నుంచి 7 లీటర్ల వరకు పాలు ఇస్తుందని చెప్పడంతో సూర్యానాయక్ గేదెను కొన్నారు. దూడ పుట్టాక కేవలం 4లీటర్ల పాలే ఇవ్వడంతో మోసపోయానని గ్రహించిన సూర్యానాయక్ ఫిర్యాదుతో విచారణ జరిపారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న వైద్యాధికారి విజయభాస్కర్

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

చినగంజాం, జూలై 22 : ఇంటి పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.విజయభాస్కరరావు అన్నారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని కోడూరివారిపాలెం, కాటంవారిపాలెం గ్రామాల్లో డయేరియా వ్యాధిపై సోమవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల లోపు పిల్లలందరికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లు రెండు, 14 జింకు టాబ్లెట్లను అందజేసినట్లు వైద్యాధికారి తెలిపారు. అతిసారపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఓఆర్ఎస్ ద్రావణం తయారీని వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎం.చిరంజీవి, హెల్త్ అసిస్టెంట్ నర్రా మురళి, మహేష్, ఏఎన్ఎంలు రమాదేవి, ఎన్.కోటేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మోకాళ్లపై కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మార్టూరు, జూలై 22 : కంపెనీ పరిధిలోకి ఉద్యోగులను తీసుకోవాలని, వేతనాలను పెంచాలని, యూనిఫాం, బూట్లు, షూస్‌ను ఇవ్వాలని, క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం మండల పరిధిలో గల బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద కాంట్రాక్టు ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యాలయం వద్ద మోకాళ్లపై కూర్చొని ఆందోళన చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్, జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతరావు, టోల్‌ప్లాజా యూనియన్ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరాజు, ఉపాధ్యక్షుడు ఇమ్మానియేలు పాల్గొన్నారు.

అంబడిపూడిలో వైద్యశిబిరం

- గ్రామాన్ని సందర్శించిన జిల్లా వైద్యాధికారులు
- పారిశుధ్య పనులకు ఆదేశం
- వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రజలకు సూచన
- డాక్టర్లు అందుబాటులో ఉండడం లేదని ఫిర్యాదు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఇంటింటికీ వెళ్లి విషజ్వరాలపై సూచనలు ఇస్తున్న జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు

బల్లికురవ. జూలై 22 : ప్రజలంతా వ్యక్తిగత పరిశుభ్రత పాటించి, సీజనల్ వ్యాధులబారి నుంచి తప్పించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డీఐవో వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో మంచంపట్టిన అంబడిపూడి గ్రామం అనే వార్తపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. అంబడిపూడి గ్రామాన్ని డీఐవో వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామస్థులు తమకు గున్యా, విషజ్వరాలున్నాయని, వైద్యాధికారులు తూతుమంత్రంగా వైద్య శిబిరం పెట్టి చేతుల దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీహెచ్‌సీకి వెళితే వైద్యులు సకాంలో అందుబాటులో ఉండడంలేదని తెలిపారు. ప్రతి రోజు వైద్య శిబిరాన్ని చేసి రక్త నమునాలను సేకరించకుండా అంతా మాములే అన్న విధంగా ఉండడంతో రోజురోజుకు జ్వరాలు పెరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వైద్యాధికారులు జ్వరాలు సోకిన వారి గృహాలను పరిశీలించి లార్వా దోమ ఉందని తక్షణమే మురుగు నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ మైలా కుసుమకుమారి, పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్ దోమల నివారణకు ఎబెట్ మందును, ఫాగింగ్‌ను చేయించారు. గ్రామంలో మరోసారి పారిశుధ్య చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం నేతలు

ముస్లింల సమస్యలు పరిష్కరించాలి

అద్దంకి, జూలై 22 : ముస్లింల సమస్యలను పరిష్కరించాలని పలువురు ముస్లిం నేతలు సోమవారం అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎండీ ఫరూక్‌కు వినతిపత్రం అందజేశారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ ముంపు గ్రామంగా ఉన్న మణికేశ్వరంలో ముస్లింల సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఐటీడీపీ అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లాతో పాటు పలువురు ముస్లిం నేతలు ఉన్నారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

మార్టూరు, జూలై 22 : అట్రాసిటీ కేసుపై విచారణ చేసేందుకు సోమవారం రాత్రి డీఎస్పీ మురళీకృష్ణ మార్టూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. మార్టూరు గ్రామంలో ఆర్‌జేఎస్టీ కాలనీకి చెందిన ఒక యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకునిపై అట్రాసిటీ కేసు నమోదయింది. ఈ కేసుకు సంబంధించి డీఎస్పీ సంబంధిత వ్యక్తులను పిలిపించి విచారణ చేశారు.

బ్యాంక్ సిబ్బంది సేవలు అభినందనీయం

ఇంకొల్లు, జూలై 22 : బ్యాంక్‌కు వచ్చిన మహిళ స్పృహతప్పి పడిపోవడంతో బ్యాంకు సిబ్బంది మనవతాదృక్పథంతో ఆమెకు ప్రథమ చికిత్స చేయించి ఇంటికి చేర్చారు. పంగులూరు మండలం చందలూరుకు చెందిన సింగమ్మ సోమవారం పీడీసీసీ బ్యాంకుకు వచ్చారు. ఒక్కసారిగా ఆమె కుప్పకూలారు. గమనించిన బ్యాంక్ మేనేజర్, సిబ్బది స్పందించి ఆర్‌ఎంపీతో వైద్యం చేయించి ఇంటికి చేర్చారు. సిబ్బందిని ఖాతాదారులు అభినందించారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే సత్ఫలితాలు

చీరాల, జూలై 22 : విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జేఎన్‌టీయూ(కే) వైస్ చాన్సలర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(అటానమస్)లో బీటెక్ తొలి సంవత్సర విద్యార్థుల పరిచయ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనకు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ఇతర ప్రతినిదులు సాదరంగా స్వాగతం పలికారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలను సాధించేందుకు అనుసరించాల్సిన విధివిధానాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్‌బాబు, మొదటి సంవత్సర విభాగ ఇన్‌చార్జి ఎస్. అమర్‌నాథ్, డాక్టర్ సి.సుబ్బారావు(అక్రిడిటేషన్స్), ఆర్‌వీ రమణమూర్తి (అడ్మిస్ట్రేటివ్‌మేనేజర్), విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేఎన్‌టీయు(కె) వీసీ మురళీకృష్ణ

పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తాం

చీరాల, జూలై 22 : అర్జీలను పరిశీలించి ప్రాధాన్యతా క్రమంలో నిర్దీత కాలవ్యవధిలో పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. సోమవారం రోశయ్య కాలనీ వాసులు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. తమ ప్రాంతంలో పారిశుధ్య పనులు జరగడం లేదని, నీరు నిల్వ ఉంటోందని, తమకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని నినాదాలు చేశారు. అనంతరం సీఐటీయూ నేత ఎస్.బాబూరావు నేతృత్వంలో కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే వల్లెపు బాలంకమ్మరావు అనే వ్యక్తి లారీ ఓనర్స్ అసోసియేషన్ నిర్వహణలో జరిగిన లోపాలకు, తాను ఎదుర్కొన్న ఇబ్బందులపై కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆర్డీవో సూర్యానారాయణరెడ్డికి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘ నేత

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

పింఛన్ పెంపుపై దివ్యాంగుల హర్షం

పర్చూరు, జూలై 22 : ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబు ప్రభుత్వం దివ్యాంగులకు పింఛన్లను పెంచడం హర్షణీయమని దివ్యాంగులు అన్నారు. గతంలో ఉన్న రూ.3000 ఉన్న పింఛన్‌ను రెట్టింపు చేసి రూ.6000కు పెంచి అందజేయడంపై దివ్యాంగులు ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక బొమ్మల సెంటర్‌లో సోమవారం సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి అభిమానం చాటుకున్నారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన దివ్యాంగులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దివ్యాంగులు



విద్యార్థుల్లో విద్యాభివృద్ధిని పెంపొందించే లక్ష్యంగా జిల్లావ్యాప్తంగా సోమవారం 'శిక్షాసప్తాహ్' కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అనంతసాగరం మండలం చిలకలమర్రి ఉన్నత పాఠశాల విద్యార్థులు 'ఎన్ఈపీ' ఆకారంలో కూర్చొన్నారు.

- అనంతసాగరం



జాతీయ కామధేను పునరుత్పత్తి కేంద్రం



నిర్మలమ్మ కరుణించేనా!?

నేడు కేంద్ర బడ్జెట్

జిల్లాలోని కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు నిధుల కోసం ఎదురుచూస్తున్నాయి. పేరుకు అనేక ప్రాజెక్టులు నడుస్తున్నా నిధుల కొరతతో వాటిలో పురోగతి మాత్రం ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. ఎన్‌సీఈఆర్‌టీ, తెలుగు ప్రాచీన అధ్యయన కేంద్రం, పోర్టు అనుసంధానిత జాతీయ రహదారులు, విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్, రైల్వే ఫ్లైవోవర్లు.. ఇలా అనేక ప్రాజెక్టులకు నిధులు కేటాయించాల్సి ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. ఎన్డీఏ కూటమిలో రాష్ట్ర ఎంపీల భాగస్వామ్యం చాలా కీలకమైన సమయంలో కేంద్రం ప్రవేశపెడుతున్న తొలి బడ్జెట్ ఇదే కావడం విశేషం. సాధారణ బడ్జెట్‌తోపాటు రైల్వే బడ్జెట్‌నూ అందులోనే ప్రవేశపెట్టనున్నారు. గడిచిన కొన్నేళ్లుగా ప్రాజెక్టులకు నిధులు దక్కడం లేదు. ఈ నేపథ్యంలో ఆశలన్నీ కేంద్ర బడ్జెట్‌పైనే ఉన్నాయి.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

'కామధేను'ను విస్మరించారా!?

- తొమ్మిదేళ్లయినా అభివృద్ధి ఊసేది!?
- ఎంత చేసినా పరిష్కారం కాని నీటి సమస్య
- సిబ్బంది కొరత.. ఉన్నవారిపై పనిభారం

దేశీయ ఆవులు, గేదెల పునరుత్పత్తి కోసం ప్రవేశపెట్టిన బృహత్తర పథకమిది. పాడిరైతుల పాలిట 'కామధేను'వుగా మారాల్సిన ప్రాజెక్టు నిధులలేమితో కునారిల్లుతోంది. ఎప్పుడో తొమ్మిదేళ్ల క్రితం రూ.25 కోట్లు మంజూరవగా, ఆ తర్వాత పైసా కూడా ఇటు రాష్ట్రం, అటు కేంద్రం విదల్చలేదు. దీంతో పథకం ఫలాల మాట అటుంచితే, సమస్యలు తిష్ఠవేసి ఉన్నాయి.



కొండాపురం, జూలై 22 : చింతలదీవి పశుసంవర్ధక క్షేత్రంలో 2015లో అప్పటి ఎన్డీయే కూటమి జాతీయ కామధేను పునరుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇందుకోసం రూ.250 కోట్లు కేటాయించి తొలివిడతగా రూ.25 కోట్లు మంజూరు చేసింది. దీంతో అప్పటి పాలకులు, అధికారులు చకచకా కామధేను పునరుత్పత్తి కేంద్రం పనులు మొదలుపెట్టారు.

● దేశీయ జాతి పశువుల అభివృద్ధే లక్ష్యం

స్వదేశీ జాతులకు చెందిన ఆవులు, గేదెల అభివృద్ధే లక్ష్యంగా ఈ పథకాన్ని దేశంలోనే రెండవది గా, దక్షిణ బారతంలో మొదటిదిగా చింతలదీవి పశుసంవర్ధక క్షేత్రంలో ఏర్పాటు చేశారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో అధిక పాల దిగుబడి ఇచ్చే ఆవులు, గేదెలను ఇక్కడకు తీసుకువచ్చి వాటిని పునరుత్పత్తి చేసి అతితక్కువ ధరకు రైతులకు అందించాలనేది ఈ పథకం ప్రధాన ఉద్దేశం.

● కేంద్రంలో 544 పశువులు

తొలిగా మంజూరైన నిధులతో పశువుల షెడ్లు, సిబ్బందికి క్వార్టర్స్ తదితర భవనాలు నిర్మించారు. దేశం నలుమూలల నుంచి సుమారు 20 రకాల ఆవులు, గేదెలను కొనుగోలు చేశారు. కామధేను కేంద్రంలో 14 రకాల స్వదేశీ మేలుజాతి ఆవులు, 5 రకాల గేదెలు ఉన్నాయని ప్రాజెక్టు జేడీ వెంకటేశ్ చెబుతున్నారు. వీటి నుంచి వీర్యం సేకరించి స్థానికంగా మేలుజాతి ఆవులు, గేదెలకు కృత్రిమ గర్భధారణ చేయిస్తున్నామన్నారు. ఈవిధంగా పుట్టబోయే దూడలు పెద్దవి అయ్యాక అధిక పాలను ఇస్తాయన్నారు.

● తాజా ప్రతిపాదనలకు మోక్షం

పశువులకు అదనపు షెడ్ల నిర్మాణాలు, మెటీరియల్ నిల్వ ఉంచేందుకు గోదాములు, సైలేజ్ కోసం బంకర్లు ఏర్పాటుకు రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు ప్రభుత్వం రూ.3.26 కోట్ల నిధులు మంజూరు చేసింది. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టెండర్ ప్రక్రియ జరగాల్సి ఉందని జేడీ వెంకటేష్ తెలిపారు. మరోవైపు కేంద్రంలో పశువులకు అవసరమైన దాణా రెండు, మూడు నెలలకు ఒకసారి సరఫరా అవుతుండేది. ఇటీవల ప్రతి నెలా సరఫరా జరుగుతోంది. కేంద్రంలోని ఆవులు, గేదెల పాల అమ్మకం ద్వారా ప్రతినెల దాదాపు ఒక లక్ష రూపాయల వరకు నగదు వస్తోంది.

● సిబ్బంది కొరత

కామధేను కేంద్రంలో ఒక జేడీ, ముగ్గురు ఏడీలు ఉన్నారు. సీనియర్ అసిస్టెంటు లేరు. ఆరుగురు ఎల్ఎస్ఏలు ఉండాల్సి ఉండగా నలుగురే ఉన్నారు. ఆరుగురు వీఏఏలు ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా లేరు. ఇక రోజువారీ కూలీలు 47 మందికిగాను 37 మంది ఉన్నారు. వీరికి రోజుకు రూ 500 కూలి ఇస్తున్నారు. కామధేను ప్రాజెక్టు ఏర్పాటు ద్వారా స్థానికంగా లభిస్తాయని సంబరపడ్డ నిరుద్యోగులు ఇప్పుడు డీలా పడుతున్నారు. రోజువారీ కూలీలుగా పనిచేస్తున్నారే తప్ప పర్మినెంటు ఉద్యోగ అవకాశం లేకుండా పోయిందని వారు వాపోతున్నారు.

వేధిస్తున్న నీటిసమస్య

ఎంతో బృహత్తర ఆశయంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రానికి నీటిని తరలించేందుకు ఆర్ఐడీఎఫ్ పథకం కింద 2017లో రాళ్లపాడు రిజర్వాయరు నుంచి నీటిని తరలించేందుకు రూ.12.5 కోట్లను ప్రభుత్వం మంజూరుచేసింది. పనులు మొదలై దాదాపుగా సగం వరకు పూర్తయ్యాక అనివార్య కారణాలతో ఆగిపోయాయి. అనంతరం మండల పరిధిలోని మర్రిగుంట చెరువు నుంచి నీటిని తరలించేందుకు రూ3.20 కోట్లను మంజూరు చేశారు. పనులన్నీ దాదాపుగా పూర్తయినా కేంద్రానికి మాత్రం నీరు చేరలేదు. చెరువు నుంచి పైపులైన్ ద్వారా తీసుకొచ్చిన నీటిని కేంద్రంలో నిర్మించిన స్టోరేజీ ట్యాంకుల్లో నిల్వ ఉంచి పశువులకు వాడుకోవాల్సి ఉంది. అయితే, కామధేను కేంద్రంలో వేసిన బోర్ల నీరు రోజువారీ అవసరాలకే సరిపోతోంది. ఇక పశుగ్రాసం పెంచేందుకు కొత్తగా బోర్లు వేయాల్సిన అవసరం ఉంది.

● మెట్ట ప్రాంత వాసులను నడికూడి - శ్రీకాళహస్తి రైల్వే మార్గం ఊరిస్తూనే ఉంది. ఈ ప్రాజెక్టు ప్రారంభమై పుష్కరకాలం గడుస్తున్నా ఇంకా పూర్తి కాలేదు. ఆశించిన స్థాయిలో ఈ ప్రాజెక్టుకు నిధులు దక్కడం లేదు. జిల్లాలో భూసేకరణ కూడా పూర్తి కాలేదు. జిల్లాలోని మెట్ట ప్రాంతాలకు ప్యాసెంజర్ రైలు కలగా మారింది. కృష్ణపట్నం - ఓబులాపురం రైల్వే పూర్తయి గూడ్సు రైళ్లు తిరుగుతున్నాయి. ఆ మార్గంలో ప్యాసెంజర్ రైళ్లు కూడా నడిపితే రాయలసీమ - నెల్లూరు ప్రాంతాలకు రాకపోకలు సులభమవుతాయి. దీనిపై ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లోనైనా నిర్ణయం వెలువడాలని జిల్లా ప్రజలు కోరుకుంటున్నారు. గూడూరు-విజయవాడ మధ్య మూడో రైల్వే లైన్ అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ట్రాఫిక్ ఎక్కువైపోయింది. రైల్వే గేట్ల వద్ద ప్రజలు ఎక్కువ సేపు నిరీక్షించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో కీలకమైన ప్రాంతాల్లో రైల్వే ఫ్లైవోవర్‌లు నిర్మించాలని రెండేళ్ల క్రితం గతిశక్తి పథకంలో ప్రతిపాదించారు. కానీ అవి ముందుకు సాగలేదు. బడ్జెట్ లేమి కూడా ఇందుకు ఒక కారణంగా చెబుతున్నారు.



కృష్ణపట్నం - ఓబులాపురం రైల్వేలైన్




కృష్ణపట్నం పోర్టును అనుసంధానిస్తూ రవాణా సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు మూడేళ్ల క్రితం ప్రతిపాదనలు తయారు చేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో దాదాపు రూ.మూడు వేల కోట్లతో ఏడు జాతీయ రహదారులను ఎన్‌హెచ్ఏఐ అధికారులు ప్రతిపాదించారు. ఈ రహదారులు పూర్తయితే జిల్లా పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుంది. డీపీఆర్ సిద్ధమైనప్పటికీ నిధులు లేక ఈ ప్రాజెక్టులు ముందుకు సాగడం లేదు. ఇటు నెల్లూరు వరకు జాతీయ రహదారి -16ను ఆరు వరుసలుగా విస్తరించారు. కానీ నెల్లూరు - తడ మధ్య మాత్రం ఇంకా విస్తరణ జరగలేదు. దీంతో ఈ మార్గంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. దీనిపై కూడా గత కొంత కాలం నుంచి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందుతున్నాయి. అయితే ఈ ఏడాదైనా జాతీయ రహదారి విస్తరణకు కేంద్రం ఆమోదం తెలుపుతుందా.. అన్నది చూడాలి. విశాఖ-చెన్నై కారిడార్‌కు సంబంధించి నిధులు కేటాయింపులు జరిగితే పారిశ్రామిక అభివృద్ధికి మరిన్ని అడుగులు పడతాయి.

జాతీయ విద్యా పరిశోధన శిక్షణా మండలి (ఎన్‌సీఈఆర్‌టీ)కు వెంకటాచలం మండలం చౌటపాలెం వద్ద శంకుస్థాపన చేసి ఏడేళ్లు దాటింది. కానీ నేటికీ ఆ సంస్థకు పునాదులు కూడా పడలేదు. భూసేకరణ జరగకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. అయితే ఈ ఏడాది నుంచి నెల్లూరులో తాత్కాలిక భవనాల్లో ఎన్‌సీఈఆర్‌టీ కార్యకలా పాలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కేంద్రం నిధులు కేటాయిస్తే వెంకటాచలం వద్ద శాశ్వత భవనాల నిర్మాణం జరుగుతుంది. అలానే వెంకటాచలంలోని సరస్వతీనగర్‌లో ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం కూడా ఇంకా పూర్తిస్థాయిలో ఏర్పాటు కాలేదు. ఈ సంస్థకు కేటాయించిన భూమి చుట్టూ ప్రహరీ నిర్మాణానికి మాత్రమే కేంద్రం నిధులు ఇచ్చింది. శాశ్వత భవనాల ఏర్పాటుకై బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సి ఉంది.



ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం



నెల్లూరు(సాంస్కృతికం), జూలై 22 : నెల్లూరులో జరుగుతున్న రొట్టెల పండుగకు భక్తుల రాక కొనసాగుతోంది. ఆదివారమే పండుగ ముగిసినా మరో రెండు రోజులపాటు భక్తుల రాక ఉంటుందని అంచనా వేసిన అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు కొనసాగిస్తున్నారు. స్వర్ణాల చెరువులో పవిత్ర స్నానాలు చేసి వరాల రొట్టెలను అందుకుంటున్నారు. ఆ తర్వాత దర్గాలోని బారాషాహిదులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నగరపాలక శాఖ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు, మంచినీటి సరఫరా కొనసాగుతోంది. దర్గా కమిటీ చైర్మన్ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో భక్తులకు కమిటీ సభ్యులు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తూ దర్గాను పర్యవేక్షించారు.





'పట్ట'లతో సురక్షితమేనా!

నెల్లూరు ఆర్డీవో కార్యాలయ చిత్రాలివి. బ్రిటీష్ కాలం నాటి భవనాలు కావడంతో వానకు తడుస్తున్నాయి. దీంతో అధికారులు భవనంపైకప్పు మీద టార్పాలిన్ పట్టలు కప్పి ఇదిగో ఇలా రక్షణ కల్పించుకున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు

భారీ వర్షాలొస్తున్నాయ్..

జాగ్రత్త!

- ముందస్తు చర్యలకు సన్నద్ధం కండి
- అధికారుల సమీక్షలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), జూలై 22 : జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో ఆయన అధికారులతో సమీక్షించారు. ప్రధానంగా ఇరిగేషన్, పంచాయతీ, రెవెన్యూ, విద్యుత్ శాఖలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువుల స్థితిగతులను పరిశీలించి అవసరమైన చోట్ల కట్టలకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సేధుమాధవన్, డీఆర్‌ఓ లవన్న, ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణమోహన్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

● మహిళా గౌరవ పోస్టర్ ఆవిష్కరణ

పని చేసే ప్రదేశంలో మహిళలకు పూర్తి రక్షణ కల్పిస్తూ వారి గౌరవాన్ని కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించేందుకు తయారు చేసిన గోడపత్రికలను కలెక్టర్ ఆనంద్ ఆవిష్కరించారు. కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జేసీ, డీఆర్వోతోపాటు ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నిర్లక్ష్యం వహించే తహసీల్దార్లను రిలీవ్ చేయం

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), జూలై 22 : రెవెన్యూ సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే తహసీల్దార్లను రిలీవ్ చేసే ప్రసక్తే లేదని కలెక్టర్ ఆనంద్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ శంకరన్ సమావేశ మందిరం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, ఎమ్పీడీవోలతో ఆయన సమీక్షించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను వేగంగా పరిష్కరించి పురోగతి చూపించాలని ఆదేశించారు. ప్రధానంగా కుల ధ్రువీకరణ పత్రాలను క్షేత్రస్థాయిలో విచారించి త్వరగా మంజూరు చేయాలని, ఏ కారణం లేకుండా సర్టిఫికెట్లను తిరస్కరించవద్దని సూచించారు. రాపూరు, బోగోలు మండలాల్లో ఎక్కువగా రెవెన్యూ సర్టిఫికెట్లు పెండింగులో ఉన్నాయని, మ్యూటేషన్లను పెండింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డీఎల్‌పీఓలు, ఎమ్పీడీవోలు గ్రామాల్లో పర్యటించి పారిశుద్య కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు. కాలువల్లో పూడికతీత, పరిశుభ్రత కార్యక్రమాలను నిరంతరం మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పారిశుద్యం పనుల విషయంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● నేటి నుంచి ఆధార్ క్యాంపులు

మంగళవారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకు జిల్లాలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. చిన్నపిల్లలకు నూతన ఆధార్ కార్డుల జారీ, 5 నుంచి 15 ఏళ్ల వయసుగల వారికి ఆధార్ బయోమెట్రిక్, 18 సంవత్సరాల వయసు పైబడిన వారికి ఆధార్ అప్‌డేషన్ చేయించాలన్నారు. జిల్లాలో ఎలాంటి ఆధారాలు లేకుండా ఆధార్ కార్డులకు నోచుకోని 10వేల మంది ఎస్టీ లకు ఆధార్ కార్డులు ఇవ్వడానికి సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ సేధుమాధవన్, డీఆర్‌ఓ లవన్న, జడ్పీ సీఈఓ కన్నమ నాయుడు, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఈఏపీసెట్ తుది కౌన్సెలింగ్

నెల్లూరు (విద్య), జూలై 22 : ఏపీ ఈఏపీ సెట్-2024 తుదికౌన్సెలింగ్‌ను మంగళవారం నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కౌన్సెలింగ్ అడ్మిన్ దంపూరి శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఓపెన్‌స్కూల్లోని ఓసీకి 44.5 శాతం, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 39.5 శాతం కంటే ఎక్కువ ఉన్నవారికి అర్హత ఉంటుందన్నారు. ఫీజులు కట్టని వారు మాత్రమే ఈ కౌన్సెలింగ్‌లో ఫీజులు చెల్లించాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ రుసుములను 25వ తేదీ లోపల పూర్తి చేయాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే మాత్రమే హెల్ప్‌లైన్ సెంటర్‌లో హాజరు కావాలన్నారు. తొలి కౌన్సెలింగ్‌లో సీటు పొందిన వారు మరో సీటును, కళాశాలలను మార్చుకునేందుకు ఆప్షన్లు పెంచుకోవచ్చన్నారు. ఈ నెల 24 నుంచి 26వతేదీ వరకు ఆప్షన్ల ప్రక్రియకు అవకాశం ఉందన్నారు. 27న ఫ్రీజ్ చేసిన ఆప్షన్‌లలో మార్చుకునే అవకాశం ఉందన్నారు. తొలి కౌన్సెలింగ్‌లో కళాశాలలో సీటు పొంది, నచ్చని విద్యార్థులు ఈ తుది కౌన్సెలింగ్‌లో ఆప్షన్‌ను నమోదు చేసుకోవచ్చన్నారు. సర్టిఫికెట్లను పరిశీలించిన తరువాత సీటు రాని వారు ఈ ఆప్షన్స్‌ను నమోదు చేయవచ్చన్నారు.

జిల్లావాసికి రైల్వే అవార్డు

- కొమ్మరపూడి పాయింట్‌యన్ ఎంపిక
- రైల్వే జీఎం నుంచి అవార్డు అందుకున్న దినేష్



దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ నుంచి అవార్డు అందుకుంటున్న దినేష్

నెల్లూరు (వెంకటేశ్వర పురం), జూలై 22 : జిల్లాలోని కొమ్మరపూడి రైల్వేస్టేషన్‌లో అసిస్టెంట్ పాయింట్‌మన్‌గా పనిచేస్తున్న ఎన్ దినేష్‌కు ఎంప్లాయ్ ఆఫ్ ది మంత్ సేఫ్టీ అవార్డు దక్కింది. విధుల్లో అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాల నుంచి రక్షించిన రైల్వే ఉద్యోగులకు ఈ అవార్డు అందజేస్తారు. సోమవారం సికింద్రాబాద్‌లోని రైలు నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ ఈ అవార్డులను ప్రదానం చేశారు. దేశవ్యాప్తంగా అన్ని డివిజన్లలో జూన్ నెలకుగాను 9 మందికి అవార్డులను అందజేశారు. విజయవాడ డివిజన్ పరిధిలోని నెల్లూరు జిల్లా కొమ్మరపూడి రైల్వే స్టేషన్‌లో అసిస్టెంట్ పాయింట్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్ దినేష్‌కు ఈ అవార్డు అందజేశారు. జూన్ 26న బిట్రగుంట - అల్లూరు రోడ్డు మధ్య ఎల్‌సీ నెం.143టీలో గూడ్స్ రైలు లోకో నుంచి 24వ వ్యాగన్ చక్రం కదలకుండా కనిపించింది. వెంటనే ఈ విషయాన్ని బిట్రగుంటలో డ్యూటీ స్టేషన్ మాస్టర్‌కు దినేష్ తెలియజేశారు. దీంతో అప్రమత్తమైన రైల్వే సిబ్బంది రైలును ఆపి మరమ్మతులు చేశారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించి ప్రమాదాన్ని నివారించినందుకు దినేష్‌కు ఈ అవార్డు వరించింది.

భూకబ్జాలు కట్టడయ్యేనా?

- ప్రభుత్వ స్థలాల ఆక్రమణ
- నామమాత్రంగా అధికారుల చర్యలు


అనంతసాగరం చెరువు లోతట్టులో వెలసిన నిర్మాణాలు


మంచాలపల్లి వద్ద ఆక్రమించిన భూమిలో ఏర్పాటు చేసిన బోర్డు

అనంతసాగరం, జూలై 22: మండలంలో భూ కబ్జాదారుల పరంపర కొనసాగుతోంది. చెరువైనా.. కుంటైనా.. గట్టైనా.. కొండైనా అది సర్కారు భూమి అయితే చాలు దున్నేస్తున్నారు. సోమశిల జలాశయం ఉత్తర కాలువ అందుబాటులోకి రావడంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఎకరా రూ.4 లక్షల నుంచి రూ.10లక్షల వరకు ధర ఉంది. దీంతో ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు వదలడం లేదు. ఖాళీస్థలాలు ఆక్రమించడంతో పాటు అగ్రిమెంట్ల రూపంలో క్రయవిక్రయాలు జరుపుతున్న పరిస్థితి నెలకొంది. ఇటీవల మంచాలపల్లి వద్ద రెండెకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి పొలంగా మర్చినట్లు రెవెన్యూ అధికారులు ఫిర్యాదు అందడంతో దాన్ని అడ్డుకొని బాధిత వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఆ స్థలంలో ఎవరూ ప్రవేశించరాదంటూ హెచ్చరిక బోర్డు పెట్టారు. ఎన్నికల సమయంలో బొమ్మవరం పంచాయతీ అగ్రహారం వద్ద సుమారు 10ఎకరాల ప్రభుత్వ భూమిని ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తుండగా టీడీపీ నాయకులు అడ్డుకొన్నారు. ఇది వైసీపీ అనుచరుల పనేనంటూ ఆరోపణలు వచ్చాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో సందెట్లో సడేమియా అన్నచందంగా ఆ భూమిని కాజేసే ప్రయత్నం జరిగింది. ఇవి వెలుగులోకి వచ్చిన సంఘటనలు కాగా వెలుగులోకి రాని భూకబ్జాలు చాలానే ఉన్నాయి. అనంతసాగరం చెరువు లోతట్టు ప్రాంతంలో మంచాలపల్లి వద్ద ఇళ్ల నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. పట్టాలు లేకపోయిన అక్రమ నిర్మాణాల వెలుస్తున్న పరిస్థితి ఉండగా నియంత్రణ చర్యలు కనిపించడం లేదు. ఈ చెరువు కింద ముస్తాపురం మంగుపల్లి లోతట్టు ప్రాంతాలు పొలాలుగా రూపాంతరం చెందిన పరిస్థితి ఉంది. ఇక కామిరెడ్డిపాడు చెరువు కట్టపై ఉన్న రివెట్‌మెంట్‌ను తొలగించి స్తంభాలు పాతి ఇది తమ పొలమంటూ కొందరు పత్రాలు చూపిస్తున్నారు. పీకేపాడు, బొమ్మవరం చెరువులో పరిస్థితి ఇలాగే ఉంది. అనంతసాగరం, సోమశిల జగనన్న లేఅవుట్‌లలో ఖాళీగా ఉన్న స్థలాలలను కొందరు ఆక్రమించి తమ స్వాధీనంలో ఉంచుకొన్నారు. లే అవుట్లపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. భూ కబ్జాలపై యంత్రాగం దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహిమలూరులో ప్రత్యేక గ్రామసభ


గ్రామసభలో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ ఉషారాణి

ఆత్మకూరు, జూలై 21 : మహిమలూరు పంచాయతీలో సోమవారం ఓడీఎఫ్, జలజీవన్ అంశాలపై సర్పంచ్ చంద్రశేఖర్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ ఉషారాణి మాట్లాడారు. గ్రామంలోని ప్రతి ఇంటి వద్ద వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండాలని, ప్లాస్టిక్ నిషేధం, తడిచెత్త-పొడిచెత్త సేకరణ తదితర అంశాలపై వివరించారు. జలజీవన్ మిషన్ కార్యక్రమంలో ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం గ్రామంలోని మంచినీటి బావిలో క్లోరినేషన్ కిట్‌తో తాగునీటిని పరీక్షించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మాజీ చైర్మన్ వల్లూరు వెంకటరమణారెడ్డి, టీడీపీ నాయకులు మద్దినేని నారాయణ, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, హెల్త్‌సూపర్‌వైజర్ షేక్ సైదా పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించడంపై హర్షం

మర్రిపాడు, జులై 22: నందవరం ఆదర్శపాఠశాల విద్యార్థులకు దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి అదనపు బస్సు సౌకర్యం కల్పించడంపై చుంచులూరు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం హర్షం వ్యక్తం చేశారు. కొన్నేళ్లగా చుంచులూరు, నాయుడుపల్లి గ్రా మాల బడి పిల్లలకు బస్సు సౌకర్యంలేక, 8వ తరగతి వరకు హాస్టల్ వసతి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారని చెప్పారు. మర్రిపాడు వరకు 10కిలోమీటర్ల దూరం ఆటోలో వచ్చి, అక్కడ ఆదర్శపాఠశాలకు ఏర్పాటు చేసిన మరో బస్సులో ఇబ్బందులు పడుతూ వెళ్లాల్సి దుస్థితి ఉండేదన్నారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

పంటల పరిశీలన



ఏఎస్ పేట, జూలై 22: ఇటీవల కురిసి వర్షాలకు పోనుగోడు, పాజవేలు గ్రామాల్లో దెబ్బతిన్న వేరుశనగ పంటలను సోమవారం సోమవారం మండల వ్యవసాయ అధికారి రజిని పరిశీలించారు. రైతులతో మాట్లడి వివరాలు తెలుసుకున్నారు. పంట నష్టం జాబితా తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతానని చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో చిరంజీవి, సర్పంచ్ పద్మయ్య పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల తనిఖీ

సంగం, జూలై 22: యాకసిరి మఠం ఉర్దూ పాఠశాలను సోమవారం జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ మొహిద్దీన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. జాతీయ విద్యా విధానం ప్రవేశ పెట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వారం రోజులు శిక్షా సప్తాహ పేరుతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాల్లో విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రకు నామినేటెడ్ పదవి ఇవ్వాలి

వరికుంటపాడు, జూలై 22: ఈ మారు జరిగిన ఎన్నికల్లో మండలంలో తెలుగుదేశం 3వేల మెజార్టీ సాధించడంలో పార్టీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు కీలకపాత్ర ఉందని సోమవారం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోలిబోయిన శ్రీకాంత్‌యాదవ్ తెలిపారు. గతంలో ఏఎంసీ చైర్మన్‌గా కూడా ఎనలేని సేవలు చేశారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తికి కీలక బాధ్యతలు అప్పగిస్తే పార్టీని మరింత ముందుకు తీసుకెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

సభ్యత్వ నమోదు పూర్తి చేయండి

సీతారామపురం, జులై 22: ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని ప్రతి జనసేన కార్యకర్తలు వేగవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి భోగినేని కాశిరావు తెలిపారు. సోమవారం ఈ విషయంపై ఆయన మాట్లాడారు. జనసేన నాలుగో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 28 వరకు జరుగుతుందన్నారు. క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు రూ.5లక్షల జీవితబీమా రూ.5లక్షల ప్రమాదబీమా లభిస్తుందని ప్రజలకు తెలియజేయాలన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

వరికుంటపాడు, జూలై 22: స్థానిక సచివాలయంలో సర్పంచ్ దిలీప్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి పాల్గొని మాట్లాడారు. జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. అలాగే మరుగుదొడ్ల సౌకర్యం లేని నివాసాలను గుర్తించి అర్హులకు మంజూరు చేస్తామన్నారు. వేంపాడులో సర్పంచ్ తాతపూడి విజయమ్మ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సికిందర్, కార్యదర్శి శ్రీనివాసులు, వార్డుసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఉదయగిరి, జూలై 22: మండలంలోని శకునాపల్లి పంచాయతీలోని కుర్రపల్లి గ్రామ మంచినీటి పథకం పైప్‌లైన్లు దెబ్బతిన్నాయి. సోమవారం కార్యదర్శి కరీముల్లా వీటికి మరమ్మతు చేయించారు. అనంతరం శకునాలపల్లి, కుర్రపల్లి, బీసీ కాలనీ, శకునాలపల్లి ఎస్సీ కాలనీల్లోని రోడ్ల వెంట బ్లీచింగ్ చల్లించారు. ట్యాంకులను శుభ్రం చేయించారు. కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు తేజ, షరీఫ్ పాల్గొన్నారు.

చెన్నకేశవుడికి వైభవంగా గజవాహనసేవ


గజ వాహనంపై చెన్నకేశవస్వామి

సంగం, జూలై 22: మర్రిపాడు చెన్నకేశవస్వామి ఆదివారం అర్ధరాత్రి గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా అశ్వర్థనారాయణ కల్యాణం

స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం అశ్వర్థనారాయణ (రాగి, వేప చెట్లు) కల్యాణం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కల్యాణం తిలకించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ముత్యాల పూసల అలంకరణలో పోలేరమ్మ

తలుపూరుపాడు పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అభిషేకాలు నిర్వహించి, పోలేరమ్మదేవి మూల విరాట్‌కు ముత్యాల పూసలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ షేక్ నాజున్ని, ఖాదర్‌భాష దంపతులు మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గంధోత్సవ గోడపత్రిక ఆవిష్కరణ


గంధమహోత్సవ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

అనంతసాగరం, జూలై 22: స్థానిక కరీముల్లా షాఖాదరీ దర్గా గంధోత్సవం వేడుకల గోడపత్రికను సోమవారం దర్గా పెద్దలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 26న సందల్ మాలీ, 27న గంధం, ఖవ్వాలీ, 28న ఉరుసు, తహలీల్ పాతేహా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ముతావల్లి షేక్ సలావుద్దీన్, మహమ్మద్‌అలీ, ఖాదర్‌బాషా, అబ్దుల్‌గఫార్, ఖాసీంబాష, కరీముల్లా పాల్గొన్నారు.

కాలినడకన పెంచలకోనకు..


కాలినడకన పెంచలకోనకు వెళుతున్న టీడీపీ నేతలు

చేజర్ల, జూలై 22: తెలుగుదేశం అధికారంలోకి రావాలని, నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా.. నియోజకవర్గ శాసనసభ్యులుగా ఆనం రామనారాయణరెడ్డి గెలుపొంది మంత్రిగా బాధ్యతలు చేపట్టాలని పార్టీ మండలాధ్యక్షుడు రావి లక్ష్మీనరసారెడ్డి ఎన్నికల ముందు పెనుశిల లక్ష్మీనరసింహస్వామికి మొక్కుకున్నాడు. కోరిక తీరడంతో మొక్కు చెల్లించేందుకు సోమవారం యాన కుటుంబసభ్యులతో కలిసి పెంచలకోనకు కాలినడకన బయలుదేరారు. గ్రామ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను సాగనంపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

చేజర్ల, జూలై 22: ఆదురుపల్లి గ్రామంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు సోమవారం చిత్తలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా లెప్రసీ ప్రోగ్రామింగ్ అధికారి డా.సురేంద్రబాబు, చిత్తలూరు వైద్యాధికారి నవీన్ పాల్గొని లెప్రసీ మచ్చలు ఏ విధంగా కనుగొనాలి. తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై వివరించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు మోహన్‌రావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శైలజాకుమారి, సీహెచ్‌వో మంజుల పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగ్స్ పంపిణీ

చేజర్ల ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం 9వ వార్డు సభ్యురాలు సోమవరపు సంగీత చేతుల మీదగా ఉపాధ్యాయులు బ్యాగులను పంపిణీ చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణారెడ్డి, టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు హజరత్తయ్య, జయరామయ్య, వెంటకృష్ణ, రవికుమార్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మపేరుతో మొక్క నాటే కార్యక్రమం

సంగం, జూలై 22: దువ్వూరు ఎలైట్ ఉన్నత పాఠశాలలో పీఎం ప్రవేశ పెట్టిన అమ్మ పేరుతో ఒక మొక్క నాటే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆపస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ పాల్గొని పాఠశాలలో మొక్క నాటారు. ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వేణుగోపాల్, స్కూల్ డైరెక్టర్ వాసంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన స్వచ్ఛంద సంస్థల అధ్యక్షుడు

ఉదయగిరి రూరల్, జూలై 21: సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామిని సోమవారం రాజధాని సచివాలయంలో రాష్ట్ర స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్షుడు పీవీ రమణయ్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, ఉద్యోగుల పదోన్నతులపై ఎస్సీ, ఎస్టీలకు జరుగుతున్న అన్యాయాల గురించి వివరించామని తెలిపారు. ఆయన వెంట బాలగంగాధర్‌తిలక్ స్వచ్ఛంద సంస్థల రాష్ట్ర సలహాదారు పీ.ప్రకాష్, డైరెక్టర్ ఎం.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక గ్రామసభలు

ఉదయగిరి, జూలై 22: దాసరిపల్లి, అప్పసముద్రం, పుల్లాయపల్లి పంచాయతీ కార్యాలయాల్లో సోమవారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. సర్పంచులు కల్లూరి శ్యామలాదేవి, సయ్యద్ గౌస్‌మొహిద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో కార్యదర్శులు తేజ, చంద్రశేఖరరెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: జయపురం పంచాయతీ కార్యాలయంలో ఉప సర్పంచి కోనేశ్వరరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్ పాల్గొని మాట్లాడారు. జల జీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ద్వారా మంచి నీటిని సరఫరా చేస్తామన్నారు. ప్రజా సమస్యలకు పరిష్కారానికి కార్యదర్శి, సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. పంచాయతీలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని తెలిపారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచాలి

ఆత్మకూరు, జూలై 22 : విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆత్మకూరు ఉప విద్యాశాఖాధికారి గోపాల్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏడురోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనంతలక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ వంటేరు మల్లికార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కావలి : తుమ్మలపెంట రోడ్డులో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్‌ను జిల్లా అకౌంట్స్ మానిటరింగ్ ఆఫీసర్ జీ. సుధాకరరావు ప్రారంభించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల చేత తయారు చేయించిన బోధనోపకరణాలను ప్రదర్శించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కావలి ఉప విద్యాశాఖ అధికారి రఘురామ య్య, మండల విద్యాశాఖ అధికారులు గోవిందయ్య, వెంకటసుబ్బయ్య, హెచ్‌ఎం నీరజ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం: మండలంలోని మాలకొండరాయునిపాలెం పాఠశాలలో సోమవారం శిక్షాసప్తాహ్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఎం కే వెంకట కృష్ణారెడ్డి పర్యవేక్షణలో విద్యార్థులు స్థానిక వనరులతో బోధన అభ్యసనా సామగ్రిని తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు తిరుమల, విద్యార్థుల తలిదండ్రులు పాల్గొన్నారు.

కొండాపురం : బోధనా అభ్యసనా కృత్యాలు విద్యలో ఎంతో కీలకమని ఎంఈవో- 1 రవికుమార్, ఎంఈవో-2 ఆనందరావు అన్నారు. శిక్షా సప్తాహ్ లో భాగంగా సోమవారం మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ విద్యార్థులు అభ్యసనా కృత్యాలు ప్రదర్శించారు. కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలు, ఇతర పాఠశాలలకు వెళ్లి ఎంఈవోలు అభ్యసనాకృత్యాలను పరిశీలించారు. ఈకార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనంతసాగరం : చిలకలమర్రి ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం ఎస్ఈపీ ఆకారంలో చేసిన ప్రదర్శన ఆకట్టుకొంది. ఈ నెల 28 వరకు సప్తాహ్ (విద్యావారం) కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. నూతన జాతీయ విద్యావిదానం అమలు చేసి నాలుగేళ్లు పూర్తికావడంతో న్యూ ఎడ్యుకేషన్ పాలసీ ఆకారంలో విద్యార్థులచే ప్రదర్శన చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, మదీనా పాల్గొన్నారు.


కావలి : సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు


ఆత్మకూరు : విద్యార్థుల నమూనాలను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో గోపాల్

సాయినాథుడి గ్రామోత్సవం



కలిగిరి, జూలై 22: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం విశేషపుష్పాలంకరణతో స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన కోలాటం, భజన అందరినీ ఆకట్టుకుంది.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం, జూలై 22 : మండలంలోని మొగిలిచెర్ల మన్నేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు.ఎస్సై ఎం బాజీబాబుకు అందిన ముందస్తు సమాచారంతో సోమవారం మధ్యాహ్నం మన్నేరులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మోటారు బైకుల ఢీ : ఇద్దరికి గాయాలు


గాయపడిన మాల్యాద్రి

వలేటివారి పాలెం, జూలై 22 : ఎదురెదురుగా వస్తున్న మోటారు బైకులు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలవగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి.ఈ సంఘటన మండలంలోని బొంతవారిపాలెం వద్ద జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగింది. ఈ ప్రమాదంలో మండలంలోని బంగారక్కపాలెంకి చెందిన దేపూరి మాల్యాద్రికి స్వల్ప గాయాలు కాగా, కందుకూరుకు చెందిన ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మాల్యాద్రి కందుకూరు నుంచి మోటారు బైకుపై బంగారక్కపాలెం వస్తుండగా అదే సమయంలో మరో వ్యక్తి బొంతవారిపాలెంలో బేల్దారి పని చేసి ముగించుకొని కందుకూరు వెళ్తుండగా అదుపుతప్పి రెండు మోటారుబైకులు ఢీకొన్నాయి. గాయపడిన ఇద్దరిని 108 వాహనంలో కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేస్తున్నారు.

ప్రతి ఇంటికి తాగునీరే లక్ష్యం

అల్లూరు, జూలై 22 : ప్రతీ ఇంటికి తాగునీటిని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని ఎంపీడీవో జ్యోతి అన్నారు. మండలంలోని బీరంగుంట, పురిణి, ఇందుపూరులలో సోమవారం గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా పురిణిలో ఆమె మాట్లాడారు. తాగునీటికోసం జలజీవన్ మిషన్ పథకాన్ని ప్రవేశపెట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా ల నిధులతో తాగునీటి సమస్యను తీర్చేందుకు కార్యాచరణ చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, మండల అధికారులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన

లింగసముద్రం, జూలై 22 : మండలంలోని మొగిలిచర్ల రైతు భరోసా కేంద్రంలో సోమవారం కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులపై మండల వ్యవసాయ అధికారి టీ అబ్రహాం లింకన్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు,టీ దీప, వీఆర్‌వో వినోద్, రైతులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించండి మహాప్రభో..!

కొండాపురం, జూలై22: అంగన్‌వాడీ భవన నిర్మాణానికి బిల్లులు విడుదలయినా చెల్లించడంలేదంటూ కాంట్రాక్టరు నర్రావుల వెంకటేశ్వర్లు ప్రజా విజ్ఞప్తుల దినం సందర్భంగా సోమవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని పెరికపాలెంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ.3.50 లక్షలకు అగ్రిమెంటు చేసుకొని సీలింగ్, గోడలు ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్, వంటశాల పూర్తిచేశానని తెలిపారు. పంచాయతీ ఖాతాలో రెండు నెలల క్రితం నగదు జమ అయినా ఇప్పటివరకు నగదు ఇవ్వలేదన్నారు. తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

కందుకూరు, జూలై 22: రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతలు లేవని వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వంలో శాంతిభద్రతలు లేవని మాట్లాడితే ప్రజలు క్షమించరన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించే విధానాలకు ఇప్పటికైనా జగన్ స్వస్తి పలక్కపోతే వైసీపీని రాష్ట్రంలోనే లేకుండా ప్రజలు తరిమికొడతారని ఆయన హెచ్చరించారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రంలో ఎన్నో దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, మహిళలపై అత్యాచారాలు జరిగాయని ఆయన పేర్కొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని ధర్నా



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

కావలిటౌన్, జూలై22: పెండింగ్ జీతాలు చెల్లించాలని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ప్రజా విజ్ఞప్తుల దినంలో సమస్యల పరిష్కారం కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు షేక్ రెహనాబేగం మాట్లాడుతూ పెండింగ్ జీతాలు, సమ్మె కాలంనాటి జీతాలు, హెల్త్ అలవెన్సు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తురకా శీనయ్య, శివకోటయ్య, ఒంగోలు రమేష్, పరుసు జేమ్స్, బాబు, క్రాంతి, పీ అనిత తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన మెగా అభిమానులు


మొక్క నాటుతున్న మెగా అభిమానులు

గుడ్లూరు, జూలై 22: మండలంలోని చేవూరు హైస్కూల్ ప్రాంగణంలో మెగా అభిమానులు, జనసేన నాయకులు, కార్యకర్తలు సోమవారం మొక్కలు నాటారు. జనసేన నియోజకవర్గ నాయకులు దేవళ్ల భాస్కర్ మాట్లాడుతూ.. ఆగస్టు 22న చిరంజీవి జన్మదినం సందర్భంగా ప్రతి నెలా 22న ఏదో ఒక ప్రాంతంలో మొక్కలు నాటుతామన్నారు. అందులో భాగంగా చేవూరు హైస్కూల్లో మొక్కలు నాటామన్నారు.కార్యక్రమంలో మండల జనసేన నాయకులు మూలగిరి శ్రీనివాసులు, చేవూరు సర్పంచి శెట్టిపల్లి వెంకటేశ్వర్లు, అనిమిశెట్టి మాధవరావు, భైరవరపు రాజశేఖర్, ఆత్మకూరు సుధాకర్, అన్నంగి చలపతి, సన్నిశెట్టి గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు అవగాహన సదస్సు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శేషయ్య

కావలిటౌన్, జూలై22: విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం కొత్తగా చేరిన విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శేషయ్య మాట్లాడుతూ నేటి సమాజం సాంకేతిక పరిజ్ఞానంతో ముడిపడివుందని, విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యనభ్యసించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అడ్మిషన్ ఇన్‌చార్జ్ సుబ్బయ్య, ప్లేస్‌మెంట్ అధికారి వంశీమోహన్, వైస్ ప్రిన్సిపాల్స్ సునీల్, శ్రీనాథ్‌రెడ్డి, వివిధ విభాగాధిపతులు కొండారెడ్డి, స్రవంతి, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ ఉద్యోగమే లక్ష్యంగా ప్రణాళిక

కందుకూరు : తమ కళాశాలలో చేరిన ప్రతిఒక్కరూ కార్పొరేట్ ఉద్యోగంతో బయటకు వెళ్లేలా చూడటమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య పేర్కొన్నారు. సోమవారం కళాశాలలోని ఓపెన్ ఆడిటోరియంలో జరిగిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టెక్నికల్ డైరక్టర్ కే విజయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ఏడాది తమ కళాశాల సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ విద్యార్థులు 40 మంది హుండాయ్, టీవీఎస్ కంపెనీలకు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టరు సురియా, మీరావలి,జీ ప్రసాద్, డాక్టరు శైలేష్, హిమబిందు, సులోచన తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పొగనారుకు కొత్తభూమిని ఎంచుకోవాలి


ప్రసంగిస్తున్న డాక్టరు ప్రసాద్‌బాబు

కందుకూరు, జూలై 22: పొగాకు నారుమడి పొలాన్ని ప్రతిఏటా మార్చటం వల్ల నాణ్యమైన పొగనారు పెంచుకోవచ్చునని కందుకూరు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు జీ ప్రసాద్‌బాబు తెలిపారు. కేవీకేలో సోమవారం పొగాకు రైతులకు నాణ్యమైన పొగనారు పెంపకంపై ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా ఒకేచోట నారుమడి పెంచితే చీడపీడలు, వివిధ వ్యాధులు సోకడమేగాక వంగడాల కల్తీ జరిగి నాణ్యమైన పొగనారు రాదన్నారు. నారుమడులు సిద్ధం చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, నారుమడులు సాగుచేసే రైతులు తదితరులు పాల్గొన్నారు.

పరిష్కార వేదికకు ఐదు వినతులు

కందుకూరు, జూలై 22: మున్సిపాలిటీలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయా సమస్యలను తక్షణం పరిష్కరించాలని సెక్షన్ హెడ్స్‌కు ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. పారిశుద్ధ్యం, వీధిలైట్లు, తాగునీరు లాంటి సమస్యలపై ప్రజలు 91777 00267 నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక డ్రైవ్

కలిగిరి, జూలై 22: మంగళవారం నుంచి ఈనెల 27వరకు మండలంలోని పెదకొండూరు, క్రాకుటూరు సచివాలయాల్లోనూ, సిద్ధనకొండూరు జడ్పీ ఉన్నతపాఠశా లలోనూ ఆధార్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రంగసుబ్బరాయుడు తెలిపారు. ఈ డ్రైవ్‌లో చిన్నారులకు నూతన ఎన్‌రోల్‌మెంట్, ఆధార్‌లో చిరునామా మార్చటం, ఈకేవైసీ సేవలు అందిస్తామన్నారు. ఆయా ప్రాంత ప్రజలు ఈ సేవలు వినియోగించుకోవాలని తెలిపారు.